మంగళవారం
17•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 172
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE









### బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే

# సెంగార్ రేపిస్ట్

- ఉన్నావ్ లైంగికదాడి కేసులో దోషిగా నిర్ధారించిన ఢిల్లీ కోర్టు
- శిక్ష ఖరారుపై రేపు వాదనలు
- కేసు విచారణలో సీబీఐ నిర్లిప్తంగా వ్యవహరించిందంటూ మందలింపు
- దర్యాప్తులో మహిళా అధికారి లేకపోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్య

**దేశవ్యాప్తంగా** సంచలనం సృష్టించిన ఉన్నావ్ లైంగికదాడి కేసులో ఢిల్లీ కోర్టు బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను దోషిగా తేల్చింది. సమాజంలో పలుకుబడిగల వ్యక్తి (ఎమ్మెల్యే)కి వ్యతిరేకంగా పోరాడేందుకు బాధితురాలు కొంత సమయం తీసుకున్నదని, ఆమె ఇచ్చిన వాంగ్మూలం సత్యమైనదని కోర్టు పేర్కొంది. ఈ కేసు విచారణలో సీబీఐ నిబంధనలు ఉల్లంఘించిందని మండిపడింది. చార్జిషీటు దాఖలులో జాప్యం చేయడం, దర్యాప్తు సమయంలో మహిళా అధికారి లేకపోవడంపై కోర్టు విస్మయం వ్యక్తంచేసింది. పోక్సో చట్టంలో లోపంలేదని, అధికారుల అసమర్థత, అమానవీయ దృక్పథం వల్లనే బాధితులకు న్యాయం ఆలస్యంగా అందుతున్నదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో మరో నిందితుడు శశిసింగ్‌ను నిర్దోషిగా విడుదల చేసిన కోర్టు.. దోషిగా ఖరారైన కుల్దీప్ సెంగార్‌కు విధించాల్సిన శిక్షపై బుధవారం విచారణ జరుపనుంది. ఉన్నావ్ లైంగికదాడి కేసుతో సంబంధమున్న మరో నాలుగు కేసుల విచారణ ఇంకా కొనసాగుతున్నది.

వివరాలు 5వ పేజీలో

# నాలుగు నెలల్లో రామమందిరం



ఆకాశాన్ని తాకేలా నిర్మిస్తాం

జార్ఖండ్ ఎన్నికల ప్రచారసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడి

III

# నిరసనల హోరు




పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సోమవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

- జామియా వర్సిటీలో పోలీసుల దమనకాండకు నిరసనగా ఏకమైన విద్యార్థిలోకం
- దేశవ్యాప్తంగా వివిధ వర్సిటీల్లో ఆందోళనలు
- మూడు ఐఐటీల సంఘీభావం
- పోలీస్ చర్యను నిరసిస్తూ ప్రధానికి ఐఐఎం-బెంగళూరు విద్యార్థుల లేఖ

**పౌరసత్వ** సవరణ చట్టానికి వ్యతిరేకంగా, ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసుల దమనకాండకు నిరసనగా విద్యార్థిలోకం కదం తొక్కింది. దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు సోమవారం పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సాధారణంగా ఉద్యమాలకు దూరంగా ఉండే ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ముంబై విద్యార్థులు సైతం నిరసనల్లో పాల్గొనడం విశేషం. పోలీస్ చర్యను ఖండిస్తూ ఐఐఎం-బెంగళూరు విద్యార్థులు ప్రధాని మోదీకి లేఖరాశారు. సహచర విద్యార్థులపై పోలీసుల దాడిని నిరసిస్తూ జామియా విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నద్వా కళాశాల ఆందోళనలతో దద్దరిల్లింది. విద్యార్థులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. విద్యార్థులు కళాశాల నుంచి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.

5



### నా ప్రాణం ఉన్నంతదాకా..

ఎన్నార్సీ, సీఏఏ బెంగాల్‌లో అమలుకావు: మమత

5

### ఇది పిరికిపంద ప్రభుత్వం

విద్యార్థులపై పోలీసు చర్య భారతీయ ఆత్మపై దాడి : ప్రియాంకాగాంధీ



# కబ్జాలకు చెక్

బాలాపూర్ రెవెన్యూ పరిధిలో చెరవీడిన ప్రభుత్వ భూములు

- 400 ఎకరాల్లో హెచ్చరిక బోర్డులు
- సరిహద్దులు గుర్తిస్తున్న అధికారులు
- కోర్టు వివాదంలో ఉన్న భూములపై పరిశీలన
- కబ్జాదారులపై క్రిమినల్ కేసుల నమోదు
- చెరువులు, నాలాల్లో కబ్జాలపైనా నజర్




బడంగ్‌పేట ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

**బడంగ్‌పేట:** కబ్జాకోరల నుంచి ప్రభుత్వ భూములు చెరవీడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలాపూర్ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను కందుకూరు ఆర్డీవో రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. బాలాపూర్ మండల తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో ఆర్ఐలు, వీఆర్వోలు, వీఆర్ఏలు ప్రభుత్వభూముల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. బాలాపూర్ మండల రెవెన్యూ పరిధిలో 400 ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూమిలో రెవెన్యూ గ్రామాలవారీగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా స్వాధీనం చేసుకుంటున్నారు. చెరువు పరిధిలో ఉన్న భూములను పరిశీలించి ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని ఇరిగేషన్ అధికారులకు లేఖలు రాస్తున్నారు. బాలాపూర్ మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అందులో చాలావరకు ఆక్రమణల్లో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. కొన్ని ప్రభుత్వ భూములు కోర్టు వివాదంలో ఉన్నట్లు తేల్చారు. గతంలో ప్రభుత్వం వివిధసంస్థలకు కేటాయించిన భూమి కూడా పరాధీనమైనట్టు అధికారుల సర్వేలో తేలింది. ఇటీవల మామిడిపల్లి రెవెన్యూ పరిధిలో 99/1 సర్వే నంబర్‌లో వివిధసంస్థలకు కేటాయించిన భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించిన అధికారులు.. వాటిని చెర నుంచి విడిపించారు. గతంలో గ్రామస్థాయిలో పనిచేసిన రెవెన్యూ అధికారులు పైఅధికారులకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వకపోవడంతో ప్రభుత్వ భూములు పరాధీనమైనట్టు ఇటీవల అధికారులు చేసిన సర్వేలో వెల్లడైందని సమాచారం. కోర్టు పరిధిలో

మిగతా 2వ పేజీలో



యాదాద్రిలో లోపలి ప్రాకారంలో పూర్తయిన ఫ్లోరింగ్ పనులు

# నేడు సీఎం యాదాద్రికి



ఆలయ నిర్మాణ పనులు పరిశీలించి సూచనలు

యాగం నిర్వహించే స్థలాన్ని గుర్తించనున్న సీఎం కేసీఆర్

**మహాద్భుతంగా రూపొందుతున్న ఆలయం**

- నగిషీలతో తుదిరూపునిస్తున్న శిల్పులు
- వడివడిగా ఆధ్యాత్మిక రాజధాని నిర్మాణం
- పన్నెండోసారి పర్యటిస్తున్న ముఖ్యమంత్రి

3






# మద్యం ధరలు 10% పెంపు

రేపటి నుంచి అమల్లోకి.. పాత నిల్వలకు పెంపు వర్తించదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో మద్యం ధరలు పెరిగాయి. అన్ని రకాల మద్యం ధరలను 10 శాతం పెంచుతున్నట్టు ఆబ్కారీశాఖ తెలిపింది. బాటిల్ సామర్థ్యాన్ని బట్టి రూ.20 నుంచి రూ.80 దాకా ధర పెరుగనున్నది. బీరు ధర రూ.10 నుంచి రూ.30 వరకు పెరుగుతుంది. ఈ ధరలు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని.. పాత నిల్వలకు ఈ పెంపు వర్తించదని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ధరలపెంపుతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.400 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని సమాచారం.

# పలువురు ఐపీఎస్‌ల బదిలీ

ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా సర్ఫరాజ్‌అహ్మద్ ఉత్తర్వులు జారీ

3



# ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సమత నిందితులు

న్యాయవాది నియామకానికి గడువు తిరస్కరణ

నేరారోపణ పత్రాలు నిందితులకు అందజేత

2

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 87.00 | రిటైల్ లైవ్ | 109.00 |
| డ్రెస్డ్ | 158.00 | స్కిన్‌లెస్ | 180.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 433.00 | రంగారెడ్డి | 433.00 |
| మెదక్ | 433.00 | కరీంనగర్ | 436.00 |
| వరంగల్ | 436.00 | డజన్ ధర | 66.00 |











హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో సోమవారం రాత్రి భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనం వింటున్న సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, సీఎం సోదరీమణులు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు సతీమణి శైలిమ తదితరులు



భాగవత సప్తాహంలో గజేంద్రమోక్షం ఘట్టాలను వివరిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు



తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో భాగవత సప్తాహంలో ప్రవచనం వింటున్న మాజీ ఎంపీ కవిత భర్త అనిల్‌కుమార్ తదితరులు



# గజేంద్రమోక్షం వింటే పుణ్యం

- భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు
- హాజరైన సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు

**కవాడిగూడ:** గజేంద్రమోక్షం ఘట్టాలు విన్నా.. చదివినా పుణ్యఫలం కలుగుతుందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో భాగంగా మూడోరోజు ఆయన గజేంద్రమోక్షం ఘట్టాలను వివరించారు. గజేంద్రమోక్షం పద్యాలను పిల్లలకు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, అనిల్ కుమార్ దంపతులు, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ ముఠా పద్మ, తెలంగాణ జాగృతి నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల దవాఖానలో ప్రసూతిసేవలు అద్భుతం

- మంత్రి కేటీఆర్‌కు ఓ వ్యక్తి ట్వీట్
- కలెక్టర్ వల్లే సాధ్యమైందని కేటీఆర్ రీ ట్వీట్




మంత్రి కేటీఆర్ చేసిన రీ ట్వీట్

**సిరిసిల్ల, నమస్తే తెలంగాణ:** 'సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానలో ప్రసూతి సేవలు బాగున్నాయి. నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లతో మెరుగైన సేవలు అందిస్తున్నారు' అంటూ సిరిసిల్లకు చెందిన మెరుగు సందీప్ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. మెరుగు సందీప్ భార్య స్నేహశ్రీని ప్రసవం కోసం ఆదివారం సాయంత్రం సిరిసిల్ల దవాఖానకు తీసుకొచ్చారు. వైద్యులు సకాలంలో స్పందించి సాధారణ ప్రసవంచేశారు. స్నేహశ్రీ పాపకు జన్మనిచ్చారు. దీంతో సర్కారు దవాఖానలో అందించిన సేవలు బాగున్నాయంటూ పాప తండ్రి సందీప్ సోమవారం మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలిపారు. స్పందించిన మంత్రి కేటీఆర్.. జిల్లాలో వైద్యసేవలు మెరుగుపర్చడంలో కలెక్టర్ ఎంతో శ్రద్ధ కనబర్చారని, ఈ ఘనత ఆయనకే దక్కుతుందని రీ ట్వీట్ చేశారు.

# మాంద్యంలోనూ మనమే మెరుగు

- ఇతరరాష్ట్రాల కంటే ఆరేడు శాతం ఆర్థికవృద్ధి
- కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధుల విడుదలలో జాప్యం
- నిధులపై 18న కేంద్ర ఆర్థికమంత్రిని ప్రశ్నిస్తాం
- ఎఫ్టీసీసీఐ సమావేశంలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు




సోమవారం ఎఫ్టీసీసీఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొన్నప్పటికీ తెలంగాణ ఆర్థికవృద్ధిలో మిగిలిన రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నదని ఆర్థికమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మిగిలిన రాష్ట్రాలు ఆర్థికవృద్ధిలో మైనస్‌లో ఉంటే తెలంగాణ ఆరేడు శాతం వృద్ధిలో ఉన్నదని చెప్పారు. సోమవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్టీసీసీఐ) ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లో 'విజన్ తెలంగాణ' అంశంపై పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుంచి వివిధ పథకాల రూపంలో రావాల్సిన నిధుల విడుదలలో జాప్యమవుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఐజీఎస్టీ వాటా, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నిధుల్లో చాలా కోతలు ఉన్నాయని, అనుకున్నన్ని నిధులు రాకపోవడంతో బడ్జెట్‌ను చేరుకోలేకపోతున్నామని చెప్పారు. 18న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కేంద్రబడ్జెట్‌పై రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సలహాలు, సూచనలకు సమావేశం ఏర్పాటుచేశారని, ఆ వేదికపై రాష్ట్రానికి రావాల్సిన నిధులపై గట్టిగా అడిగి రాబట్టడానికి ప్రయత్నంచేస్తానని తెలిపారు. జీడీపీ 4.5 శాతం ఉన్నదని, ఇది కూడా తప్పని.. నాలుగు శాతంలోపేనని కొందరు అంటున్నారని దీనికి కారణంపై కేంద్రం ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. వ్యాట్‌లో ఉన్న పెండింగ్ కేసులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద కేంద్రం తరహాలో ఒక విధానం తేవాలని పారిశ్రామికవేత్తలు కోరారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక మందగమనం నుంచి బయటికి రావడానికి అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

### పారిశ్రామికవృద్ధికి ఎక్కువ అవకాశం

రాష్ట్రంలో టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమలకు అతితక్కువ సమయంలో అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవృద్ధికి రాష్ట్రంలో ఎక్కువ అవకాశమున్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కొత్తగా ఫార్మాసిటీ, టెక్స్‌టైల్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ హబ్ కూడా వస్తుందని తెలిపారు. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు విడుదలచేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్‌ను పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ కోరారని చెప్పారు. రాయితీలను త్వరలో విడుదల చేస్తామని, ఇప్పుడు సాధ్యంకాకుంటే వచ్చే ఆర్థికసంవత్సరం మొదట్లో విడుదలకు ప్రయత్నిస్తామన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే 145 క్లస్టర్లను గుర్తించామని తెలిపారు. పర్యావరణం దృష్ట్యా గతంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ పరిశ్రమపై ఆధారపడిన కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధికల్పనకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటుకు అనేక అపోహాలు, అనుమానాలు, సందేహాలను వ్యక్తంచేశారని, వాటన్నంటిని సీఎం కేసీఆర్ పటాపంచలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే అంధకారం అవుతుందని, పాలన రాదని ప్రచారం చేశారని, కానీ సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ఇక్కడి పథకాలను దేశంలోని అనేకరాష్ట్రాలు అమలుచేయడానికి అధ్యయనానికి వచ్చాయని చెప్పారు. సమావేశంలో ఎఫ్టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి మాట్లాడుతూ ఆర్థిక మాంద్యానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు రావాల్సిన బకాయిలను త్వరగా విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఎఫ్టీసీసీఐ ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రమాకాంత్ ఇనాని పాల్గొన్నారు.

# తుదిదశలో మున్సిపల్ వార్డుల విభజన?

- నేటితో ప్రక్రియ పూర్తి
- ఒకట్రెండు రోజుల్లో ఎస్ఈసీకి తుది జాబితా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 131 మున్సిపాలిటీల వార్డుల విభజన తుదిదశకు చేరింది. వార్డుల విభజన వివరాలను మంగళవారంలోపు సమర్పించాలని అన్ని మున్సిపాలిటీలను పురపాలకశాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ కమిషనర్లు వార్డుల విభజనకు సంబంధించిన తుది సమాచారాన్ని సీడీఎంఏ కార్యాలయానికి సమర్పించినట్టు సమాచారం. ఇంకా అందజేయనివారు నేటి సాయంత్రంలోగా అందజేయనున్నారు. మున్సిపాలిటీల నుంచి అందిన తుదిజాబితాను పురపాలన (సీడీఎంఏ- కమిషనర్, డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) విభాగం ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించనున్నట్టు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 3న మున్సిపాలిటీల్లో వార్డుల విభజన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పురపాలకశాఖ విడుదలచేసింది. ఇందుకు సంబంధించి పత్రికల్లో ప్రకటనలను ఇచ్చి.. డిసెంబర్ 9 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. తర్వాత, వారంరోజులపాటు ప్రజల అభ్యంతరాలు, సూచనలపై విచారణ జరిపి కౌన్సిల్, స్పెషలాఫీసర్ల అనుమతి తీసుకున్నది. దీంతో మంగళవారంతో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి కానున్నదని సమాచారం.

# హెచ్ఐసీసీలో నేటినుంచి అంతర్జాతీయ సదస్సు

పాల్గొననున్న నిపుణులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికైంది. 'హై పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్, డాటా, అనలిటిక్స్' (హెచ్ఐపీసీ) సదస్సు మంగళవారం నుంచి నాలుగురోజులపాటు హెచ్ఐసీసీలో జరుగనున్నది. అమెరికా, ఐరోపా, చైనా, జపాన్ వంటి దేశాల నుంచి నిపుణులు, కార్పొరేట్ లీడర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ కామర్స్, రిటైల్, హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, వ్యవసాయం, వాతావరణం, అంతరిక్షశాస్త్ర పరిజ్ఞానం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ప్రఖ్యాత విద్యావేత్తలు, పారిశ్రామిక పరిశోధకులు పాల్గొని తమ ప్రస్తుత అధ్యయనాలు, అత్యుత్తమ ప్రమాణాల గురించి వివరిస్తారు.

# కార్మికులు కాదు ఉద్యోగులు

## అన్ని డిపోలకు సర్క్యులర్ జారీచేసిన ఆర్టీసీ యాజమాన్యం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రగతిభవన్‌లో ఈ నెల 1న జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిలబెట్టుకొన్నారు. ఆర్టీసీ సిబ్బంది మధ్య అంతరాలు ఉండకూడదని, కార్మికులను ఉద్యోగులుగా సంబోధించి అందరూ పోటీతత్వంతో పనిచేయాలని ఆ సమావేశంలో సీఎం కేసీఆర్ చేసిన సూచనకు అనుగుణంగా టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సోమవారం సర్క్యులర్‌ను జారీచేసింది. దీని ప్రకారం టీఎస్‌ఆర్టీసీలోని అన్ని విభాగాల సిబ్బందిని ఇకపై ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ స్టాఫ్‌ను సైతం ఉద్యోగులుగానే పిలువనున్నారు. సంస్థ అంతర్గత చర్చలతోపాటు డిపో లేదా యూనిట్ నోటీసుబోర్డుల్లో వారిని ఉద్యోగులుగానే సంబోధించనున్నారు. ఈ మేరకు అన్ని డిపోలకు సర్క్యులర్ జారీచేయడంపై సంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు.

# ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సమత నిందితులు

ముహూర్తం



సూర్యోదయం: 6.42 గంటలకు



సూర్యాస్తమయం: 5.36 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం షష్ఠి అర్ధరాత్రి 1.38 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: మఖ అర్ధరాత్రి 1.27 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: రాత్రి 11.11 నుంచి 12.41 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 2.52 నుంచి సాయంత్రం 4.15 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.53 నుంచి 9.37 వరకు, తిరిగి మధ్యాహ్నం 1.58 నుంచి 2.41 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.07 నుంచి 3.37 వరకు.

- న్యాయవాది నియామకానికి గడువు తిరస్కరణ
- నేరారోపణ పత్రాలు నిందితులకు అందజేత
- కోర్టే న్యాయవాదిని నియమించే అవకాశం



సమత కేసు నిందితులను ఆదిలాబాద్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** సమత కేసులో ముగ్గురు నిందితులను కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు ఆదిలాబాద్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో సోమవారం ప్రవేశపెట్టారు. పోలీసు బందోబస్తు నడుమ నిందితులు షేక్‌బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ ముగ్దుంను కోర్టుకు తీసుకొచ్చారు. ఈ కేసుకు 117/2019 నంబర్‌ను కేటాయించగా నిందితుల తరఫున వాదించడానికి న్యాయవాదులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నిందితులు న్యాయవాది నియామకం కోసం రెండురోజుల గడువు కోరగా ఇందుకు కోర్టు తిరస్కరించింది. పోలీసులు నేరారోపణచేసిన పత్రాలను కోర్టు నిందితులకు అందజేసింది. నిందితులు మంగళవారంలోగా న్యాయవాదిని నియమించుకోకపోతే కోర్టు న్యాయవాదిని నియమించే అవకాశాలున్నాయి. కాగా, పోలీసులు శనివారం కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయగా, కేసు విచారణను కోర్టు సోమవారానికి వాయిదావేసింది. గత నెల 24న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌కు ఉపాధి కోసం వచ్చిన సమతను అదే ఊరికి చెందిన షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ ముగ్దుం రాంనాయక్‌తండా శివారులోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడి, అనంతరం గొంతుకోసి హతమార్చారు. ఒంటిపై ఉన్న నగలను దోచుకొనిపోయారు. సమత భర్త ఫిర్యాదు మేరకు మిసింగ్ కేసు నమోదుచేసుకున్న లింగాపూర్ పోలీసులు మరుసటి రోజు చెట్ల పొదల్లో మృతదేహాన్ని గుర్తించారు. ఘటనాస్థలంలో మృతురాలి దుస్తులను స్వాధీనంచేసుకున్నారు. అదే నెల 27న నిందితులు షేక్ బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ ముగ్దుంను ఆదిలాబాద్ సమీపంలో అరెస్టుచేశారు. చార్జిషీట్‌లో ఏ-1గా షేక్‌బాబా, ఏ-2గా షేక్ షాబొద్దీన్, ఏ-3గా షేక్ ముగ్దును చేర్చారు. ముగ్గురు నిందితులపై హత్య, సామూహిక లైంగికదాడికి సంబంధించిన సెక్షన్ 302, 306డీ కింద పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతోపాటు సెక్షన్ 03 సబ్ క్లాజ్, 02, 05 కింద అట్రాసిటీ కేసు, సమత ఒంటిపై ఉన్న నగదు దోచుకెళ్లినందుకు 404 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మొత్తం 44 మంది సాక్షులను చేర్చగా ఇందులో ఇద్దరు పోలీసు అధికారులు, 32 మంది సాధారణ ప్రజలు, మిగతావారు డీఎన్ఏ, ఎఫ్ఎల్‌సీ రిపోర్టు నమోదుచేసిన డాక్టర్లు ఉన్నారు.

# హెచ్ఎండీఏ ఖజానా గలగల

**కాసులు కురిపించిన ఉప్పల్ భగాయత్ ప్లాట్లు ▪ మూడురోజుల ఈ- వేలంలో రూ.364 కోట్ల రాబడి**

- 127 ప్లాట్లలో అమ్ముడుపోయిన 102
- చివరి రోజూ గజం గరిష్ఠ ధర రూ.76,100
- రెసిడెన్షియల్, మల్టీపర్పస్ ప్లాట్లవైపే బిడ్డర్ల మొగ్గు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హెచ్ఎండీఏకు ఉప్పల్ భగాయత్ లే అవుట్ ప్లాట్ల రూపంలో కాసుల వర్షం కురిసింది. శని, ఆది, సోమవారాల్లో నిర్వహించిన ఈ- వేలంలో మొత్తం 127 ప్లాట్లకు 102 అమ్ముడుపోయాయి. సింగిల్ బిడ్, అసలే కోడ్ చేయకుండా ఉండటంతో 25 ప్లాట్లు వేలానికి దూరంగా ఉన్నాయి. 1,66,989.1 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్లను అమ్మకానికి పెట్టగా, 78,314.02 గజాలు అమ్ముడుపోయింది. బిడ్డర్లు రెసిడెన్షియల్, మల్టీపర్పస్ ప్లాట్లవైపే మొగ్గు చూపారు. కమర్షియల్ ప్లాట్లలో ఒక్కటి కూడా అమ్ముడుపోలేదు. బిడ్డర్లు పోటీపడి రికార్డుస్థాయి ధరతో ప్లాట్లను దక్కించుకున్నారు. ఫేజ్-1 లే అవుట్‌లోని 525 గజాల ప్లాట్ (నంబర్ 127) గజం ఏకంగా రూ.79,900 ధర పలికింది. అత్యల్పంగా రూ.30,100కు అమ్ముడు పోయింది. మొత్తం ప్లాట్ల ద్వారా రూ.554 కోట్ల ఆదాయం వస్తుందని హెచ్ఎండీఏ అంచనా వేసింది. రెసిడెన్షియల్‌కు ఆఫ్‌సెట్ ధర గజానికి రూ.30 వేలు, కమర్షియల్ ప్లాట్‌కు గజం రూ.40 వేలు ఖరారుచేసి రూ.234.94 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. బిడ్డర్ల పోటీతత్వంతో రూ.364.71 కోట్ల ఆదాయం సమకూరింది. 55 శాతం మేర అధికంగా ఆదాయం వచ్చింది. వాణిజ్య ప్లాట్లకు బిడ్డర్లు విముఖత చూపడం అధికారులను ఒకింత షాక్‌కు గురిచేసింది. రెండురోజులపాటు రికార్డుస్థాయిలో ప్లాట్లకు ధర పలికిన విషయం తెలిసిందే. సోమవారం మొదటి సెషన్‌లో 15 మల్టీపర్పస్ ప్లాట్లకు (విస్తీర్ణం సగటున 38,662.48 చదరపు గజాలు) ఈ- వేలం నిర్వహించారు. అత్యధికంగా చదరపు గజానికి రూ.76,100 ధర పలికింది. తద్వారా రూ.74.44 కోట్ల ఆదాయం లభించింది. ఇక తొమ్మిది కమర్షియల్ ప్లాట్లు (విస్తీర్ణం సగటున 53,968.86 చదరపు గజాలు) వైపు బిడ్డర్లు కన్నెత్తి చూడలేదు. మూడు వేలు- 18 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల ప్లాట్లను దక్కించుకొనేందుకు ఆసక్తి కనబర్చలేదు. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్లే ఈ ప్లాట్ల కొనుగోలుకు ముందుకు రాలేదని రియల్టర్లతో చర్చ జరుగుతున్నది. గజానికి రూ.40 వేల అప్‌సెట్ ధర అధికంగా ఉన్నదని, ప్రధానంగా సంబంధిత తొమ్మిది ప్లాట్లలో విద్యాసంస్థలు, దవాఖానలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వినోదం తదితర వాణిజ్య కార్యకలాపాలు మాత్రమే నిర్వహించాలన్న నిబంధన పెట్టడం వల్లే మొగ్గు చూపలేదని చర్చించుకుంటున్నారు. అధికారులు మాత్రం ఫేజ్-1లోని ఐదు, ఫేజ్-2లోని నాలుగు కమర్షియల్ ప్లాట్లను చిన్న సైజు ప్లాట్లుగా మార్చాలా? లేక కమర్షియల్ ప్లాట్లలో ఏదైన వ్యాపార కార్యకలాపాలు నిర్వహించవచ్చన్న నిబంధనతో మరోసారి వేలం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు.

లోకం పోకడ




బలానికి ఇంజక్షన్ ఇస్తున్నా.. డోంట్ వర్రీ!

# కబ్జాలకు చెక్

మొదటిపేజీ తరువాయి...

ఉన్న భూములను మినహాయించి అన్ని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తామని అధికారులు చెప్తున్నారు. బాలాపూర్ మండల పరిధిలో చాలా రెవెన్యూ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల లెక్కలుతీసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

### హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట సర్వే నంబర్ 46లో 4.25 ఎకరాల్లో, జిల్లెలగూడ సర్వే నంబర్ 165లోని మూడు ఎకరాల్లో, సర్వే నంబర్ 119-1లో ఎకరా, సర్వే నంబర్ 76లో ఒక ఎకరా, సర్వే నంబర్ 124లో 28 గుంటలు, మామిడిపల్లిలో సర్వే నంబర్ 99/1లో 100 ఎకరాల్లో, సర్వే నంబర్ 240లో 35 గుంటలు, మల్లాపూర్‌లో రెండెకరాలు, అల్మాస్‌గూడలో రెండెకరాలు, బాలాపూర్‌లో 138, 139, 140 సర్వే నంబర్లలోని తొమ్మిది ఎకరాలు, కుర్మల్‌గూడలో 80/20లో రెండెకరాలు, 80/2లో రెండెకరాలు, 80/24లో రెండెకరాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో దిల్, హౌసింగ్ బోర్డు, హార్డ్‌వేర్ పార్కు, హిందు టెక్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రా కంపెనీలకు కేటాయించిన భూముల్లో కూడా హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేయిస్తున్నారు.

### కబ్జాదారులపై క్రిమినల్ కేసులు

బాలాపూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నవారిపై రెవెన్యూ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తున్నారు. ఎర్రకుంట, మల్లాపూర్‌లో ప్రభుత్వభూమిని ఆక్రమించినవారిపై బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో, కుర్మల్‌గూడలో కబ్జాచేస్తున్నవారిపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. ప్రభుత్వ భూములపై ఎవరు కన్నేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకాడటంలేదు. ఈ చర్యలతో కబ్జాలకు పాల్పడేవారిలో భయం మొదలైందని అధికారులు అంటున్నారు.

### ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యం



బాలాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

**బాలాపూర్** మండల పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడటమే ప్రధాన కర్తవ్యంగా పనిచేస్తాం. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను సర్వేచేయిస్తున్నాం. ఎక్కడ ఆక్రమణలు ఉన్నా తొలగిస్తున్నాం. అక్రమాలకు పాల్పడే ఎవరినీ వదలం. ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఇప్పటికే నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాం. మండలంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వాలని అన్ని రెవెన్యూ గ్రామాల అధికారులకు ఆదేశాలు జారీచేశాం. కోర్టు పరిధిలో ఉన్న భూములను పరిశీలిస్తున్నాం. చెరువుల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. నాలాల కబ్జాలను తొలగిస్తున్నాం. చెరువు పరిధిలో రాత్రి సమయంలో మట్టిపోసి కబ్జాలు చేస్తున్నారు. అటువంటి మట్టిని తొలగించాం. అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, బాలాపూర్ తాసిల్దార్

# జీఎస్టీ నష్టపరిహారం విడుదల

- 35,298 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- రాష్ట్రానికి వచ్చే బకాయి రూ.1,030 కోట్లు
- పెండింగ్‌లో మరో రూ.800 కోట్లు
- నేటి నుంచి జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వస్తు,సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు చెల్లించాల్సిన నష్టపరిహారం బకాయిల్లో రూ.35,298 కోట్లను కేంద్రం విడుదల చేసింది. అందులో తెలంగాణ వాటాగా రూ.1,030 కోట్లను విడుదల చేసినట్టు సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్‌శాఖ అధికారులు వెల్లడించారు. మరో రెండు నెలల బకాయిలను పెండింగ్‌లో ఉంచింది. వాస్తవానికి జీఎస్టీ నష్టపరిహారం బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజులుగా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు సీఎం కేసీఆర్ లేఖ కూడా రాశారు. జీఎస్టీ నష్టపరిహారం కింద చెల్లించాల్సిన రూ.1,830 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద మళ్లించిన రూ.2,800 కోట్లను వెంటనే విడుదల చేయాలని సీఎం డిమాండ్‌చేశారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు కూడా కేంద్రమంత్రికి సవివరమైన లేఖ రాశారు. జీఎస్టీ 38వ కౌన్సిల్ సమావేశం ఢిల్లీలో మంగళవారం నుంచి రెండురోజులపాటు జరుగనున్న క్రమంలో కేంద్రం బకాయిలు రూ.1,030 కోట్లు విడుదల చేసింది. అక్టోబర్, నవంబర్ బకాయిలు రూ.800 కోట్లను పెండింగ్‌లోనే ఉంచింది. ఐజీఎస్టీ నిధుల మళ్లింపుపై స్పష్టత ఇవ్వలేదు.

**రేపు హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు**

ఢిల్లీలో మంగళవారం జరిగే అధికారుల సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, వాణిజ్యపన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ హాజరుకానున్నారు. బుధవారం సమావేశానికి మంత్రి హరీశ్‌రావుతోపాటు సోమేశ్‌కుమార్ హాజరవుతారు. జీఎస్టీ నష్టపరిహారం బకాయిలు, ఐజీఎస్టీ నిధుల మళ్లింపు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తనున్నది.

# యువనేత సారథ్యానికి ఏడాది

- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్తా చాటిన కేటీఆర్
- పలు ఎన్నికల్లో ఘన విజయాలు
- పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యమపార్టీగా ఉన్న టీఆర్ఎస్.. రెండోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యం! ఒకవైపు పరిపాలన భారం.. మరోవైపు పార్టీ నిర్మాణ బాధ్యత! ఈ సమయంలో పూర్తిగా పరిపాలనపైనే దృష్టిసారించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. పార్టీ బాధ్యతలను యువనేత కే తారకరామారావుకు అప్పగించారు. సరిగ్గా ఏడాది క్రితం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కేటీఆర్.. సీఎం నమ్మకాన్ని వమ్ముచేయలేదు! పక్కా వ్యూహరచనతో పార్టీని విజయపథాన నడిపించడంతోపాటు.. క్యాడర్‌కు దగ్గరై.. నాయకత్వంతో సమన్వయం చేస్తూ టీఆర్ఎస్‌ను తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తూ, పార్టీని నవపథాన పయనింపజేస్తున్నారు.

### ఏడాదిలో ఎన్నో ఘన విజయాలు

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకున్న ఏడాదికాలంలో .. పార్టీ అనేక ఘన విజయాలు సాధించడంలో కేటీఆర్ కీలకపాత్ర పోషించారు. ఏ ఎన్నికైనా ప్రత్యర్థులకు అందనంతస్థాయిలో విజయాలను అందించడంలో ఆయన వ్యూహరచన తోడ్పడింది. ఈ క్రమంలోనే పార్లమెంట్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలతోపాటు హుజుర్‌నగర్ ఉపఎన్నికలో పార్టీ విజయబావుటా ఎగురవేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచింది. పరిషత్ ఎన్నికల్లో మొత్తం 32 జెడ్పీలపై గులాబీ జెండా ఎగురవేయడంలో కేటీఆర్ పాత్ర ఎనలేనిది.

### పార్టీ నిర్మాణంలో కొత్తపుంతలు

అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పార్టీ సభ్యత్వం 60 లక్షలు దాటే దిశగా నాయకుల్లో ఉత్సాహం నింపడమేకాకుండా.. దేశంలోనే తక్కువ సమయంలో ఎక్కువ సభ్యత్వాన్ని నమోదుచేసిన పార్టీగా టీఆర్ఎస్‌ను నిలిపారు. పోలింగ్‌బూత్, గ్రామ, వార్డు, డివిజన్, మండలస్థాయి కమిటీలను పూర్తిచేయించి పార్టీకి పటిష్ట నిర్మాణరూపాన్ని ఇచ్చేందుకు కృషిచేశారు. సామాజిక బాధ్యతను కూడా భుజానికెత్తుకుంటూ.. అర్హులైనవారు ఓటర్లుగా నమోదుచేయించుకోవడానికి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.

### హుజూర్‌నగర్ ఉపఎన్నిక విజయంలో..

హుజూర్‌నగర్ ఉపఎన్నిక విజయం టీఆర్ఎస్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదనే చెప్పాలి. కీలక సమయంలో పార్టీ వాణిని ప్రజలవద్దకు తీసుకుపోయేలా కేటీఆర్ చేసిన వ్యూహరచన తిరుగులేని ఫలితాన్నిచ్చింది. తొలుత రోడ్‌షో నిర్వహించిన కేటీఆర్.. టెలికాన్ఫరెన్సుల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, కార్యకర్తలకు సూచనలు చేస్తూ ముందుకు నడిపించడంతో టీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిచారు.

### ఎంపీలకు దిశానిర్దేశం

రాష్ట్రానికి రావాల్సిన నిధులతోపాటు వివిధ బిల్లులు, రిజర్వేషన్లపై టీఆర్ఎస్ ఎంపీలు పోరాటంచేసేలా కేటీఆర్ వారిని కార్యోన్ముఖులను చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు వారితో ప్రత్యేకంగా సమావేశమై కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటిపై రాష్ట్ర ప్రభుత్వపరంగా తీసుకున్న చర్యలను వివరిస్తూ సమాచారాన్ని అందించారు. అది ఎంపీలు కేంద్రాన్ని నిలదీయడానికి దోహదంచేసింది.

### మున్సిపల్ ఎన్నికలకు రెడీ

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఘనవిజయాలు సాధించేలా పార్టీని కేటీఆర్ సర్వసన్నద్ధంచేశారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా ఇప్పటికే ఇంచార్జిలను నియమించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్నారు. మున్సిపాలిటీల్లో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా మరింతబలోపేతం చేయడానికి తరుచు పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీపై, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలు, విమర్శలను సమర్థంగా తిప్పికొట్టేలా నాయకులకు సూచనలు ఇస్తున్నారు.



గత ఏడాది టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంలో కేటీఆర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు (ఫైల్)





కెనడాలోని అల్బెర్టా ప్రావిన్స్ మౌలికవసతులశాఖ మంత్రి ప్రసాద్ పండును సత్కరిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు.

## తెలంగాణ ఐటీ పరిశ్రమపై కెనడా ఆసక్తి

- సీఎం కేసీఆర్ అంటే గౌరవం: కెనడా మంత్రి ప్రసాద్
- కేటీఆర్‌తో భేటీ.. తమ దేశంలో పర్యటించాలని ఆహ్వానం
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఐటీ పరిశ్రమపై కెనడా పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని ఆ దేశంలోని అల్బెర్టా ప్రావిన్స్ మౌలికవసతులశాఖ మంత్రి ప్రసాద్ పండు తెలిపారు. సోమవారం రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావును నందినగర్ నివాసంలో కలిసిన ప్రసాద్.. అల్బెర్టా ప్రావిన్సు-తెలంగాణ మధ్య వ్యాపార అవకాశాలపై చర్చించారు. కెనడా నుంచి తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవకాశాలున్నాయని, తెలంగాణ పారిశ్రామిక విధానాలు, అవకాశాల గురించి తెలిపేందుకు కెనడాలో పర్యటించాలని మంత్రి కేటీఆర్‌ను ప్రసాద్ ఆహ్వానించారు. అల్బెర్టా ప్రావిన్సు ప్రీమియర్ జేసన్ కెన్నీని తెలంగాణలో పర్యటించాల్సిందిగా కోరామని, వచ్చే ఏడాది ఆయన ఇక్కడికి వస్తారని తెలిపారు. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యమాన్ని శాంతియుతంగా నడిపి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించినతీరుపై తమకు ఎంతో గౌరవం ఉన్నదని కేటీఆర్‌కు తెలిపారు. కెనడాలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయని, భారత్‌లో మానవవనరులు మెరుగ్గా ఉన్నాయని, ఈ రెండింటి కలయికతో వ్యాపారావకాశాలు ఏర్పడుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. తెలంగాణలోని టీఎస్ఐపాస్ తదితర పాలసీల ద్వారా ప్రపంచంలోని ప్రఖ్యాత కంపెనీలను తెలంగాణకు రప్పించిన తీరును మంత్రి కేటీఆర్ ఆయనకు వివరించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌తోపాటు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపతి శీతాకాల విడిది పర్యటనపై సోమవారం అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

## రాష్ట్రపతి పర్యటనకు పక్కా ఏర్పాట్లు

- 20 నుంచి 28 వరకు నగరంలో రాష్ట్రపతి కోవింద్
- పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. సోమవారం బీఆర్కే భవన్‌లో వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి 20న హైదరాబాద్ చేరుకొని 22 వరకు ఇక్కడే బసచేస్తారని, 23 నుంచి 25 వరకు తిరువనంతపురంలో పర్యటిస్తారని చెప్పారు. శీతాకాల పర్యటన ముగించుకొని 28న ఢిల్లీకి వెళ్తారని తెలిపారు. సమావేశంలో స్పెషల్‌సీఎస్ అజయ్‌మిశ్రా, అధర్‌సిన్హా, శాంతకుమారి, సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవిగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# నేడు యాదాద్రికి సీఎం కేసీఆర్

- ఆలయ నిర్మాణ పనుల పరిశీలించి సూచనలు
- యాగం జరిగే స్థలాన్ని గుర్తించనున్న సీఎం
- వడివడిగా ఆధ్యాత్మిక రాజధాని నిర్మాణం
- పన్నెండోసారి పర్యటిస్తున్న ముఖ్యమంత్రి

**గొట్టిపర్తి భాస్కర్‌గౌడ్,**
**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి,**
**నమస్తే తెలంగాణ / హైదరాబాద్:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ఉదయం 11 గంటలకు యాదాద్రి పర్యటనకు వెళతారు. యాదాద్రి ఆలయ నిర్మాణపనుల పురోగతిని సీఎం కేసీఆర్ పరిశీలిస్తారు. అలాగే ప్రెసిడెన్షియల్ సూట్, ఇతర కాటేజ్ నిర్మాణాలను పరిశీలించి మహా సుదర్శనయాగం జరిగే ప్రాంతాన్ని గుర్తిస్తారు. నిర్మాణ పనులపై అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, డీసీపీ కే నారాయణరెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. కొండపై జరుగుతున్న పనులను సీఎం కేసీఆర్ పరిశీలిస్తారని, శిల్పులు తుదిమెరుగులు దిద్దుతున్న పనులను ప్రత్యక్షంగా వీక్షిస్తారని వైటీడీఏ వైస్‌చైర్మన్ జీ కిషన్‌రావు తెలిపారు. కొండకింద ప్రెసిడెన్షియల్ సూట్ పనులు, పెద్దగుట్టపై చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

### ఇది పన్నెండో పర్యటన

ఆలయ పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్న తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రిలో పర్యటించడం ఇది పన్నెండోసారి. చివరిసారి ఆగస్ట్ 17న సందర్శించిన సందర్భంగా చేసిన సూచనలతో పనులు వేగంపుంజుకున్నాయి. శ్రీవారి గర్భాలయాన్ని చూడముచ్చటగా తయారుచేయాలని సీఎం కేసీఆర్ చేసిన సూచనల మేరకు గర్భాలయం ముందు భాగంలో నగిషీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. యాదాద్రిలో శ్రీనారసింహుడు కొలువు తీరడానికి తన భక్తితో మెప్పించిన ప్రహ్లాదుని చరిత్రను తెలిపే ఇత్తడి ఫలకాలను అమర్చుతున్నారు. ఉపపీఠం, అధిష్ఠానం, స్తంభవర్గం, ప్రత్సరం వరకు పనులు పూర్తికావస్తున్నాయి. ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల రెయిలింగ్ పనులు, ఆలయం వద్ద క్లాడింగ్ పనులు పూర్తయ్యాయి. పశ్చిమ గోపురం నుంచి భక్తులు బయటకు వెళ్లేందుకు సపోర్టుగా ఉండేందుకు ఉద్దేశించిన రెయిలింగ్ పనులు కూడా యుద్ధప్రాతిపదికన పూర్తవుతున్నాయి. ఈశాన్య భాగంలో ఉన్న మూడంతస్తుల రాజగోపురం నుంచి ఆలయం లోపలికి ప్రవేశించే ప్రాంతంలో వీవీఐపీలు కూర్చోవడానికి వీలుగా రాతితో బెంచీని ఏర్పాటుచేశారు. బెంచీని మోస్తున్నట్టుగా రెండు ఏనుగుల ప్రతిమలను అమర్చారు. సీఎం ఆదేశం మేరకు.. భక్తులు ప్రవేశించే ప్రవేశద్వారానికి ఇరువైపులా ఐరావతాలు స్వాగతం చెప్తున్నట్టు శిల్పాలను చెక్కే పనులు జరుగుతున్నాయి. బలిపీఠం, ధ్వజస్తంభాలను స్వర్ణమయం చేసే పనులు చెన్నై నగరంలో జరుగుతున్నాయి. గర్భాలయానికి గల గోడల పై భాగంలో శంఖం, చక్రం, నామం శాస్త్ర ప్రకారం చెక్కడం పూర్తయింది. విమానగోపురం వెలుపల ప్రథమ ప్రాకారంలో పనులు సంపూర్ణంగా పూర్తయ్యాయి. లోపలి ప్రాకారంలో అద్దాల మండపం పనులకు జరుగుతున్నాయి.



యాదాద్రిలో అష్టభుజి మండపాలతోకూడిన పడమర, దక్షిణ గోపురాలు



లోపలి ప్రాకారంలో సిద్ధమవుతున్న అద్దాల మండపం, ఇతర మండపాలు

### కనువిందు చేస్తున్న నిర్మాణాలు

ప్రధాన ఆలయ నిర్మాణ పనులు 95% పూర్తయ్యాయి. అలయం లోపల ఆళ్వార్ల విగ్రహాలు, ఆంజనేయ స్వామి ఆలయంలో ఫ్లోరింగ్ పనులు మిగిలి ఉన్నాయి. అష్టభుజి నిర్మాణాలు పూర్తయ్యాయి. 28 విమానాలను అష్టభుజి మండపాలపై నిర్మించారు. సప్త గోపురాలను అందంగా ముస్తాబుచేశారు. వీటిపనులు 100% పూర్తయ్యాయి. బ్రహ్మోత్సవం మండపంతో కలిపి ప్రధానాలయం నిర్మాణం 4.35 ఎకరాల్లో జరుగుతున్నది. ముఖమండపం భక్తులకు కనువిందు చేస్తున్నది. 32 నారసింహ అవతారాలు, ప్రహ్లాదుని చరిత్రను తెలిపే ఘట్టాలు చూడ ముచ్చటగా నిర్మాణం జరుపుకొంటున్నాయి. తూర్పున నిర్మించిన పంచతల గోపుర ద్వారం నుంచి భక్తులు ఆలయంలోకి ప్రవేశిస్తారు. ఈశాన్యంలో గల త్రితల గోపురం నుంచి శ్రీఆంజనేయస్వామిని, గండభేరుండ నరసింహస్వామిని దర్శించుకుంటారు. సహజ వెలుతురు ఉండేలా ముఖమండపానికి 12 సోలార్ రూఫ్ ప్యానల్స్ ఏర్పాటుచేస్తున్నారు. 500 మంది భక్తులు కూర్చుని శ్రీవారిని కల్యాణాన్ని తిలకించేలా నిత్యకల్యాణ మండపంలో ఏర్పాట్లు చేస్తున్నారు. 3000 మంది కూర్చొని తిలకించేలా బ్రహ్మోత్సవ మండపంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైన నిర్మాణమైన మొదటి ప్రాకారంలో బలిహరణం, నిత్యప్రదక్షిణలు చేసుకునే అవకాశం ఉన్నది. రెండో ప్రాకారంలో నిత్యకల్యాణ మండపం, యాగశాల, అద్దాల మండపం, రామానుజ కూటమి నిర్మాణమవుతున్నాయి. ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణాల్లో వీఐపీ సూట్స్ పనులు సైతం 55% పూర్తి అయ్యాయి. ఇక టెంపుల్ సిటీలో ఇన్ఫ్రా లేఅవుట్ తయారుచేశారు. ఈ టెంపుల్ సిటీలో పీవీటీవారికి గుర్తుగా భవనాల నిర్మాణాలు ఏ విధంగా చేయాలి అన్న విషయంపై డోనర్స్‌తో మాట్లాడి పాలసీని సీఎం కేసీఆర్ నిర్ణయిస్తారు. విష్ణు పుష్కరిణి నిర్మాణం, కల్యాణకట్ట, సత్యనారాయణస్వామి వ్రతాల మండపం విషయంలో సూచనల మేరకు పనులు జరిగాయా లేదా పరిశీలించనున్నారు.

### శయనోత్సవ మండపం పనులు పూర్తి

ఆండాళ్ అమ్మవారి ఆలయం పక్కన శయనోత్సవ మండపం నిర్మాణం పనులు పూర్తిచేశారు. మహాప్రసాదం మిగిలిపోయిన పనులను చేపట్టారు. గతంలో కలపతో చేసిన కిటికీలు వాడగా.. వాటిని తొలిగించి రాతి కిటికీలను అమరుస్తున్నారు. బ్రహ్మోత్సవ మండపం నిర్మాణాన్ని వారంరోజుల్లో పూర్తిచేశారు. వేంచేపు మండప పనులన్నీ పూర్తయ్యాయి.

### కృష్ణశిలలతో మాడవీధుల ఫ్లోరింగ్

ఆలయ నిర్మాణానికి మొత్తం కృష్ణశిలలనే ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రథమ, ద్వితీయ ప్రాకారాలలోని తిరువీధులు మొత్తం కృష్ణశిలలతోనే ఫ్లోరింగ్ చేస్తున్నారు. రూ.6 కోట్లతో చేపట్టిన ఈ పనుల్లో మొత్తం 83,000 చదరపు అడుగులకుగాను.. ఇప్పటివరకు 40వేల చదరపు అడుగుల మేర ఫోరింగ్ పూర్తయింది.

### శివాలయం పనులు 90% పూర్తి

శివాలయం శిల్పి పనులు పూర్తయ్యాయి. గోపురం, ముఖమండపం, ప్రాకారం పనులు కూడా పూర్తయ్యాయి. శివాలయానికి వైట్ ప్రైమర్ వేసే పనులను చేపట్టారు. ఆలయం లోపల ఫ్లోరింగ్ పనులు మొదలయ్యాయి.

### అధునాతన పద్ధతిలో పార్కింగ్

ఉత్తర భాగంలో మూడువేల నుంచి ఐదువేల వాహనాలు పార్క్‌చేసేందుకు అవసరమైన అధునాతన ప్లాన్‌ను వైటీడీఏ అధికారులు సిద్ధంచేశారు. రెండంతస్తుల్లో దీన్ని నిర్మించనున్నారు. కారు పార్కింగ్ నుంచి నేరుగా బస్‌స్టేషన్ చేరుకుని అక్కడి నుంచి సులువుగా కొండపైకి చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధంచేశారు.

### అన్నదానంకోసం భారీ సత్రం

యాదాద్రిలో అధునాతన పద్ధతిలో భారీ అన్నదాన సత్రం నిర్మించనున్నారు. అత్యంత ప్రాధాన్యం గలిగిన నిర్మాణాలన్నీ కొండకు ఉత్తరంవైపు వస్తుండటంతో ఆ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడనున్నది.

### గుట్ట చుట్టూ రింగ్ రోడ్డు

రూ.142 కోట్లతో యాదాద్రి రింగ్‌రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పశ్చిమ వైపు నుంచి మొదలైన పనులు తూర్పుదిశ వరకు పూర్తయ్యాయి. దక్షిణం వైపు వైకుంఠద్వారం నుంచి పనులు మొదలయ్యాయి. తులసీవనం వనం పక్క నుంచి గండి చెరువు వరకు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.


SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
6-1-50, Corporate Office, Mint Compound :: Hyderabad – 500 063, Ph.No.040-23431003/1032.

NOTIFICATION

The last date for submission of Applications from eligible candidates for two (2) posts of Chairperson/CGRF is extended upto 31.12.2019. For detailed notification refer TSSPDCL website www.tssouthernpower.com at Careers link.

Place: Hyderabad,
Date: 17.12.2019
ID. SPDCLCORP01448

Sd/-
CHAIRMAN & MANAGING DIRECTOR, TSSPDCL





## పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా సర్ఫరాజ్‌అహ్మద్
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ ఎస్కే జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ఎంసీహెచ్చార్డీ అదనపు డీజీగా భూసాని వెంకటేశ్వరరావును బదిలీచేసి విపత్తుల నిర్వహణశాఖ ముఖ్యకార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు వెయింటింగ్‌లో ఉన్న డాక్టర్ ఏ అశోక్‌కు ఎంసీహెచ్చార్డీ అదనపు డీజీగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్‌అహ్మద్‌ను బదిలీచేసి ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. జోగుళాంబ గద్వాల కలెక్టర్‌గా ఉన్న కే శశాంకను కరీంనగర్ కలెక్టర్‌గా నియమించారు. వనపర్తి కలెక్టర్ శ్వేతామహంతికి జోగుళాంబ గద్వాల కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- దరఖాస్తులకు 20 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఎస్సీ గురుకులాల పరిధిలోని 28 ప్రతిభ కాలేజీల్లో ప్రవేశాల కోసం సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, హెచ్‌సీ, ఓసీ, బాల, బాలికలు ఈ కాలేజీల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈ నెల 20 వరకు గడువు విధించామన్నారు. దరఖాస్తు ఫీజు రూ.100 అని, పూర్తివివరాలకు tswreis.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## 12 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రాగల మూడురోజుల వరకు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత స్వల్పంగా పెరిగింది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో ఏర్పడిన మార్పు వల్ల చల్లదనం పెరిగినట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదివారం నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయని పేర్కొన్నారు.





with you hamesha 1800-209-6006
UDAY
10 లక్షల రూపాయల దుర్ఘటన ఇన్స్యూరెన్స్ మరియు ఇతర ఆకర్షణీయమైన సదుపాయాలు కేవలం ఉదయ్ సభ్యులకై.
చూపించిన అక్సెసరీలు ప్రమాణిత వాహనంలో భాగం కావు. అధిక సమాచారానికై దయచేసి మీకు దగ్గర్లోగల డీలర్‌ని సంప్రదించండి.
*ఏది ముందైతే అది. నియమ నిబంధనలు వర్తిస్తాయి.
MOTORLINE AUTO PVT. LTD.: KARIMNAGAR, JAGITYAL, PEDDAPALLY, SRICILLA. PH: 77997 39121; AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.: NIZAMABAD, BODAN, KAMAREDDY, BHANSWADA, ARMOOR. PH: 77997 39120



మీరు మా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనుకుంటే చేసుకోండి. కానీ బెంగాల్‌లో నేను ఎప్పటికీ పౌరసత్వ సవరణ చట్టాన్ని, జాతీయ పౌర పట్టికను అనుమతించం.

**మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి**

జార్ఖండ్ రాష్ట్రంలోని ఎన్నికల ప్రచారంలో కశ్మీర్(ఆర్టికల్ 370 రద్దు) అంశాన్ని మేం ఎందుకు పదేపదే ప్రస్తావిస్తున్నామని రాహుల గాంధీ అడుగుతున్నారు. ఆయన ఈ అంశాన్ని ఇటాలియన్ అద్దాల నుంచి చూస్తున్నారు. దేశభద్రత కోసం సరిహద్దుల్లో ఆ రాష్ట్ర యువత ఎందుకు రక్తం చిందించారో ఆయనకు అవగాహన లేదు.

**అమిత్‌షా, కేంద్రహోం మంత్రి**



### చరిత్రలో నేడు



**1903**
మొదటిసారి ఇంజిన్‌తో కూడిన విమానాన్ని నడిపిన ఓర్వెల్‌రైట్

**1908**
అన్వర్ పాషా నేతృత్వంలో టర్కీలో సంస్కరణల పార్లమెంట్ ప్రారంభం.






**1961**
పోర్చుగీసు వలసలుగా ఉన్న గోవా, ఇతర ప్రాంతాలను స్వాధీనం చేసుకున్న భారత్.

చాలాకాలం తర్వాత తమిళ నాడులో లాటరీ భూతం పంజావిసిరింది. ఓ స్వర్ణకారుడు లాటరీ వ్యసనపరుడై తీవ్ర అప్పల పాలై భార్యా పిల్లలతో పాటు ఆత్మహత్యకు పాల్పడటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్నది. బంగారు నగల విధానంలో రెడీమేడ్ విధానం వచ్చిన తర్వాత స్వర్ణకారులు జీవనోపాధి కోల్పోయారు. అంతేకాకుండా నిరుపేద కార్మికులు, ప్రజలు లాటరీ వ్యసన పరులై ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. చట్ట విరుద్ధంగా ఉన్న ఆన్‌లైన్ లాటరీ విధానాన్ని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో అస్సాంతో సహా ఈశాన్యరాష్ట్రాలన్నింటా తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ చట్టంతో ఈశాన్యరాష్ట్రాల్లో తీవ్ర జనాభా నిష్పత్తి, సాంస్కృతిక జీవనంలో తీవ్ర పరిణామాలు ఏర్పడుతాయని భయపడుతున్నారు. దీర్ఘకాలంగా చొరబాటుదారులు, వలసదారుల సమస్యకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఈశాన్యరాష్ట్రాలు ఇప్పడు పౌరసత్వ చట్టంతో మరింతగా ఆందోళన చెందటం గమనార్హం. సరిహద్దుదేశాలతో సరిహద్దులు కలిగి ఉన్న ఈ రాష్ట్రాల్లో అనిశ్చితి ఏర్పడటాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవటం సరికాదు.

**ది హిందూ**



# భావితరాలు క్షమించవు

వాతావరణ మార్పు వల్ల వచ్చే భూగోళంపై మానవాళి నశించే ప్రమాదం పొంచి ఉన్నా, వివిధ దేశాలు ఇటీవల మాడ్రిడ్‌లో జరిగిన కాప్– 25 సమావేశంలో ఏకాభిప్రాయానికి రాలేకపోవడం ఆందోళనకరం. వాతావరణ మార్పును అరికట్టడం కోసం సాగిన ఈ చర్చలు శుక్రవారంతోనే ముగియాల్సింది. కానీ ఏదో ఒక ముందడుగు పడకపోతుందా అనే ఆశకొద్ది రెండురోజులు పొడిగించారు. వాతావరణ మార్పుపై జరిగిన సమావేశాల్లోకెల్లా అత్యంత సుదీర్ఘ చర్చలివి, అయినా ఫలితం లేకపోయింది. ఏదో ఒరగబెట్టినట్టు మొక్కుబడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. చరిత్రాత్మకమైన 2015 ప్యారిస్ ఒప్పంద లక్ష్యాలకు అనుగుణంగా గ్రీన్‌హౌజ్ గ్యాస్‌లను తగ్గించవలసిన తక్షణ అవసరం ఏర్పడ్డదని 200 దేశాలు తుది ప్రకటనలో పేర్కొన్నాయి. వాతావరణ మార్పు వల్ల బాధపడుతున్న పేద దేశాలను ఆదుకోవాలనే కంటి తుడుపు మాటలు కూడా ఈ ప్రకటనలో ఉన్నాయి. కానీ అందుకు నిధుల కేటాయింపు లేదు. తాము వచ్చే ఏడాది నాటికి ఏమేర గ్రీన్ హౌజ్ ఉద్గారాలలో కోత విధిస్తామనే హామీ అంతకన్నా లేదు. ప్యారిస్ ఒప్పందం కుదిరిన తరువాత నుంచి ఇప్పటి వరకు వాతావరణ మార్పునకు సంబంధించిన పరిశోధనలు భారీ ఎత్తున సాగాయి. ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది శాస్త్రవేత్తలు భిన్న కోణాల్లో నిర్దిష్ట పరిశోధనలు చేసి భూగోళం వేడెక్కుతుండటం వల్ల జరిగే ప్రమాదాలను నిక్కచ్చిగా వెల్లడించారు. మానవాళి ఈ విపత్తు నుంచి బయటపడాలంటే ప్రపంచదేశాలు ప్యారిస్ ఒప్పందం లక్ష్యాలకు అనుగుణంగా నడక ప్రారంభించాలనీ, వచ్చే ఏడాది నాటికే తమ లక్ష్యాలవైపుగా చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు కోరుతున్నారు. అయినా ఒక్క అడుగుకూడా ముందుకు పడకపోవడం శోచనీయం.

**ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని స్వీకరించిన తరువాత పర్యావరణానికి విఘాతం కలిగే అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలుగాలని నిర్ణయించారు. పారిశ్రామికదేశాలు సహకరించనంత వరకు వాతావరణ చర్చలు ముందుకుపోవడం సాధ్యం కాదు. వాతావరణ మార్పు సమావేశాలు మళ్ళా వచ్చే ఏడాది బ్రిటన్‌లో గ్రాస్‌గోవ్ (స్కాట్‌లాండ్) నగరంలో జరుగుతాయి. ఈలోగా పారిశ్రామిక దేశాల ప్రజలు తమ నాయకులపై ఒత్తిడి తేవాలె. అన్నిదేశాల ప్రజలు పర్యావరణ పరిరక్షణ స్పృహను పెంచుకోవాలె. ఉపేక్ష వహిస్తే భావితరాలు క్షమించవు.**

వాతావరణ మార్పు చర్చల్లో ప్రధాన వివాదం కార్బన్‌ట్రేడింగ్‌పై జరుగుతున్నది. స్వచ్ఛ అభివృద్ధి విధానాలను అవలంబిస్తున్న దేశాలకు కార్బన్ క్రెడిట్స్ ఉంటాయి. కాలుష్యాన్ని వెలువరిస్తున్న పారిశ్రామిక దేశాలలోని సంస్థలు తమ ఉద్గారాలను తగ్గించుకోవాలె. అది సాధ్యం కాకపోతే కార్బన్ పన్ను చెల్లించాలె. అయితే ఇందుకు ప్రత్యామ్నాయంగా కార్బన్ క్రెడిట్ విధానానికి క్యోటో ఒప్పందం వెలుసుబాటు కల్పించింది. స్వచ్ఛ అభివృద్ధి విధానాలను అవలంబిస్తున్న దేశాలు పొందిన క్రెడిట్స్‌ను కొనుక్కోవడం ద్వారా ఆ మేరకు కాలుష్యకారక ఉత్పత్తులను కొనసాగించవచ్చు. తాము స్వచ్ఛ అభివృద్ధి విధానాలను అవలంబించుకోవడం ద్వారా పొందిన గత క్రెడిట్స్‌ను సొమ్ము చేసుకోవడానికి అనుమతించాలనే వర్ధమానదేశాల డిమాండ్‌ను పారిశ్రామిక దేశాలు అనుమతించడం లేదు. ప్యారిస్ ఒప్పందంలోని ఆరవ అధికరణం కింద ఉన్న ఈ అంశంపై ఏకాభిప్రాయం కుదురకపోవడంతో వాయిదా వేశారు. ఈ సమావేశాలలో కూడా ఈ వివాదం తెగలేదు. దీంతో కార్బన్ మార్కెట్స్‌కు సంబంధించిన చర్చలు వచ్చే ఏటికి వాయిదా పడ్డాయి. అయితే ఈ కార్బన్ క్రెడిట్ విధానమే లోపభూయిష్టమైనదనే వాదనలు ఉన్నాయి. కార్బన్ క్రెడిట్స్ కొనుక్కోవడం ద్వారా పారిశ్రామికదేశాలలోని సంస్థలు మరింత ఎక్కువగా ఉద్గారాలు వెలువరిస్తున్నాయి. మరోవైపు ఇతర దేశాలలో ఉద్గారాలు తగ్గుముఖం పట్టడం లేదు. అందువల్ల ప్రత్యామ్నాయమార్గాలు చూపకుండా గ్రీన్ హౌజ్ ఉద్గారాలను తగ్గించాలని నిర్దేశించడమే ఉత్తమ విధానం.

గ్రీన్ హౌజ్ గ్యాసెస్ ఇప్పుడున్న రీతిలో వెలువడితే శతాబ్దాంతానికి భూగోళ వాతావరణం మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర అదనంగా వేడెక్కుతుంది. ఇప్పటికే సముద్ర మట్టాలు పెరుగడం మొదలుకొని భయంకర తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాలను చవి చూస్తున్నాం. భూగోళం ఇంకా వేడెక్కుతూ పోతే అనేక అరిష్టాలు దాపురిస్తాయి. అందువల్ల ఈ భూగోళ వాతావరణ మార్పును 1.5 డిగ్రీల దగ్గరనే కట్టడి చేయడానికే ఈ ప్రయత్నమంతా. బడుగుదేశాలు, పర్యావరణవేత్తలు ఇదే కోరుతున్నారు. కానీ అభివృద్ధి చెందిన దేశాలే సహకరించడం లేదు. వాతావరణ మార్పుకు కారణమైన వాయువులు వెలువరించింది పారిశ్రామిక దేశాలే. ఇంకా ఇప్పటికీ ఈ దేశాలే ప్రధాన కారణం. అందుకు బాధ్యత వహించి భారం వహించాలన్న ప్రతిపాదనను మాత్రం పారిశ్రామిక దేశాలు ఆమోదించడం లేదు. ప్రత్యేకించి అమెరికా మొండిగా వ్యవహరిస్తున్నది. అమెరికాతో అంటకాగుతున్న ఆస్ట్రేలియా, బ్రెజిల్, సౌదీ అరేబియా నాయకులు ఇదే బాటలో నడుస్తున్నారు. వాతావరణ మార్పును అరికట్టడానికి గత ఏడాదిగా చర్యలు తీసుకున్న దేశాలలో అమెరికా అట్టడుగున ఉండటం గమనార్హం. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని స్వీకరించిన తరువాత పర్యావరణానికి విఘాతం కలిగే అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలుగాలని నిర్ణయించారు. పారిశ్రామికదేశాలు సహకరించనంత వరకు వాతావరణ చర్చలు ముందుకుపోవడం సాధ్యం కాదు. వాతావరణ మార్పు సమావేశాలు మళ్ళా వచ్చే ఏడాది బ్రిటన్‌లో గ్రాస్‌గోవ్ (స్కాట్‌లాండ్) నగరంలో జరుగుతాయి. ఈలోగా పారిశ్రామిక దేశాల ప్రజలు తమ నాయకులపై ఒత్తిడి తేవాలె. అన్నిదేశాల ప్రజలు పర్యావరణ పరిరక్షణ స్పృహను పెంచుకోవాలె. ఉపేక్ష వహిస్తే భావితరాలు క్షమించవు.

### జనగళం

## పౌరసత్వ సవరణ చట్టం రద్దుకోసం జరుగుతున్న పోరాటానికి మద్దతుగా 100మంది తెలుగు కవులు, రచయితలు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర జాబితా(ఎన్ఆర్సీ) భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైనది. ఆధునిక సమాజ నియమాలకు, సహజ న్యాయసూత్రాలకు విఘాతమైన వీటిని నిరసిస్తూ ఈశాన్యరాష్ట్రాలు, మైనారిటీ ప్రజలు వినిపిస్తున్న నిరసన స్వరాన్ని తెలుగు రచయితలుగా, కవులుగా, ఆలోచనాపరులుగా బలపరుస్తున్నాం. భారత శాంతియుత సామాజిక వాతావరణాన్ని విచ్ఛిన్నంచేసే పౌరసత్వ సవరణ చట్టం, ఎన్ఆర్సీ రద్దు చేయాలని కోరుతున్నాం.

**కె.శ్రీనివాస్, ఎస్.వీరయ్య, కట్టా శేఖర్ రెడ్డి, అల్లం నారాయణ, కె.శివారెడ్డి, దేవి ప్రియ, నిఖిలేశ్వర్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, భూపతి వెంకటేశ్వర్లు, మేడారం అరవింద్, ప్రొ. జి. హరగోపాల్, ప్రొ. జయధీర్ తిరుమలరావు, ప్రొ.సి కాశీం, ప్రొ.పద్మజషా, ప్రొ.సమున్నత, ప్రొ.కాత్యాయని విద్మహే, ప్రొ.సూరేపల్లి సుజాత, ప్రొ.ఎం. వినోదిని, అల్లం రాజయ్య, అక్బర్, నర్సిం, వై.కరుణాకర్, అఫ్సర్, యాకూబ్, షాజహానా, స్కైబాబ, వెంపల్లె షరీఫ్, కవి జయరాజ్, విమల, జూపాక. సుభద్ర, మెర్సీ మార్గరెట్, డా.పసునూరి రవీందర్, డా.సుంకిరెడ్డి. కూర్మానాథ్, నారాయణ రెడ్డి, డా.నూకతోటి రవి కుమార్, పి.విజయ్‌కుమార్, డా. జిలుకర శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, డా.పగడాల నాగేందర్, శిలాలోలిత, కుప్పిలి పద్మ, కె.ఎన్.మల్లీశ్వరి, దాసోజు. లలిత, కాత్యాయని, రామా సుందరి, ఎస్.జె.కళ్యాణి, బిల్ల మహేందర్, అరణ్యకృష్ణ, వెంకటకృష్ణ, శోభ భట్, కొల్లాపూర్ విమల, వేల్పుల నారాయణ, డా.గుర్రం సీతారాములు, డా.గాదె వెంకటేష్, విజయ్ సాధు, డా.కాసుల లింగారెడ్డి, ఇమ్మడి మహేందర్, పి.వరలక్ష్మి, పాణి, సంపతి సోమయ్య, అనీల్ డాని, డా.శ్యాం, నరేష్ సూఫీ, దేశరాజు, ఛాయ మోహన్ బాబు, సజయ కాకరాల, సత్యావతి కొండవీటి, శివరాత్రి సుధాకర్, శాంతారావు, వంగల సంతోష్, వనపట్ల సుబ్బయ్య. బాల సుధాకర్ మౌళి, రాఘవ రామిరెడ్డి, వైష్ణవ శ్రీ, గురిజాల రవీందర్, అరసవెల్లి కృష్ణ, కోర జాన్, గీత సపురు, సిద్ధార్థ కల్లెపల్లి, కానూరి కృష్ణ, శరత్‌బాబు, ఇంద్రవెల్లి రమేష్, ఎమ్.ఎ.బాసిత్, సాబీర్ హుస్సేన్, విప్లవ్‌కుమార్, బమ్మిడి జగదీశ్వర రావు, దాసోజు కృష్ణమాచారి, బర్ల మహేందర్, వెంకటాద్రిశిలపాక, షేక్ పీర్ల మహ్మద్, పి.మోహన్, శోభరాజు, అన్వర్ వరంగల్, కొడం కుమారస్వామి, నల్లెల రాజయ్య, విజయ్ చంద్ర, రాంకి, నల్లూరి రుక్మిణి, జుగాష్ విలి, తంగిరాల సోని**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

### తెలంగాణం

**కంచె రమణ**

# రోశమ్మ పునరుజ్జీవ పథకం

అర్హులైన రైతులందరికీ రైతుబంధు ఇచ్చినప్పుడు, రైతుబీమా ఇచ్చినపుడు ఊరూరు తిరిగి వారి బతుకుల్లో వచ్చిన మార్పులు అధ్యయనం చేసి ప్రపంచానికి చాటలేదు. దశాబ్దాలపాటు దగాపడ్డ నీటి గోసను తీర్చడానికి అనుకున్న సమయంకన్నా ముందే కట్టిన భక్తరామదాసు ప్రాజెక్టు గురించి, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం కట్టి బీడు భూముల్లో కొత్త తెలంగాణను మొలకెత్తించినపుడు చేయని క్షేత్రస్థాయి పరిశీలన మద్యపానం విషయంలోనే ఎందుకు చేస్తున్నట్టు?

తనకు నచ్చని సర్కారును కూల్చేందుకు దూబగుంట రోశమ్మ అందుకున్న ఊరి సమస్యను రాష్ట్రానికి ఆపాదించింది ఎల్లో మీడియా. ఇప్పుడు తన పరిశోధన ల్యాబ్‌లో తెలంగాణ రోశమ్మను పునఃసృష్టి చేసేందుకు తీవ్ర కసరత్తులు చేస్తున్నది. ఊరూరు తిరిగి.. ఎక్కడన్నా మద్యం చావులు దొరకుతాయా అని పనిగట్టుకొని పల్లెలను జల్లెడపడుతున్నది. 1993లో సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమం సృష్టించి కాంగ్రెస్‌ను ఇబ్బందుల పాల్జేసింది ఈ పచ్చ పత్రికలే అన్నది కాదనలేని నిజం. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంపూర్ణ మద్య నిషేధం చంద్రబాబు ఎత్తేశారు. విచిత్రం ఏమిటంటే అదే పత్రికలు చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మద్యం లేకపోతే అర్థం లేదన్నట్టు పుంఖాను పుంఖాలుగా వార్తలు వండివార్చిన సంగతి అందరికీ తెలుసు. ఏటా 1200 కోట్ల నష్టం వస్తుందని సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతున్నాయని మొసలీక న్నీరు కారుస్తూ.. తమ టక్కుటమార గజకర్ణగోకర్ణ విద్యలను ప్రదర్శించిన్రు. నాడు గుర్తుకురాని అంపశయ్య ఇప్పుడెందుకు గుర్తొస్తున్నట్టు? ఈ రెండు సంఘటనలు చూసినప్పుడు ఈ విషపు కలంయోధుల దురుద్దేశం గురించి లేశమాత్రమైన అనుమానం పెట్టుకోవాల్సిన అవసరం లేదు. నాడైనా, నేడైనా వారి జెండా, ఎజెండా వాళ్ల అవసరాలే. ఇప్పుడు ఆ అవసరమే పచ్చగా ఎదుగుతున్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నది. కాళేశ్వరం జలగంగ వేములవాడ రాజన్న పాదాలు కడిగి, మధ్యమానేరును నింపి పంట పొలాల్లో పారుతున్న శుభాన్ని ప్రజల ఇండ్లకు చేరవేయాల్సిన బాధ్యతను మరిచిపోయి.. ఊళ్లల్లో మద్యం పారుతున్నదని కొత్త రాగం ఎంచుకున్నయి. పల్లెలన్నీ వల్లకాడవుతున్నయని మొసలి కన్నీరు కారుస్తున్నయి.

తెలంగాణ ఉద్యమం మొదలైన నాటి నుంచి తెలంగాణ వచ్చేదాక ఎల్లో మీడియా ఎత్తుకున్న రాగాలు, పల్లవించిన తాళాల గురించి ప్రతి బిడ్డకు తెలుసు. ‘టైటిల్ అనుకూలం– కంటెంట్ కన్ఫ్యూజన్’ ఫార్ములాతో ఉద్యమ సమయంలో అనేకమంది తెలంగాణ బిడ్డలు ప్రాణాలు పోవడానికి కారణమైంది ఎల్లో మీడియా. తెలంగాణ వచ్చినంకనైనా వీరి తీరు మారుతుందని అనుకుంటే మళ్లీ కృత్రిమ ఉద్యమాల సృష్టిలో తలమునకలవుతున్నరు. ఆర్టీసీ సమ్మె జరిగినప్పుడు ఈ ఎల్లోబ్యాచ్.. కార్మికులను రెచ్చగొట్టేందుకు పడని ప్రయాస లేదు. పత్రికా విలువలకు తిలోదకాలు ఇచ్చి జడ్జిల ఫొటోలతో ప్రభుత్వ వ్యతిరేక వార్తలను ప్రచురించిన్రు. అదిగో పులి అంటే.. ఇదిగో తోక అన్నట్టు.. కేంద్రం వస్తుంది.. కేసును తేలుస్తుందని పిచ్చిరాతలను పచ్చగా రాసిన్రు. పైశాచిక ఆనందం పొందిన్రు. ఒకవైపు ముఖ్యమంత్రి కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల డిమాండ్లు, వాటి పరిష్కారాలపై శ్రమిస్తుంటే.. మరోవైపు ఒకనాడు ‘ప్రైవేటీకరణకు పచ్చజెండా’, మరోనాడు ‘ముగిసిన ఆర్టీసీ అధ్యాయం’, ఇంకోనాడు ‘తెల్లారితే కొత్తబస్సులే’ అంటూ ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టి ఆత్మహత్యలకు పురికొల్పిండ్రు. చివరికి సమ్మె ముగిసి కార్మికులంతా కేసీఆర్‌కు జైకొడితే దిక్కుతోచక దిక్కులు చూస్తూ కూర్చున్నరు. ఇక దిశ హత్య కేసు మొదలైన నాటి నుంచి వారి చిల్లర చేష్టలు విలువల వలువలూడదీసిన వ్యవహారం. నెత్తుటి గాయాలపై కారం చల్లి పొందిన పైశాచిక ఆనందం గురించి ఎంతచెప్పినా తక్కువే. ప్రభుత్వం మనిషికో గన్‌మెన్ పెట్టి కాపాడాలన్నట్టు రాసిన రాతలు మరిచినా మరిచిపోయేటివా? ఎన్‌కౌంటర్ అయేదాక అవిచేసిన హడావుడి, ఎన్‌కౌంటర్ జరిగాక ఎన్‌హెచ్‌ఆర్సీ వచ్చాక రాసిన వార్తల శీర్షికలు చూస్తే వారి కుసంస్కారం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇలానే గత సంవత్సరం ఎన్నికల ముందు టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ముగిసిపోతున్నదని కాచుకున్న చలిమంటలు చితిమంటలు అవడంతో బిత్తరపోయిన్రు. అనక దొరికిన ఇంటర్ విద్యార్థుల సమస్యను పట్టుకొని నెలన్నర రోజులు వేలాడిన్రు. ఆ తర్వాత ఆర్టీసీ కార్మికులను, దిశ సంఘటనను అడ్డం పెట్టుకొని తెలంగాణ సమాజాన్ని నైరాశ్యంలోకి నెట్టేసే ప్రయత్నం చేసిండ్రు.

ఇక మరో పత్రిక అయితే తెలంగాణ ప్రభుత్వంపై 17,463 కంటెప్ట్ కేసులున్నయని గోబెల్స్ వార్తలు రాస్తూ ఆనందం పొందుతున్నది. అసలు ఏ ప్రభుత్వంపై కంటెప్ట్‌లు లేవు, ఒక్క కేసీఆర్ ప్రభుత్వంలోనే ఉన్నయన్నట్టు చిలువ పలువలు చేస్తున్నది. వృథాను అరికట్టాలని, అధికారుల్లో అకౌంటబిలిటీ పెంచాలని కొంచెం కట్టడి చేస్తే, అప్పుల తెలంగాణ అయ్యిందని అబద్ధాలు రాస్తరు. పనులన్నీ బంద్ అని కోతిరాతలు రాస్తున్నరు.

అర్హులైన రైతులందరికీ రైతుబంధు ఇచ్చినప్పుడు, రైతుబీమా ఇచ్చినపుడు ఊరూరు తిరిగి వారి బతుకుల్లో వచ్చిన మార్పులు అధ్యయనం చేసి ప్రపంచానికి చాటలేదు. దశాబ్దాలపాటు దగాపడ్డ నీటి గోసను తీర్చడానికి అనుకున్న సమయంకన్నా ముందే కట్టిన భక్తరామదాసు ప్రాజెక్టు గురించి, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం కట్టి బీడు భూముల్లో కొత్త తెలంగాణను మొలకెత్తించినపుడు చేయని క్షేత్రస్థాయి పరిశీలన మద్యపానం విషయంలోనే ఎందుకు చేస్తున్నట్టు? ఒక్కో ఊళ్లో 20 బెల్టు షాపులున్నయని ప్రభుత్వాన్ని ఎందుకు బాద్నాం చేస్తున్నట్టు?

మొదటి నుంచి ఈ ఎల్లో పత్రికల తీరు చాలా విచిత్రంగా ఉంటుంది. వీరు తమకు అవసరమైన సమస్యలనే ప్రజల సమస్యలుగా చిత్రీకరిస్తారు. మీడియా పేరుతో పబ్బం గడుపుకునే కుయుక్తులు పన్నుతరు. లేదంటే ప్రపంచం ఔరా అనే కంపెనీలు హైదరాబాద్‌లో కాలుపెట్టినప్పుడు, ప్రపంచదేశాల సమావేశాలను దిగ్విజయంగా నిర్వహించినప్పుడు, పేదా, బీదా, బిక్కి జనానికి ఆసరా పెన్షన్లు ఇచ్చినప్పుడు, ఆడబిడ్డల పెండ్లిళ్లు చెయ్యలేక ఆస్తులు అమ్ముకుంటున్న తెలంగాణ తల్లిదండ్రుల గుండెగోసను తీర్చేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఇచ్చి వారి బతుకుల్లో చిరునవ్వులను నింపుతున్నప్పుడు ఒక్కసారి కూడా క్షేత్రస్థాయి సర్వే చేయలేదే?

మునుపటి ప్రభుత్వాల్లో ఉన్నట్టుగా కరెంట్ ఉద్యమాలు లేవు. తాగునీరు, సాగునీటి గోసలేదు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల పోరాటాలు లేవు. ఉద్యోగుల సమ్మెలు లేవు. యూరియా రాస్తారోకోలు, ధాన్యం కొనమని ఘెరావ్‌లు లేవు. ఎండిపోతున్న పొలం లేదు. ఛిద్రమైన బతుకు లేదు. ప్రతిపక్షాలకు నిరసన రాగం లేదు. అంతా మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేక కుట్రల అస్త్రాలను ఎక్కుపెడుతున్నారు. కూలదోయడం, పోట్లు పొడువడంలో ఉన్న తమ నైపుణ్యానంత ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ బిడ్డలను రెచ్చగొట్టి ఆ మంటల్లో చలికాగే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా మద్యం అమ్మడం లేదన్నట్టు.. ఒక్క తెలంగాణే దానికి కేంద్రం అన్నట్టు హడావుడి చేస్తున్నారు.

అధికారం కోసం కలలు కనడమే దినచర్యగా పెట్టుకున్న బీజేపీ నాయకులు కూడా మద్యంపై మాట్లాడుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విరివిగా మద్యం అమ్మకాలు సాగిస్తూ వేలకోట్ల రూపాయలను ఆర్జిస్తూ పరిపాలన చేస్తుంటే.. తెలంగాణలో బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాత్రం వద్దని ఉద్యమం చేస్తరట. వందల వైన్‌షాపులు, బార్ షాపులున్న బీజేపీ నాయకులు మద్యనిషేధం గురించి నిరాహారదీక్షలు, పోరాటాలు చేస్తమని ప్రకటనలివ్వడం దయ్యాలు వేదాలు వల్లించడం కాదా? రాష్ట్రానికో నీతి, ప్రాంతానికో నీతి కలిగిన బీజేపీ గురించి మాట్లాడటం నాలుకమీద నల్లమందు పెట్టుకోవడం లాంటిదే. షరతులు లేకుండా దశాబ్దాలు త్యాగం చేసిన మిత్రపార్టీలనే అధికారం కోసం తడిగుడ్డతో గొంతుకోసిన నాయకులు ప్రజలను మాత్రం మోసం చెయ్యరని ఎలా అనుకోగలం.

తెలంగాణ బిడ్డలంతా జాగరూకతతో ఉండాల్సిన సమయం ఇది. అబద్ధాలకు ఆత్మలైన కొన్ని పత్రికలు, నాయకులు ఇప్పుడు ప్రజలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. మంచి, చెడు, మానవత్వం, జాలి అనే తేడా లేకుండా తెలంగాణను అస్థిరపరిచే కుట్రలు చేస్తున్నారు. ఆ కుట్రలకు మోసపోయి ఆగం కావద్దు. ఇప్పుడు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నట్టు డిసెంబర్ గ్రహాల కూటమి వచ్చి భూమిని అంతం చేస్తదో లేదో తెలియదు కానీ తెలంగాణను ముంచేందుకు ఈ దుష్టగ్రహాల కూటమి మాత్రం ప్రయత్నిస్తూనే ఉంటుంది. అందుకే జాగరూకతతో ఉందాం. త్యాగాల తెలంగాణను బంగారు తెలంగాణ చేసుకుందాం.

> తెలంగాణ బిడ్డలంతా జాగరూకతతో ఉండాల్సిన సమయం ఇది. అబద్ధాలకు ఆత్మలైన కొన్ని పత్రికలు, నాయకులు ఇప్పుడు ప్రజలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. మంచి, చెడు, మానవత్వం, జాలి అనే తేడా లేకుండా తెలంగాణను అస్థిరపరిచే కుట్రలు చేస్తున్నారు. ఆ కుట్రలకు మోసపోయి ఆగం కావద్దు.

# విదేశాలకు ఎగుమతులు సాధ్యమే!

### మత్స్యరంగం



**పిట్టల రవీందర్**

రాష్ట్రంలో మత్స్యరంగానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించిన ప్రతి సందర్భంలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజల చేపల ఆహార అవసరాలను తీర్చడంతోపాటు, అదనంగా ఉత్పత్తిచేసే మత్స్యసంపదను విదేశాలకు ఎగుమతి చేసే విధంగా అభివృద్ధి సాధించాలని అభిలషించారు. రాష్ట్రంలో మత్స్యరంగాన్ని అభివృద్ధిపరుచడానికి అందుబాటులో ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రికున్న దూరదృష్టికి, ఆ రంగంమీద ఆయనకున్న పరిపూర్ణ అవగాహనకు నిదర్శనం. గడిచిన నాలుగేండ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యరంగ అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఫలితంగా రాష్ట్రం ఏర్పడినాడు నమోదుచేసుకున్న రెండున్నరలక్షల టన్నుల వార్షిక చేపల ఉత్పత్తి వర్తమా న సంవత్సరానికి మూడులక్షల టన్నులకు చేరువలోఉన్నది. చేపల పెంపకానికి మనకు ఉపరితల జలవనరులు అనువుగా ఉన్నాయి. అట్లనే కొత్తగా అందుబాటులోకి వస్తున్న భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదులపై నిర్మిస్తున్న బ్యారేజీలు, వాటికి అనుసంధానంగా చేపట్టిన రిజర్వాయర్లు, చెరువులు, బ్యాక్ వాటర్స్‌తో జీవనదులుగా మారుతున్నాయి. నదీగర్భాలు, తదితర జలవనరులను ఒడుపుగా వినియోగించుకోగలిగితే రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకే కాకుండా ఇతర దేశాలకు సైతం చేపలను ఎగుమతి చేసుకునే దశకు చేరుకోవచ్చు.

ప్రపంచ చేపల ఉత్పత్తిలో రెండవస్థానంలో ఉన్న భారతదేశంలో గడచిన ఐదేండ్ల కాలంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతున్నది. దేశ వ్యవసాయరంగానికి సంబంధించిన అన్నిరకాలైన ఎగుమతులకంటే చేపల ఉత్పత్తిద్వారా సముపార్జించిన విదేశీమారక ద్రవ్య విలువనే అధికంగా నమోదైనట్లు ఇటీవలి ‘జాతీయ సమగ్ర ఆర్థిక సర్వే నివేదిక’ వెల్లడించింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో మనదేశం సుమారు 47,620కోట్ల రూపాయల ఆదాయాన్ని చేపల ఎగుమతుల ద్వారా సమకూర్చుకున్నది. రానున్న ఐదేండ్ల కాలంలో లక్షకోట్ల రూపాయల ఆదాయాన్ని సముపార్జించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశంలో జరిగిన 13.7మిలియన్ మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే 3.45 (సుమారు 20.77 శాతం) మిలియన్ మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరిగింది.

చేపల ఉత్పత్తికి అనుగుణంగా మూడు రకాలైన నీటివనరులు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో సముద్ర జలాలు (మెరైన్ ఫిషరీస్), ఉపరితల జవనరులు (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్), ఉప్పు, మంచినీటి మిశ్రమ జలాలు (బ్రాకిష్ వాటర్స్) ముఖ్యమైనవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహజసిద్ధంగానే ఆ వెసులుబాటు ఉన్నది. కాబట్టి చేపల ఉత్పత్తిలో మన దేశంలోనే ఆ రాష్ట్రం అగ్రగామిగా రాణించగలుగుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 974 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరప్రాంతం ఉంది. చేపల ఉత్పత్తికి ఎంతో అనుకూలమైన సముద్రపు ఉప్పునీరు, మంచినీరు కలిసే ‘బ్రాకిష్ వాటర్’ పరివాహకం (దాదాపు 2 లక్షల హెక్టార్ల విస్తీర్ణం) ఉన్నది. ఇవికాకుండా రిజర్వాయర్లు, చెరువులు కలిపి దాదాపు ఐదు లక్షల హెక్టార్ల విస్తీర్ణం చేపల ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నది. మొత్తంగా చూస్తే ఏపీలో చేపల ఉత్పత్తికి అనుకూలంగా సముద్ర జలాలను మినహాయిస్తే ఎనిమిది లక్షల హెక్టార్లు మాత్రమే అందుబాటులో ఉన్నది. మొత్తం జల వనరుల నుంచి ఆ రాష్ట్రం ఉత్పత్తి చేస్తున్న చేపలు దాదాపు 34.5 లక్షల టన్నులు. ఇందులో సముద్ర జలాల నుంచి ఉత్పత్తి అవుతున్న చేపలు కేవలం ఐదు నుంచి ఆరు లక్షల టన్నులు మాత్రమే! అంటే మిగిలిన 28.45 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిలో ఉపరితల జలవనరుల నుంచి 24.29 లక్షల టన్నులు. బ్రాకిష్ వాటర్ వనరుల నుంచి 4.16 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి జరిగాయి. ఒక్క కృష్ణాజిల్లాలో రెండులక్షల హెక్టార్ల విస్తీర్ణంలో నిర్వహిస్తున్న ఆక్వాకల్చర్ ద్వారానే గత ఆర్థిక సంవత్సరంలో 8,64,389 టన్నుల చేపలను ఉత్పత్తి చేయగలిగారంటే, ఆంధ్రప్రదేశ్‌లో అక్వాకర్చర్ ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఉపరితల జలవనరుల విస్తీర్ణంలో దేశంలోనే మూడవ అతిపెద్ద రాష్ట్రంగా నిలిచిన తెలంగాణ నుంచి విదేశాలకు ఎగుమతి చేసుకునేస్థాయిలో చేపలను ఉత్పత్తి చేసుకునేందుకు పూర్తిస్థాయిలో అవకాశాలున్నాయి. రాష్ట్రంలో చెరువుల ద్వారా లక్షా 78వేల హెక్టార్లు, మత్స్యశాఖ అధీనంలోని చేపల చెరువుల ద్వారా 2లక్షల 25వేల హెక్టార్లు, రిజర్వాయర్ల ద్వారా 2 లక్షల 10వేల హెక్టార్లు కలుపుకుని మొత్తం 6లక్షల 14వేల హెక్టార్ల నీటివిస్తీర్ణం కలిగిన జలవనరులు చేపల పెంపకానికి అందుబాటులో ఉన్నాయి. బహుళ ప్రయోజనకారిగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా, వాటికి అనుసంధానంగా కొత్తగా నిర్మించిన జలాశయాలు, పెద్దపెద్ద చెరువులు, కాళేశ్వరం ప్రాజెక్టుకు బ్యారేజీలకు సంబంధించిన గోదావరి నదీగర్భంలోని విస్తారమైన నిలువనీరు (బ్యాక్ వాటర్స్) కలిస్తే కనిష్టంగా మరో రెండులక్షల హెక్టార్ల నీటి విస్తీర్ణాన్ని జోడించేందుకు అవకాశాలున్నాయి. కృష్ణానదిమీద నిర్మించుకుంటున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి అనుసంధానంగా నిర్మించే జలాశయాలు, చెరువులు, తదితర నీటివనరులు కలిస్తే మరో లక్ష హెక్టార్ల నీటి విస్తీర్ణం పెరుగుతుంది. పర్యవసానంగా రాష్ట్రంలోని మొత్తం ఉపరితల జలవనరుల నీటి విస్తీర్ణం సుమారు పది లక్షల హెక్టార్లకు చేరుకుంటుంది.

మత్స్యపారిశ్రామిక రంగంలో ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నది. చేపల పెంపకంలో ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. అభివృద్ధి చెందుతున్న ఆక్వాకల్చర్ రంగం సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన రీతిలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. అయితే చేపల పెంపకంలో మన దేశం ఇంకా సాంప్రదాయ విధానాలనే ఎక్కువగా అనుసరిస్తున్నది. హెక్టారుకు గరిష్టంగా మూడుటన్నుల చేపలను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నాం. ప్రతి మత్స్యకారుడు సగటున చైనా దేశంలో ఆరు టన్నుల చేపలను ఉత్పత్తి చేస్తున్నాడు. మన దేశంలో మాత్రం సగటున రెండు టన్నులను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నాం. రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలలో అధికారికంగా సభ్యులుగా నమోదైన నాలుగు లక్షలమంది మత్స్యకారులు, ఇంకా అనధికారికంగా చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మరోరెండు లక్షలమంది మత్స్యకారులున్నారు. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ప్రతి మత్స్యకారుడు సగటున ఏడాదికి నాలుగు టన్నుల చేపలను ఉత్పత్తి చేయగలిగినా రాష్ట్రంలోని మొత్తం ఎనిమిది లక్షలమంది మత్స్యకారులద్వారా 32లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేసేందుకు అవకాశాలున్నాయి. కాగా, జాతీయ ప్రామాణిక లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పదిలక్షల హెక్టార్ల నీటి వనరుల్లో కనీసం 60శాతం నీటి విస్తీర్ణం మేరకు చేపల పెంపకానికి వినియోగించుకోగలిగినా రాష్ట్రంలో కనీసం 18 నుంచి 20లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేసే అవకాశాలున్నాయి. అంతేగాకుండా ఆక్వాకల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో మరో ఐదు లక్షల టన్నుల చేపలను అదనంగా ఉత్పత్తి చేయవచ్చు. అందువల్ల రాష్ట్రం నుంచి చేపలను విదేశాలకు ఎగుమతి చేయడం అసాధ్యమేమీకాదు.

> జాతీయ ప్రామాణిక లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పదిలక్షల హెక్టార్ల నీటివనరుల్లో కనీసం 60శాతం నీటి విస్తీర్ణం మేరకు చేపల పెంపకానికి వినియోగించుకోగలిగినా రాష్ట్రంలో కనీసం 18 నుంచి 20లక్షల టన్నుల చేపలను ఉత్పత్తిచేసే అవకాశాలున్నాయి. అంతేగాకుండా ఆక్వాకల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో మరో ఐదు లక్షల టన్నుల చేపలను అదనంగా ఉత్పత్తి చేయవచ్చు. అందువల్ల రాష్ట్రం నుంచి చేపలను విదేశాలకు ఎగుమతి చేయడం అసాధ్యమేమీకాదు.

(వ్యాసకర్త ‘తెలంగాణ ఫిషరీస్ సొసైటీ’ వ్యవస్థాపకులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# హింస ఆగితేనే కేసుల్ని విచారిస్తాం!

- జామియా నిరసనలపై సుప్రీంకోర్టు వెల్లడి
- ప్రభుత్వ ఆస్తుల విధ్వంసంపై ఆగ్రహం



**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జామియా మిలియా ఇస్లామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల విద్యార్థులు చేపట్టిన నిరసనలు హింసాత్మకం కావడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిరసనల్లో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం కావడంపై ఆగ్రహించింది. అల్లర్లను వెంటనే నిలిపివేయాలని కోరింది. వర్సిటీ విద్యార్థులను పోలీసులు వేధించినట్టు దాఖలైన కేసులను మంగళవారం విచారణకు స్వీకరిస్తామని.. అయితే, ప్రస్తుతం ఉన్న హింసాత్మక వాతావరణంలో ఈ కేసుల విచారణ సాధ్యం కాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. హింసాత్మక ఘటనలు ఆగితేనే కేసులను విచారిస్తామని పేర్కొంది. 'హింసాత్మక ఘటనలు ఆగిపోవాలని మేము కోరుకుంటున్నాం. ఈ ఘటనలు ఇలాగే కొనసాగితే ఈ కేసులపై మేము విచారణ చేపట్టలేం. ప్రభుత్వం ఆస్తులు నాశనం అవుతున్నాయి. బస్సులు తగులబడుతున్నాయి. ఇదేం పని?' అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే, జస్టిస్‌లు బీ ఆర్ గవాయి, సూర్యకాంత్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం జామియా ఘటనపై అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదని, ప్రభుత్వ ఆస్తుల్ని నాశనం చేయవద్దని సూచించింది. తాజా ఆందోళనల్ని కట్టడి చేసే క్రమంలో విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును న్యాయవాది ఇందిరా జైసింగ్ నేతృత్వంలోని న్యాయవాదుల బృందం ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. దీనికి సుప్రీంకోర్టు పైవిధంగా స్పందించింది. మరోవైపు, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపిన జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థులపై పోలీసుల వైఖరిని ఖండిస్తూ దాఖలైన ఓ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలన్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది.





ఎన్నార్సీని అనుమతించబోమంటూ కోల్‌కతాలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్న పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ

# కదంతొక్కిన విద్యార్థులు!

## జామియా వర్సిటీపై పోలీస్ చర్యకు నిరసనగా ఏకమైన విద్యార్థి లోకం



లక్నోలోని నద్వాతుల్ ఉలేమా కాలేజీ వద్ద విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

- దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో ఆందోళనలు
- పోలీస్ చర్యపై విచారణకు డిమాండ్.. మూడు ఐఐటీల సంఘీభావం
- హైదరాబాద్‌లోనూ నిరసన ప్రదర్శనలు
- యూపీలోని మౌలో పోలీస్‌స్టేషన్‌పై దాడి.. 15 వాహనాలకు నిప్పు!

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసుల దమనకాండకు నిరసనగా విద్యార్థి లోకం కదంతొక్కింది. హైదరాబాద్ మొదలుకొని లక్నో, ముంబై, మద్రాస్ తదితర నగరాల్లోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు సోమవారం భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పోలీస్ చర్యపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సాధారణంగా ఉద్యమాలకు దూరంగా ఉండే ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ముంబై విద్యార్థులు కూడా నిరసనల్లో పాల్గొనడం విశేషం. మరోవైపు, ఉత్తరప్రదేశ్‌లోని మౌలో ఆందోళనకారులు 15 పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఆదివారం జామియా విశ్వవిద్యాలయ విద్యార్థులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుమారు 60 మంది గాయపడ్డారు. హింసకు పాల్పడిన వారు జామియా వర్సిటీలో దాక్కున్నారని పేర్కొంటూ పోలీసులు వర్సిటీలోకి ప్రవేశించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అనుమతి లేకుండా వర్సిటీలోకి ప్రవేశించిన పోలీసులు తమపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. పోలీస్ చర్యకు నిరసనగా ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. చివరకు వేకువజామున 3.30 గంటలకు పోలీసులు విద్యార్థులను విడుదల చేయడంతో ఆందోళన విరమించారు. జామియా విద్యార్థులకు సంఘీభావంగా తొలుత యూపీలోని అలీగఢ్ ముస్లిం వర్సిటీ విద్యార్థులు ఆదివారం రాత్రి నిరసన చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించడంతో సుమారు 60 మంది విద్యార్థులు గాయపడ్డారు. అర్ధరాత్రి సమయానికి నిరసనలు హైదరాబాద్, వారణాసి, కోల్‌కతా, పుదుచ్చేరి, లక్నో, ముంబైకు విస్తరించాయి.

### ఇతర వర్సిటీల్లో..

**లక్నోలోని** నద్వా కళాశాలలో వందలాది మంది విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులతో ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులపై విద్యార్థులు రాళ్లు రువ్వారు. వర్సిటీ నుంచి విద్యార్థులు బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళన నిర్వహించారు. 'ఢిల్లీ పోలీసుల పట్ల సిగ్గుపడుతున్నాం' అంటూ నినాదాలు చేశారు. వారణాసిలోని హిందూ యూనివర్సిటీ, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలోనూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పోలీసుల 'గూండాయిజం'పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

**బాత్‌రూంలోకి వచ్చి మరీ కొట్టారు..**

సహచర విద్యార్థులపై పోలీసుల దాడికి నిరసనగా జామియా వర్సిటీ విద్యార్థులు సోమవారం ఉదయం ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించారు. ఆదివారం నాటి ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా వర్సిటీ చెందిన ఒక రీసెర్చ్ స్కాలర్ మాట్లాడుతూ.. 'మా సహచరులను విచక్షణారహితంగా చితకబాదారు. పోలీసులు బాత్‌రూమ్‌లు, లైబ్రరీలోకి ప్రవేశించి అమ్మాయిలను సైతం దారుణంగా కొట్టారు. ఢిల్లీ పోలీసులనే గూండాలకు వ్యతిరేకంగా మేం నిరసన చేపడుతున్నాం' అని పేర్కొన్నాడు. మరోవైపు, జామియా విద్యార్థులకు సంఘీభావంగా ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పరీక్షలను బాయ్‌కాట్ చేసి నిరసన చేపట్టారు.

**'బుల్లెట్ గాయాలతో' దవాఖానలో చేరిన ఇద్దరు విద్యార్థులు!**

ఆదివారం జామియా విద్యార్థులు చేపట్టిన నిరసనల్లో పాల్గొన్నట్లుగా భావిస్తున్న ఇద్దరు విద్యార్థులు బుల్లెట్ గాయాలతో సఫ్దర్ జంగ్ దవాఖానలో చేరినట్టు సమాచారం. అయితే తాము కాల్పులు జరుపలేదని, టియర్‌గ్యాస్ షెల్‌కు ఉండే పదునైన కొనవల్లే గాయాలై ఉంటాయని పోలీసులు చెబుతున్నారు



హౌరాలో పోలీసులపైకి రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

**పోలీసులపై కేసు పెడతాం:వీసీ**

యూనివర్సిటీలోకి పోలీసుల రాకను సహించబోమని, ఆదివారం రాత్రి విద్యార్థులపై పోలీసుల జరిపిన దాడిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని జామియా వర్సిటీ వీసీ నజ్మా అఖ్తర్ డిమాండ్‌చేశారు. పోలీసుల దాడిలో సుమారు 200 మంది విద్యార్థులు గాయపడ్డారని చెప్పారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, రాజకీయ నేతలెవరినీ వర్సిటీలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు. విద్యార్థుల మీద దాడిపైనా, వర్సిటీలో జరిగిన ఆస్తి నష్టంపైనా ఢిల్లీ పోలీసులపై కేసు నమోదు చేస్తామని వీసీ తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తున్న రాజకీయ పార్టీలు ఇకనైనా హింసను ఆపాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. పౌరసత్వ సవరణ చట్టం ఏ మతానికీ వ్యతిరేకం కాదన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం సరికాదని, శాంతియుతంగా నిరసన చేపట్టాలన్నారు.

### ఐఐటీలూ రంగంలోకి..

**జామియా** వర్సిటీ, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ విద్యార్థులపై పోలీసుల చర్యను నిరసిస్తూ ఐఐటీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ముంబై విద్యార్థులూ రంగంలోకి దిగారు. 'జాదవ్‌పూర్ యూనివర్సిటీలో విద్యార్థుల ప్రతిఘటనను అడ్డుకున్నప్పుడు మనం స్పందించలేదు. ఎంటెక్ ఫీజులు పెంచినప్పుడూ నోరు మెదపలేదు. జేఎన్‌యూ విద్యార్థులపై దాడిచేసినప్పుడూ స్పందించలేదు. ఇప్పుడు కూడా స్పందించకపోతే విద్యార్థి లోకం పట్ల మనకున్న నిబద్ధత ప్రమాదంలో పడుతుంది. కాబట్టి జేఎంఐ, ఏఎంయూ విద్యార్థులకు సంఘీభావంగా క్యాంపస్‌లో నిరసనకు కదలిరండి' అని కాన్పూర్ ఐఐటీ విద్యార్థులు ఒక పోస్టర్ విడుదల చేశారు. మంగళవారం క్యాంపస్‌లో నిరసన ర్యాలీకి వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ విద్యార్థులు కూడా ఆందోళనకు పిలుపునిచ్చారు. ఐఐటీ ముంబై విద్యార్థులు ఆదివారం రాత్రి నిరసన చేపట్టారు. మరోవైపు, బెంగళూరులోని ప్రతిష్ఠాత్మక ఐఐఎస్సీ విద్యార్థులు సోమవారం క్యాంపస్‌లో ఆందోళన నిర్వహించారు. ఇంకోవైపు, ఐఐఎం-బెంగళూరుకు చెందిన వంద మంది విద్యార్థులు ప్రధాని మోదీకి లేఖ రాశారు. శాంతియుత నిరసన చేపట్టేందుకు ప్రజలకున్న ప్రజాస్వామిక హక్కులను కాలరాయొద్దంటూ విజ్ఞప్తిచేశారు.

**యూపీలో 15 వాహనాలకు నిప్పు!**

ఉత్తరప్రదేశ్‌లోని మౌలో నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. దక్షిణ్‌టోలా పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. 15 వాహనాలకు నిప్పుపెట్టారు. దీంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి ఆందోళనకారులను చెదరగొట్టారు. అయితే మూడు నాలుగు వాహనాలకు మాత్రమే నిప్పుపెట్టినట్లు పోలీసులు చెబుతున్నారు. మౌలో 144 సెక్షన్ విధించారు. కాగా, ఆందోళనల నేపథ్యంలో అలీగఢ్ జిల్లా యంత్రాంగం మంగళవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది.

**ఇండియాగేట్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ**

ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద సోమవారం సాయంత్రం వేలాది మంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లోనూ నిరసనలు



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీస్ చర్యకు నిరసనగా హైదరాబాద్‌లోనూ నిరసనలు చోటుచేసుకున్నాయి. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సోమవారం తరగతులను బహిష్కరించి వర్సిటీ ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ నుంచి గచ్చిబౌలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

# జైల్లో పెట్టినా కేంద్రానికి లొంగను

- కావాలంటే మా ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవచ్చు
- ఎన్నార్సీ, సీఏఏకు వ్యతిరేకంగా సీఎం మమత భారీ ర్యాలీ
- ప్రాణం ఉన్నంతవరకూ బెంగాల్‌లో అమలు చేయబోమని వెల్లడి

**కోల్‌కతా:** తనను జైల్లో పెట్టినా సరే లొంగేది లేదని, కావాలంటే తమ ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవచ్చని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రానికి సవాల్ విసిరారు. జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా సోమవారం ఆమె నేతృతంలో కోల్‌కతాలో భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ఎన్నార్సీ, సీఏఏను రాష్ట్రంలో అమలు చేయబోను. మీరు కావాలనుకుంటే మా ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవచ్చు. నన్ను జైల్లో పెట్టినా సరే కేంద్రానికి లొంగేది లేదు. ఈ నల్ల చట్టాలను నేను ఎప్పటికీ అమలు చేయను. ఈ చట్టాలను రద్దు చేసేంత వరకు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కొనసాగిస్తా' అని చెప్పారు. ఇతరులకు సలహా ఇచ్చే ముందు ఈశాన్యంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితిని కేంద్రం గమనించాలని ఎద్దేవా చేశారు. ఎన్నార్సీపై గళమెత్తినప్పుడు తాము ఒంటరిగా ఉన్నామని, ఇప్పుడు ఢిల్లీ, బీహార్, మధ్యప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, కేరళ వంటి ఇతర రాష్ట్రాల సీఎంలు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని మమత చెప్పారు. ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులపై పోలీసుల దాడిని మమత ఖండించారు. మరోవైపు, సీఎం మమతా బెనర్జీ ర్యాలీకి నేతృత్వం వహించి అందులో పాల్గొనడం రాజ్యాంగ విరుద్ధమని బెంగాల్ గవర్నర్ జగదీప ధనకర్ విమర్శించారు. రాష్టంలో ఆందోళనకర పరిస్థితులను చక్కదిద్దాల్సిన సీఎం దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# భారతీయ ఆత్మపై దాడి

- జామియాలో పోలీసు దమనకాండను ఖండించిన ప్రియాంకాగాంధీ
- వర్సిటీల్లో విద్యార్థుల ఆందోళనకు సంఘీభావంగా ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన
- ఇది పిరికిపంద ప్రభుత్వం.. ట్విట్టర్‌లో ప్రియాంక మండిపాటు
- జామియా ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి: విపక్షాల డిమాండ్
- ప్రజలను హిందు-ముస్లింలుగా విభజించడానికి విపక్షాల కుట్ర: బీజేపీ



ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బైఠాయించిన ప్రియాంకాగాంధీ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులపై దాడిని భారతీయ ఆత్మపై జరిగిన దాడిగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభివర్ణించారు. యువత భారతీయ ఆత్మ అని, వారికి రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. జామియా, అలీగఢ్ ముస్లిం వర్సిటీల్లో పోలీసుల దమనకాండకు వ్యతిరేకంగా సోమవారం ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద కాంగ్రెస్ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన మౌన నిరసన కార్యక్రమానికి ప్రియాంకగాంధీ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, గులాం నబీ ఆజాద్, రణ్‌దీప్ సుర్జేవాలా పాల్గొన్నారు. నిరసన అనంతరం ప్రియాంక మాట్లాడుతూ.. 'దేశంలో బాధాకర పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు యూనివర్సిటీల్లోకి ప్రవేశించి (విద్యార్థులను) కొడుతున్నారు. ఒక తల్లిగా నేను పరిస్థితిని అర్థం చేసుకోగలను. విద్యార్థులంతా నా పిల్లల వయసున్న వారే. ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. పౌరసత్వ చట్టం రాజ్యాంగానికి వ్యతిరేకం. రాజ్యాంగ పరిరక్షణ కోసం, ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేం పోరాడుతాం' అని చెప్పారు. ఆదివారం రాత్రి జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీ జరిగిన వెంటనే ట్విట్టర్ వేదికగా ఆమె స్పందిస్తూ.. 'ఇది పిరికిపంద ప్రభుత్వం' అని మండిపడ్డారు. విద్యార్థుల గొంతును వినేందుకు భయపడుతున్న సర్కార్ 'నియంతృత్వం'తో విద్యార్థుల గొంతు నొక్కేసి, ధైర్య సాహసాలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు.

**జామియా ఘటనను ఖండించిన విపక్షాలు**

జామియా వర్సిటీ విద్యార్థులపై పోలీసుల దాడిని కాంగ్రెస్, ఇతర విపక్షాలు సోమవారం ఖండించాయి. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ మీడియాతో మాట్లాడుతూ అనుమతి లేకుండానే పోలీసులు జామియా వర్సిటీలోకి ఎలా ప్రవేశిస్తారని ప్రశ్నించారు. హింసాత్మక నిరసనల వెనుక కాంగ్రెస్ పార్టీ ఉందన్న ప్రధాని మోదీ ఆరోపణలను ఖండించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ జామియా వర్సిటీలోకి వెళ్లేందుకు పోలీసులకు అనుమతినిచ్చిందెవరని ప్రశ్నించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా మాట్లాడుతూ పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 19న లెఫ్ట్ పార్టీలు చేపట్టే ఆందోళనలో పాల్గొనాలని కోరారు. ఆర్జేడీ నేత మనోజ్‌ఝా మాట్లాడుతూ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. మీడియా సమావేశంలో ఎస్పీ నేత జావెద్ అలీఖాన్‌తోపాటు శరద్‌యాదవ్ పాల్గొన్నారు.

**విద్యార్థులను పావులుగా వాడుకుంటున్న విపక్షం: బీజేపీ**

పౌరసత్వ సవరణ చట్టంపై జరుగుతున్న ఆందోళనలో విద్యార్థులను విపక్షాలు తమ పావులుగా వాడుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. విపక్షాలు తమ భవిష్యత్ ప్రయోజనాల కోసం విద్యార్థులను రెచ్చగొడుతున్నాయని ధ్వజమెత్తింది.

# కొత్త ఆర్మీ చీఫ్‌గా నారావణే!

## డిసెంబర్ 31న జనరల్ బిపిన్ రావత్ పదవీ విరమణ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** భారత సైన్యానికి కొత్త అధిపతి రాబోతున్నారు. లెఫ్ట్‌నెంట్ జనరల్ మనోజ్ ముకుంద్ నారావణే తదుపరి భారత సైన్యాధిపతి కానున్నట్లు సంబంధిత అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. దాదాపు 13 లక్షల మందితో కూడిన భారత సైన్యానికి ఆయన సారథ్యం వహించనున్నారు. గత మూడేండ్లుగా భారత సైన్యానికి చీఫ్‌గా సేవలు అందిస్తున్న ప్రస్తుత ఆర్మీ అధిపతి జనరల్ బిపిన్ రావత్ డిసెంబర్ 31న రిటైర్మెంట్ తీసుకోనున్న నేపథ్యంలో ఆయన స్థానాన్ని నారావణే భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం నారావణే ఆర్మీ వైస్ చీఫ్‌గా కొనసాగుతున్నారు. అంతకు ముందు.. చైనాతో 4000కి.మీ. సరిహద్దు గల ప్రాంతాన్ని రక్షించే ఈస్టర్న్ కమాండ్ అధిపతిగా ఆయన పని చేశారు. తన 37 ఏండ్ల సర్వీసులో జమ్ము కశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం కోసం ఆయన ఎంతగానో కృషి చేశారు. శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్‌లో పనిచేశారు. మయన్మార్‌లోని భారత రాయబార కార్యాలయంలో మూడేండ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ మిలిటరీ అకాడమీకి నారావణే పూర్వ విద్యార్థిగా ఉన్నారు. జూన్ 1980లో సిక్కు లైట్ ఇన్ఫ్యాంట్రీ రెజిమెంట్ 7వ బెటాలియన్‌లో ఆయన తొలి నియామకం జరిగింది. జమ్ముకశ్మీర్‌లో బెటాలియన్‌ను సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ ఆయనకు సేన మెడల్ లభించింది. నాగాలాండ్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్ అస్సాం రైఫిల్స్(నార్త్)గా అందించిన సేవలకు గానూ విశిష్ట్ సేవా మెడల్, ప్రతిష్ఠాత్మక స్ట్రైక్ కాప్స్‌కు నేతృత్వం వహించినందుకు గానూ అతి విశిష్ట్ సేవా మెడల్‌లు నారావణేను వరించాయి.

# పాక్ కాల్పుల్లో ఇద్దరు సైనికుల మృతి

**జమ్ము/ శ్రీనగర్, డిసెంబర్ 16:** జమ్ముకశ్మీర్‌లోని బండిపోర్, రాజౌరి జిల్లాల పరిధిలో సరిహద్దుల వెంట పాక్ సైన్యం సోమవారం జరిపిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించారు. రాజౌరి జిల్లాలోని సుందర్‌బనీ సెక్టార్ కెరీ బట్టాల్ బెల్ట్ పరిధిలో పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడింది. దీంతో భారత్ సైన్యం దీటుగా సమాధానం ఇవ్వడంతో రాత్రి పది గంటల వరకు ఎదురు కాల్పులు జరిగాయని రక్షణశాఖ అధికారి తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు సైనికులు మృతిచెందారని చెప్పారు.



పోలీసుల అదుపులో కుల్దీప్‌సెంగార్ (ఫైల్)

# ఎమ్మెల్యే సెంగార్ రేపిస్ట్

- ఉన్నావ్ లైంగికదాడి కేసులో నిర్ధారించిన ఢిల్లీ కోర్టు
- శిక్ష ఖరారుపై 18న వాదనలు.. 19న తీర్పు వెలువడే అవకాశం
- కేసు విచారణలో సీబీఐ నిర్లిప్తంగా వ్యవహరించిందంటూ మందలింపు
- దర్యాప్తులో మహిళా అధికారి లేకపోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** గత ఏడాది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ లైంగికదాడి కేసులో బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను ఢిల్లీ కోర్టు దోషిగా తేల్చింది. సమాజంలో పలుకుబడిగల వ్యక్తి (సెంగార్)కు వ్యతిరేకంగా బాధితురాలు ఇచ్చిన సాక్ష్యం 'సత్యమైనది.. నిష్కళంకమైనది' అని పేర్కొంది. మైనర్ బాలికపై ప్రజా ప్రతినిధి లైంగికదాడికి పాల్పడిన నేరం కింద సెంగార్‌ను భారతీయ శిక్షా స్మృతి, పోక్సో చట్టం కింద దోషిగా ప్రకటించింది. సెంగార్‌కు విధించాల్సిన శిక్షపై బుధవారం నాడు వాదనలు జరుగనున్నాయి. గురువారంనాడు తీర్పు వెలువడే అవకాశం ఉన్నది. అయితే అతనిపై నమోదైన సెక్షన్ల ప్రకారం యావజ్జీవ జైలుశిక్ష పడవచ్చని భావిస్తున్నారు. ఈ కేసులో మరో నిందితుడు శశిసింగ్‌ను జిల్లా జడ్జి ధర్మేశ్ శర్మ నిర్దోషిగా విడుదల చేశారు. బాధితురాలు మైనర్ అని సీబీఐ రుజువు చేసిందని, దోషిపై ప్రత్యేక చట్టం కింద నిబంధనల ప్రకారమే విచారణ జరిగిందని కోర్టు పేర్కొంది. 'తాను లైంగికదాడికి గురైనట్టు బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం సత్యమైనది, నిష్కల్మషమైనది. ఆమె ఎంతో భయాందోళన చెందింది. ఆమె మహానగరంలో నివసించే విద్యావంతురాలుకాదు. ఓ సాధారణ గ్రామీణురాలు.. పైగా సెంగార్ ఎంతో శక్తిమంతమైన, పలుకుబడిగల వ్యక్తి. అందుకే ఆమె తనకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు కొంత సమయం తీసుకుంది' అని జడ్జి ధర్మేశ్ శర్మ తీర్పును చదువుతూ వ్యాఖ్యానించారు. బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాసిన తరువాత, ఆమె కుటుంబంపై అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, వీటి వెనుక సెంగార్ హస్తం స్పష్టంగా కనిపిస్తున్నదని కోర్టు వెల్లడించింది. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేయడంలో సీబీఐ జాప్యం చేయడంపై కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. సీబీఐ కారణంగానే విచారణ సుదీర్ఘంగా సాగిందని తెలిపింది. అలాగే ఈ కేసు దర్యాప్తులో ఓ మహిళా అధికారి లేకపోవడంపై కోర్టు సీబీఐని మందలించింది.

**ఉపాధి కోసం వస్తే లైంగికదాడి**

యూపీలోని బంగెర్‌మౌ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కుల్దీప్ సెంగార్ 2017లో తనకేదైనా ఉద్యోగం ఇప్పించమని వచ్చిన ఉన్నావ్ మైనర్ బాలిక (16)ను కిడ్నాప్ చేసి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసు నేపథ్యంలోనే బీజేపీ ఆయనను గత ఆగస్టులో పార్టీ నుంచి బహిష్కరించింది.

**పెండింగ్‌లో మరిన్ని కేసులు**

లైంగికదాడి బాధితురాలు తండ్రిపై నమోదైన అక్రమ ఆయుధాల కేసు, కస్టడీలో ఆయన మరణించిన కేసు, బాధితురాలికి జరిగిన రోడ్డు ప్రమాదం కేసు, బాధితురాలపై జరిగిన లైంగిక దాడి కేసుల విచారణ ఇంకా కొనసాగుతున్నది.

### ఎమ్మెల్యే రాక్షసకృత్యాలు

**తొలుత** ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్, ఆ తరువాత అతని సోదరుడు అతుల్, వారి అనుచరులు 2017 జూలైలో తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె కొన్ని నెలల పాటు ఉత్తరప్రదేశ్ పోలీసుల చుట్టూ తిరిగినా వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే సోదరుడు అతుల్ ఆమె తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. పైగా పోలీసులు బాధితురాలి తండ్రిపై అక్రమ ఆయుధాల కేసు నమోదుచేశారు. దీంతో ఆమె తనకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇంటిముందు ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ మరుసటి రోజే పోలీసు కస్టడీలో ఉన్న ఆమె తండ్రి మరణించారు. కుల్దీప్ అనుచరులే ఇంతకుముందు తన చిన్నాన్నను హత్య చేశారని, ఇప్పుడు తన తండ్రిని కూడా చనిపోయేలా కొట్టారని బాధితురాలు ఆరోపించారు. పోలీసులు బాధితురాలి తండ్రిని గత ఏడాది ఏప్రిల్ 3న అరెస్టు చేయగా, ఆయన ఏప్రిల్ 9న కస్టడీలోనే మరణించారు. వరుసగా జరిగిన ఘటనలపై అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో యూపీ పోలీసులు తొలుత ఎమ్మెల్యే సోదరుడిని అరెస్టు చేశారు. ఆ తరువాత అలహాబాద్ కోర్టు జోక్యంతో ఎమ్మెల్యే సెంగార్‌ను కూడా అరెస్టు చేశారు. ఆ వెంటనే కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. ఇక ఈ ఏడాది జూలై 28న బాధితురాలు తన బంధువులతో కలిసి ఒక కారులో వెళుతుండగా, ఒక లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె బంధువులైన ఇద్దరు మహిళలు మరణించగా, బాధితురాలు, న్యాయవాది తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డు ప్రమాదం కూడా సెంగరే చేయించాడని ఆమె ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌రంజన్ గొగోయ్‌కి ఒక లేఖ రాసింది. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ గొగోయ్ ఉన్నావ్ లైంగికదాడితో సంబంధం ఉన్న ఐదు కేసుల విచారణను లక్నో నుంచి ఢిల్లీ కోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించారు. లైంగికదాడి కేసు విచారణను 45 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# హింసాత్మక ఘటనలు బాధాకరం

- సమాజాన్ని విడదీసే స్వార్థపూరిత శక్తులకు అవకాశం ఇవ్వొద్దు
- ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- సీఏఏ వల్ల ఏ ఒక్క భారతీయ పౌరుడికి నష్టం ఉండదని భరోసా

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందించారు. ఈ ఘటనలపై విచారం వ్యక్తం చేస్తూ సోమవారం వరుస ట్వీట్లు చేశారు. సీఏఏ వల్ల ఏ భారతీయ పౌరుడికి నష్టం ఉండదని, ఏ మతానికి వ్యతిరేకంగా దీన్ని తీసుకురాలేదని ప్రధాని తెలిపారు. సమాజాన్ని విడదీసేందుకు ప్రయత్నిస్తున్న స్వార్థపూరిత శక్తులకు అవకాశం ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. 'శాంతి, ఐకమత్యం, సోదర భావంతో మెలగాల్సిన సమయమిది. తప్పుడు వదంతులను నమ్మవద్దు. సమాజాన్ని విడదీసేందుకు ప్రయత్నిస్తున్న స్వార్థపూరిత శక్తులకు అవకాశం ఇవ్వవద్దు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలు జరుగడం దురదృష్టకరం. ఇవి నన్నెంతో బాధపెట్టాయి' అని ట్వీట్ చేశారు. ఏ ఒక్క భారతీయుడి పౌరసత్వం లేదా ఏ మతంపై ఈ చట్టం ప్రభావం చూపదని భరోసా ఇస్తున్నానని మోదీ తెలిపారు. 'మెజార్టీ రాజకీయ పార్టీలు, సభ్యుల మద్దతుతోనే ఈ చట్టం పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందిందని పేర్కొన్నారు.



సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దేవ్‌నార్ స్కూల్ ఫర్ బ్లైండ్ ప్రతినిధులు రామస్వామి పరమేశ్వరన్ బృందం



శాసనమండలి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉన్నదని గుత్తా తెలిపారు.
-నమస్తే తెలంగాణ, తిరుమల

# శ్రీవారి ఆలయంలో ధనుర్మాసోత్సవం

నేటి నుంచి జనవరి 14 వరకు
సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై

**తిరుమల, నమస్తే తెలంగాణ:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. సోమవారం అర్ధరాత్రి ధనుర్మాసం ప్రారంభమైనందున మంగళవారం ఉదయం నుంచి 2020 జనవరి 14న ధనుర్మాసం ముగిసే వరకు తిరుప్పావై నిర్వహిస్తారు. 12 మంది ఆళ్వారుల్లో ఒకరైన శ్రీఆండాళ్ (గోదాదేవి) స్వామివారిని స్తుతిస్తూ రచించిన 30 పాశురాలే తిరుప్పావైగా తమిళ సాహిత్యంలో విశేష ప్రాచుర్యం పొందాయి. శ్రీవారి ఆలయంలో 30 రోజులపాటు తిరుప్పావై పారాయణంలో రోజుకు ఒకటి అర్చకులు నివేదిస్తారు. ఈ సందర్భంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే మధ్యకాలమే ధనుర్మాసం, ఈ కాలంలో వ్రతాలు, పూజలు, ధార్మిక కార్యక్రమాలు చేస్తే పాపకర్మలు నశించి మోక్షప్రాప్తి కలుగుతుందని అంటారు.



## ఆర్టీఐ కమిషనర్ల నియామకానికి నోటిఫికేషన్

ఈ నెల 20వ తేదీవరకు దరఖాస్తులకు గడువు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. కమిషనర్ పదవి కోసం ఔత్సాహికులైనవారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆసక్తి గలవారు తెలంగాణ ప్రభుత్వ సెక్రటేరియట్ బీఆర్కే భవన్ తొమ్మిదో అంతస్తులోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి అన్ని డాక్యుమెంట్లు, ఎన్‌క్లోజర్లతోపాటు రిజిస్టర్ పోస్ట్ ద్వారా దరఖాస్తులు పంపాలని సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పష్టంచేశారు.

## ఇమామ్‌లకు రెండు నెలల గౌరవవేతనం విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాల్ని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తున్నదని తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజమ్‌లకు రెండునెలల గౌరవవేతనాన్ని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. జూలై, ఆగస్టు నెలల్లో 9,975 మందికి రూ.ఐదు వేల చొప్పున రూ.9.97 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. కాగా, హైదరాబాద్ నాంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మసీదుల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.53 లక్షలు చెక్కును ఆయన ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మిరాజ్‌కు అందజేశారు.

# వృద్ధులు దేశ సంపద

- వారి అనుభవం ఎంతో అవసరం
- పథకాల అమల్లో భాగంకావాలి
- ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి
- పింఛన్ల పెంపుతో వృద్ధులకు గౌరవం పెరిగింది
- వయోధికుల సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/అహ్మద్‌నగర్:** తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా నడిపించటంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనుక్షణం కృషిచేస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వ పథకాల అమలులో వృద్ధులు భాగస్వాములుకావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణ, బంగారు తెలంగాణగా మార్చాలన్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలువాలని కోరారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన తెలంగాణ వయోధికుల వార్షికసమ్మేళనానికి మంత్రి హరీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోధికులతో ముచ్చటించారు. వారుచేస్తున్న పలు సేవా కార్యక్రమాలను ఒక్కొక్కటిగా తెలుసుకున్నారు. అనంతరం పలువురు వయోధికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు దేశానికి సంపదవంటి వారన్నారు. వృద్ధులు చిన్న పిల్లలతో సమానమని, బాల్యంలో ఎలాంటి కల్మషం లేకుండా ఉంటారో వృద్ధాప్యంలో కూడా అదేవిధంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వృద్ధుల అనుభవం మంచి కార్యక్రమాలకు ఎంతో అవసరమని చెప్పారు. బాల్యానికి శిక్షణ, యవ్వనానికి లక్ష్యం, వృద్ధులకు రక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. వృద్ధులు హరితహారం, గ్రామాల అభివృద్ధి వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. వృద్ధులకు తెలంగాణ రాష్ట్రంలో గౌరవం పెరిగిందని, వృద్ధాప్య పింఛన్లను ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.200ల నుంచి రూ.2 వేల వరకు పెంచడంతో ఆత్మాభిమానంతో, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నారని చెప్పారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోనివారు మనుషులేకాదని మంత్రి హరీశ్ వ్యాఖ్యానించారు. ఆరోగ్యం గురించి కొడుకో, కోడలో అడిగితేచాలు వృద్ధులు ఎంతో సంతోషపడుతారన్నారు. వృద్ధుల పట్ల ఎలా వ్యవహరించాలనే అంశాన్ని పాఠ్యాంశాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. వయోధికులు కూడా విద్యార్థులతో గడిపేందుకు సమయం వెచ్చించాలని, వారికి సంప్రదాయాలు, నైతిక విలువలను నేర్పించాలని సూచించారు. గతంలో గ్రామాల్లో పరిస్థితులు, పాలకుల తీరు, ఇప్పుడు మారుతున్న పరిస్థితులు, స్వరాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, మిషన్ భగీరథ వంటి పథకాలపై వయోధికులు అనుభవాలను పంచుకోవాలని, స్వచ్ఛ తెలంగాణ కోసం పాటుపడాలని సూచించారు. వయోధికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో సీనియర్ సిటిజన్ భవనాలు ఏర్పాటుచేసి, వాటిలో లైబ్రరీ, గేమ్స్, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలతో డేకేర్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వయోధికులకు ఇంటివద్దకే వచ్చి వైద్య సేవలందించే సంచార వైద్యశాలల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వయోధికుల అంశాలపై ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటైన ట్రిబ్యునళ్లు మరింత మెరుగ్గా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమలో ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, వయోధికుల సంఘం ప్రతినిధులు నర్సింహారావు, ప్రకాశ్‌రావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రభారతిలో వయోధికుల వార్షిక సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మండలిలో విప్ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

## మూడో టీఎంసీపై ముమ్మర కసరత్తు

- ఎల్లంపల్లి నుంచి ఎస్సారార్ జలాశయానికి రెండుదశల్లో లిఫ్టు
- రూ.12,700 కోట్లతో టెండర్లకు సిద్ధమవుతున్న నీటిపారుదలశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటికే రెండు టీఎంసీల గోదావరిజలాల తరలింపు విజయవంతమవడంతో మూడో టీఎంసీ తరలింపుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. లక్ష్మీబరాజ్ నుంచి సరస్వతి..పార్వతిబరాజ్ ఆపై ఎల్లంపల్లి వరకు మూడో టీఎంసీ తరలింపు వ్యవస్థ పూర్తయింది. ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం(మిడ్‌మానేరు)కు రెండు టీఎంసీల తరలింపు వ్యవస్థ పూర్తయ్యింది. మూడో టీఎంసీ తరలింపునకు చేపట్టే పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.12,700 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతి ఇవ్వాల్సి ఉన్నది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే టెండర్ల పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎల్లంపల్లి నుంచి ఎస్సారార్‌కు మూడో టీఎంసీ తరలింపునకు రెండుదశల్లో నీటిని ఎత్తిపోయనున్నారు. ఎల్లంపల్లి ఫోర్‌షోర్ నుంచి అప్రోచ్‌చానెల్‌కు నీటిని తరలిస్తారు. అక్కడ నిర్మించే ఓపెన్‌పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి రంగధాంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు పదికిలోమీటర్లమేర ఆరు వరుసల పైప్‌లైన్లు ప్రతిపాదించారు. ఈ పంప్‌హౌస్‌లో 118 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఆరు పంపులను అమర్చాలని ప్రతిపాదించారు. రంగధాంపల్లి రిజర్వాయర్‌ను అర టీఎంసీతో నిర్మించి అక్కడి నుంచి రెండోలిఫ్టు వ్యవస్థ కోసం మరో పంపుహౌస్‌ను నిర్మించి మళ్లీ పైప్‌లైన్ల ద్వారా జలాలను వరదకాల్వకు తరలిస్తారు. తద్వారా గ్రావిటీతో నీరు శ్రీరాజరాజేశ్వర జలాశయానికి చేరుతుంది. రెండో పంపుహౌజ్‌లోనూ 100 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు పంపులు ఏర్పాటు చేస్తున్నారు.

**ఎస్సారెస్పీకి ఒకటి.. మలన్నసాగర్ వైపు రెండు**

అదనపు టీఎంసీ నీటిని ఎల్లంపల్లి నుంచి ఎస్సారార్ జలాశయానికి తరలించడం వల్ల అదనపు ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఎల్లంపల్లి నుంచి ఎస్సారార్‌కు రెండు టీఎంసీల తరలింపు జరుగుతున్నందున..ఒక టీఎంసీ శ్రీరాంసాగర్ పునర్జీవన పథకం ద్వారా ఎస్సారెస్పీకి వెళ్తుంది. దీంతో ఎస్సారార్ నుంచి రెండు టీఎంసీలను మల్లన్నసాగర్ వైపు మళ్లించేందుకు వెసులుబాటు లభిస్తుంది. దీంతో హైదరాబాద్ తాగునీటిసరఫరాల కోసం చేపట్టే కేశవాపూర్ రిజర్వాయర్‌కు నీరందించడంతో పాటు సింగూరు, నిజాంసాగర్,సూర్యాపేటజిల్లా వరకు ఉన్న ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. నీటిలభ్యత కరువైతే కృష్ణా ప్రాజెక్టుల ఆయకట్టుకు నీళ్లిచ్చే అవకాశం ఉంటుంది.

## 50 లక్షలు ఇవ్వకుంటే కొడుకును చంపేస్తా

- స్టీల్ వ్యాపారికి బెదిరింపులు
- మాజీ డ్రైవర్ అరెస్టు

**ఖైరతాబాద్:** యాభై లక్షల రూపాయలు ఇవ్వకుంటే కొడుకును చంపేస్తానంటూ స్టీల్ వ్యాపారిని బెదిరిస్తున్న వ్యక్తిని సోమవారం సైఫాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ షాదాన్ కళాశాల సమీపంలో స్టీల్‌వ్యాపారి విజేంద్రకుమార్ అగర్వాల్(52) కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గతనెల 29న ఆయన ఫోన్‌కు ఓ నంబరు నుంచి కాల్ వచ్చింది. రూ.50 లక్షలు ఇవ్వకుంటే నీ ఫ్యామిలీ అంతుచూస్తానని అవతలి వ్యక్తి బెదిరించాడు. ఈ నెల 7న మళ్లీ ఫోన్‌చేసి డబ్బు ఇవ్వకుంటే అగర్వాల్ కొడుకు నితిన్‌ను చంపేస్తానని హెచ్చరించాడు. మళ్లీ 13న ఫోన్‌చేయగా స్పందించకపోడంతో ల్యాండ్‌లైన్‌కుచేసి బెదిరించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఫోన్ సిగ్నల్ ఆధారంగా బజార్‌ఘాట్‌కు చెందిన శివాజీ (27)ని నిందితుడుగా గుర్తించి అరెస్టుచేశారు. నిందితుడు గతంలో అగర్వాల్ వద్ద కారుడ్రైవర్‌గా పనిచేశాడు. ఆర్థిక సమస్యలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్టు నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు.

# క్రిస్మస్ విందుకు ఘనంగా ఏర్పాట్లు

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మంత్రులు మహమూద్‌అలీ, మల్లారెడ్డితో కలిసి సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న విందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. సోమవారం బీఆర్కే భవన్‌లో క్రిస్మస్ విందు ఏర్పాట్లపై హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని పండుగల మాదిరిగానే క్రిస్మస్‌ను కూడా ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని, ఈ విందుకు సుమారు పదివేల మంది హాజరవుతున్నందున అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, పూల అలంకరణ, పబ్లిక్ అడ్రెస్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్ డిస్‌ప్లే ఏర్పాట్లు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన క్రైస్తవులకు గిఫ్ట్ ప్యాకెట్లను ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. ఈ నెల 18న ఎల్బీ స్టేడియంలో విందు ఏర్పాట్లను పరిశీలించనున్నట్టు తెలిపారు. మంత్రు లు మహమూద్ అలీ, మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి క్రిస్మస్ విందు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, మైనార్టీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, డైరెక్టర్ షానవాజ్ ఖాసిం, డీసీపీ జోయల్ డేవిస్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఏహెచ్ ఎన్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్కేభవన్‌లో క్రిస్మస్ విందు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ ఉన్నారు.

## పల్లె ప్రగతితో గ్రామాల అభివృద్ధి

- అందరూ భాగస్వామ్యులు కావాలి: సర్పంచ్‌ల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జనవరిలో నిర్వహించే పల్లెప్రగతి ప్రణాళికలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కటి వెంకటేశ్‌యాదవ్ సర్పంచ్‌లకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ తొలివిడుత ప్రగతికి సంబంధించిన కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాయింట్ చెక్‌పవర్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, త్వరలోనే సీఎం కేసీఆర్‌కు ఈ విషయాన్ని వివరిస్తామని చెప్పారు. పల్లె ప్రణాళికలో మొక్కలు ఎండిపోతే సర్పంచ్‌లనే బాధ్యులుగా చేస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యాన్ని సర్పంచ్‌లపై పెట్టడం సరికాదని అభిప్రాయ పడ్డారు.

## బాలికలను వేధించిన వ్యక్తికి జైలుశిక్ష

**ఘట్‌కేసర్:** బాలికలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన ఓ వ్యక్తికి రంగారెడ్డి జిల్లా కోర్టు మూడేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో 38 ఏండ్ల మహిళ భర్త సౌదీ ఆరేబియాలో ఉంటారు. భర్త వద్దకు వెళ్తూ.. 2017 మార్చి 19వ తేదీన 12, 10 ఏండ్ల వయసున్న ఇద్దరు కూతుర్లు, ఆరేండ్ల కొడుకును అత్తగారింట్లో వదలింది. సౌదికి వెళ్లిన అనంతరం నిత్యం పిల్లలతో ఫోన్‌లో మాట్లాడేది. 2017 ఏప్రిల్ 2న ఇంట్లో నల్లా చెడిపోవడంతో బోడుప్పల్ ఇంది రానగర్‌కు చెందిన ప్లంబర్ ఎండీ రసూల్ వచ్చి మరమ్మతు చేశాడు. ఈ క్రమంలో నల్లా పనిచేస్తున్న తీరు నుచూడమని పెద్ద కూతురును కోరాడు. వంటగదిలోకి రాగానే బాలికను పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. కేకలేసి నాయనమ్మను పిలువడంతో నిందితుడు బాలికను వదలిపెట్టాడు. మరోమారు తమ్ముడిని ఎత్తుకొని లిఫ్ట్‌లో వెళ్తున్న చిన్న కుమార్తె పట్ల కూడా ఇలాగే ప్రవర్తించాడు. దీనిపై తల్లి సూచనల మేరకు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో 2017 ఏప్రిల్ 4న ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా.. దాదాపు 20 నెలలపాటు విచారణ కొనసాగింది. చివరకు నిందితుడు రసూల్‌కు మూడేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.రెండువేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

# ఆరోగ్య తెలంగాణ కోసం కృషి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- అంగన్‌వాడీలతో మరింత బలవర్ధక ఆహారం
- మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- ఎన్ఐఎన్‌లో బాలామృతం ప్లస్ పథకం ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/తార్నాక:** ఆరోగ్య తెలంగాణ కోసం రాష్ట్రప్రభుత్వం నూతన సంస్కరణలు, ఆర్థిక విధానాలను తీసుకొస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలు, బాలికల కోసం చేపట్టిన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఐదేండ్లలోపు పిల్లలకు పోషకాహారలోపాన్ని తగ్గించడానికి యూనిసెఫ్ సాంకేతిక సహకారంతో తయారుచేసిన బాలామృతంప్లస్ పథకాన్ని తార్నాకలోని జాతీయ పోషకహార సంస్థ (ఎన్ఐఎన్)లో సోమవారం మంత్రి ఈటల.. మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎన్ఐఎన్ డైరెక్టర్ ఆర్ హేమలత, ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా కుమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అమలుచేస్తున్నట్టు చెప్పారు. పోషకాహార లోపంతో చిన్నపిల్లలు, గర్భిణులు కొట్టుమిట్టాడుతుండటం బాధాకరమన్నారు. దీనిని గుర్తించిన సీఎం కేసీఆర్ గర్భిణులకు పోషకాహారాన్ని అందించాలని నిర్ణయించారన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. ఐదేండ్లలోపు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నామన్నారు. 200 మి.లీ పాలతోపాటు గుడ్ల సంఖ్యను 15 నుంచి 30 వరకు పెంచామన్నారు. ఐసీడీఎస్, తెలంగాణ ఫుడ్ ద్వారా నాణ్యమైన ఆహారాన్ని సకాలంలో అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనిసెఫ్ దక్షిణ రాష్ట్రాల చీఫ్ మిషన్ రాష్డియా, మహిళా, శిశు సంక్షేమశాఖ జేడీ అనురాధ, యూనిసెఫ్ న్యూట్రిషన్ స్పెషలిస్టు డాక్టర్ ఖ్యాతి తివారీ తదితరులు పాల్గొన్నారు.



తార్నాకలోని ఎన్ఐఎన్‌లో నిర్వహించిన బాలామృతం ప్లస్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో చిన్నారికి ఆహారాన్ని తినిపిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో మంత్రి ఈటల ఉన్నారు.

## ప్రభుత్వ స్కూళ్ల భవనాలను 'డొమెస్టిక్'లో చేర్చండి

విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు పుట్ట మధు విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సౌకర్యాల కల్పనలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిందని, అయితే వాటిని కమర్షియల్ క్యాటగిరీలో చేర్చి విద్యుత్ బిల్లులు వసూలు చేయడాన్ని నిలిపివేయాలని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను డొమెస్టిక్ విభాగంలో చేర్చి విద్యుత్ బిల్లులు వసూలుచేయాలని సోమవారం విద్యుత్ నియంత్రణ కమిషన్ చైర్మన్ శ్రీరంగారావుకు విజ్ఞప్తిచేశారు. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకొంటామని శ్రీరంగారావు తెలిపారని పుట్ట మధు పేర్కొన్నారు.

## పౌరసత్వ రద్దు ఆదేశాలపై స్టే పొడిగింపు

- ఎమ్మెల్యే చెన్నమనేనికి రెండు పౌరసత్వాలుంటే చూపండి
- ప్రతివాదికి హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారత పౌరసత్వం రద్దు వ్యవహారంలో వేములవాడ టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు మరోసారి హైకోర్టులో ఊరట లభించింది. రమేశ్‌బాబు పౌరసత్వాన్ని రద్దుచేస్తూ కేంద్రహోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై గతంలో స్టే విధించిన హైకోర్టు.. ఆ స్టే గడువును మరో ఎనిమిది వారాలపాటు పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రమేశ్‌బాబుకు జర్మనీ,భారత్ రెండు పౌరసత్వాలు ఉన్నాయని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. రమేశ్‌బాబు తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. జర్మనీ పౌరసత్వం వదులుకున్నట్టు నిరూపించే ఆధారాలు, పత్రాలను ఈ ఏడాది ఏప్రిల్‌లోనే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేంద్రంతోపాటు రమేశ్‌బాబు ఎన్నికను సవాల్‌చేసిన ప్రత్యర్థికి కూడా పంపించామని స్పష్టంచేశారు. పౌరసత్వం వదులుకున్నట్టు ఇచ్చిన డాక్యుమెంట్లపై కేంద్ర హోంశాఖ నుంచి, ప్రత్యర్థి నుంచి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని వివరించారు. జర్మనీ పౌరసత్వం వదులుకున్న అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. గతంలో కేంద్రం ఇచ్చిన పౌరసత్వ రద్దు ఉత్తర్వులను కొట్టేయడంతోపాటు దరఖాస్తును మళ్లీ పరిశీలించాలని ఆదేశాలు జారీచేసిందని గుర్తుచేశారు. వాదనలను నమోదుచేసుకున్న ధర్మాసనం.. చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దుచేస్తూ కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై స్టేను మరో ఎనిమిది వారాలు పొడిగించింది. రెండు పౌరసత్వాలు ఉన్నట్టు ఆధారాలుంటే సమర్పించాలని ప్రతివాదిని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుచేయాలని తెలిపింది.

## పర్యాటక అభివృద్ధికి భారీగా నిధులు

కేంద్ర పర్యాటకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దత్తా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పర్యాటకరంగ అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తున్నదని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్రుప దత్తా పేర్కొన్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్(ఎన్ఎస్ఓ), కేంద్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో 'దేశీయ పర్యాటక వ్యయం- బహుళ సూచికలు'పై నిర్వహించనున్న 78వ రౌండ్‌సర్వేకు సంబంధించిన మూడ్రోజుల ప్రాంతీయశిక్షణ సదస్సును ఆయన సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. సదస్సులో దత్తా మాట్లాడుతూ.. ఎన్ఎస్ఓ అధికారులు సర్వేలో సేకరించే వివరాలు పర్యాటకశాఖకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ఎన్ఎస్ఓ డైరెక్టర్ సతీశ్.. మాట్లాడుతూ పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. దేశవిదేశాల నుంచి యాత్రికులు వస్తుండటంతో వసతి, రవాణా, హస్తకళలు వంటి రంగాల్లో ఉపాధి పెరుగుతున్నదని చెప్పారు. సదస్సులో అన్నిజిల్లాల అధికారులు పాల్గొనాలని కోరారు.


తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ-ధర్మాదాయశాఖ
NIT No.SKDD/21/Tender Notice/2019 ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ Dt : 17.12.2019 (1వ సారి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మం॥, కేశవాపురం- జగన్నాధపురం గ్రా॥ శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) లో 2 ఫంక్షన్ హాల్స్ (700 మంది కెపాసిటి ఒకటి రూ.2.21 కోట్లతో మరియు 500 మంది కెపాసిటి ఒకటి రూ. 1.69 కోట్లతో) నిర్మాణం కొరకు ఇ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్స్ కోరబడుతున్నవి. మరింత సమాచారం కొరకు http://tender.telangana.gov.in దర్శించగలరు. బిడ్డు డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 17.12.2019, బిడ్డు డౌన్‌లోడింగ్ ముగింపు (దాఖలు) తేది : 31.12.2019.
సం/- కార్యనిర్వాహణాధికారి, దేవాదాయశాఖ

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
టెండరు నోటీస్ ఆఫ్ చీఫ్ ఇంజినీర్/400kV
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
దిగువ వివరించిన స్పెసిఫికేషన్ నెం. e-EHVT-01/2019 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టర్న్‌కీ ప్రాతిపదికపై KTPP స్విచ్‌యార్డ్, భూపాలపల్లి వద్ద 400/220/132kV సబ్-స్టేషన్ సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట కొరకు స్థానిక పోటీ బిడ్డింగ్ క్రింద TSTRANSCO టెండరు కోరుతోంది. వివరాల కొరకు మా వెబ్‌సైట్: www.eprocurement.telangana.gov.inను దర్శించండి.
సంప్రదించాల్సిన నెం: 040-23323933-Extn:3500 / 3541
040-23396000-Extn:3635, 3580,3581
R.O. No. 42/19 సం/- చీఫ్ ఇంజినీర్/400kV

తెలంగాణ ప్రభుత్వము
అటవీ శాఖ
T.No. 02/2019-20/S3 ఇ-ప్రొక్యూర్‌మెంట్ స్వల్పకాలిక టెండరు ప్రకటన తేది: 13-12-2019
రాజన్న సిరిసిల్ల మరియు కరీంనగర్ జిల్లాల యొక్క CA ఏరియాల చుట్టూ MS యాంగిల్ పోస్ట్‌లతో హాట్ డిప్డ్ చెయిన్ లింక్ మెష్ యొక్క స్థాపన కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. 2019-20 సంవత్సర కాల వ్యవధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెసిడెన్షియల్ క్వార్టర్స్ యొక్క నిర్మాణం మరియు రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొక్కలు పెంచుట కొరకు అడ్వాన్స్ ఆపరేషన్స్ (1 Cum పిట్స్ యొక్క క్లియరెన్స్ మరియు త్రవ్వుట). పనుల సంఖ్య: 20. మొత్తం ECV: రూ. 10.37 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభం: 13-12-2019న సా. 4.00 గం.నుండి, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 20-12-2019న ఉ. 11.00 గం. టెండరు దాఖలు కొరకు చివరి తేది: 20-12-2019న ఉ. 11.00 గం. సాంకేతిక బిడ్ తెరుచుట: 20-12-2019న మ. 12.00 గం. ధర బిడ్ తెరుచుట: 20-12-2019న మ. 2.00 గం. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- జిల్లా అటవీ అధికారి, రాజన్న సిరిసిల్ల & కరీంనగర్
DIPR R.O.No. 1972 DP/CL/Advt/1/2019-20 తేది: 16-12-2019

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ
ఆసక్తి వ్యక్తీకరణ తేది: 12-12-2019
తెలంగాణ ప్రభుత్వం, ప్రణాళిక శాఖ వారు తెలంగాణాలోని 33 జిల్లాల్లో భారీ స్థాయిలో, ప్రతినిధి, బహుళరంగ సర్వేలు నిర్వహించుటకు డేటా కలెక్షన్ ఏజెన్సీల ఎంప్యానలింగ్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతున్నారు. ఆసక్తి గల ఏజెన్సీలు tsdps.telangana.gov.in వద్ద లభించే వివరమైన ప్రకటనను చూసుకొని మరియు EOIని 31-12-2019న లేదా ఆలోగా 17.00 గంటల వరకు దాఖలు చేయాల్సిందిగా కోరడమైనది.
సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ రాష్ట్రాభివృద్ధి ప్రణాళిక సంస్థ, గణక భవన్, మునిసిపల్ కార్యాలయం ఎదురుగా, ఖైరతాబాద్, హైదరాబాద్-500004
DIPR R.O.No. 541 PP/CL/Advt/1/2019-20 తేది: 16-12-2019

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
''టూరిజం హౌస్'', #3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
EOI టెండరు ప్రకటన నం. 8/SE/TSTDC/2019-20 తేది: 16-12-2019
TSTDC కొరకు (రూ. 15.00 లక్షలు) వరకు గల ప్లంబింగ్, శానిటరీ, మైనర్ స్ట్రక్చరల్ స్టీల్ పనులు కలిపి పెట్టీ సివిల్, ఇంటీరియర్ ఫర్నీచర్, విద్యుత్తు పనుల వంటి TSTDC యూనిట్ల యొక్క మరమ్మతులు మరియు నవీకరణ కొరకు కాంట్రాక్టర్ల యొక్క ఎంపిక కొరకు TSTDC వారు ఆసక్తి వ్యక్తీకరణని కోరుతున్నారు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 18-12-2019 నుండి మరియు EOI యొక్క దాఖలు కొరకు చివరి తేది: 02-01-2020న మ. 3.00 గంటలలోగా పూర్తి వివరాల కొరకు TSTDC వెబ్‌సైట్ "tourism.telangana.gov.in" చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TSTDC లిమిటెడ్, హైదరాబాద్



మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సోమవారం అయ్యప్ప స్వామి పంబ ఆరట్టు వేడుకను వైభవంగా నిర్వహించారు. తొర్రూరు పెద్ద చెరువులో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు తదితరులు పాల్గొన్నారు. - తొర్రూరు, నమస్తే తెలంగాణ

## నాలా కన్వర్షన్‌కు రూ.75 వేలు లంచం

### ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తాసిల్దార్



సందీప్‌కుమార్

**హుజూరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ భూమిని వ్యవసాయేతర(నాలా కన్వర్షన్) భూమిగా మార్చేందుకు రూ.75వేలు లంచం తీసుకుంటూ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తాసిల్దార్ సందీప్‌కుమార్ సోమవారం ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ ఏసీపీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన ఎడ్ల జోగిరెడ్డి శంకరపట్నం మండలం ఆముదాలపల్లిలో 2.32 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. అక్కడ పరిశ్రమ స్థాపించడానికి నాలా కన్వర్షన్ అనుమతి కోసం ఆర్డీవో కార్యాలయంలో 15 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. దాని కోసం రూ.2 లక్షలు లంచం ఇవ్వాలని డిప్యూటీ తాసిల్దార్ సందీప్‌కుమార్ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం బాధితుడు జోగిరెడ్డి.. సందీప్‌కుమార్‌కు కార్యాలయంలో రూ.75 వేలు అందజేశాడు. ఆ డబ్బులను తీసుకొని సందీప్‌కుమార్ మధ్యాహ్న భోజనానికి వెళ్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న రూ.75 వేలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయం సోమవారం కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. 35 వేలకుపైగా భక్తులు రాజన్నను దర్శించుకోగా సుమారు రూ.19 లక్షల ఆదాయం సమకూరింది. - వేములవాడ కల్చరల్





పటాన్‌చెరులో ప్రభుత్వ బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఉన్నారు.



సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పసుపు రైతులు



ఎంపీ అర్వింద్ స్వగ్రామమైన వేల్పూరులో ఆయన దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులు



నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కళ్యాపూర్ ప్రధాన కూడలి వద్ద ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రైతులు

## విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

### ఆడపిల్లలకు డయల్ 100 గురించి వివరించాలి: మంత్రి హరీశ్‌రావు

**పటాన్‌చెరు, నమస్తే తెలంగాణ:** విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పలు అభివృద్ధి పనులను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మొదట అరబిందో పరిశ్రమ సహకారంతో నిర్మించిన జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సొంత ఖర్చుతో అందించిన 11 వేల డిక్షనరీలు, 6 వేల మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. అమ్మాయిలను గౌరవించేవిధంగా విద్యాసంస్థల్లో బోధన ఉండాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీ, రిటైర్డ్ అధికారులతో విద్యార్థులకు తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అమ్మాయిలకు 100 నంబర్‌కు డయల్ చేయడంపై మహిళా పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణానికి నిధులు ఇచ్చిన అరబిందో పరిశ్రమ ఎండీ నిత్యానందరెడ్డిని సత్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయ భవనాన్ని, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. 752 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ఇస్తున్న బియ్యం బస్తాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కలెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న పసుపు రైతు

### ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు

### ఇందూరు జిల్లావ్యాప్తంగా మిన్నంటిన ఆందోళనలు

- ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనాలు
- మోసకారి అర్వింద్ రాజీనామా చేయాలని డిమాండ్

**నిజామాబాద్, నమస్తేతెలంగాణప్రతినిధి:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ఇందూరు పసుపు రైతులు భగ్గుమన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు విషయంలో మాటమార్చి మోసం చేసిన అర్వింద్ వెంటనే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో పసుపు బోర్డు గురించి తనకు అసలు అవగాహనే లేదని ఒప్పుకున్న అర్వింద్, ఓట్ల కోసం పచ్చిమోసగాడి అవతారమెత్తాడనే విషయాన్ని అంగీకరించాడని రైతులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లావ్యాప్తంగా అర్వింద్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మీడియా సమావేశం ఏర్పాటుచేసి అర్వింద్ వైఖరిపై తూర్పారబట్టారు. అర్వింద్‌కు పిచ్చిపట్టిందని, మెంటల్ దవాఖానలో చేర్పించాలని ఆయన ఘాటు విమర్శలు చేశారు.

**జిల్లావ్యాప్తంగా నిరసనలు..**

రెంజల్ మండలంలోని కళ్యాపూర్‌లో సోమవారం రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసం సాయిలు ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను శవయాత్రగా తీసుకొచ్చి ప్రధాన కూడలి వద్ద దహనం చేశారు. కమ్మర్‌పల్లిలోని భీమ్‌గల్ చౌరస్తా వద్ద రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేసి తాసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ముప్కాల్‌లోని గాంధీ విగ్రహం వద్ద, బాల్కొండ, ఏర్గట్లలో టీఆర్‌ఎస్ నాయకులు, రైతులు అర్వింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మెండోరాలో బాల్కొండ నియోజకవర్గ పసుపు మద్దతు ధర రైతు సాధన సమితి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను బస్టాండ్ ఆవరణలో దహనం చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులకు మాయమాటలు చెప్పి ఎంపీగా అర్వింద్ గద్దెనెక్కారని ఆరోపించారు. పసుపు మద్దతు ధర, పసుపుబోర్డును ఐదు రోజుల్లో కేంద్ర ప్రభుత్వంతో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా హామీ నెరవేర్చడం లేదని విమర్శించారు. మోర్తాడ్ బస్టాండ్ ప్రాంతంలో అర్వింద్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి ఆపై దహనం చేశారు. అర్వింద్ స్వగ్రామమైన వేల్పూర్‌లో రైతుల నిరసన వ్యక్తం చేసి తాసిల్దార్ సతీశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

**మద్దతు ధర కోసం జగిత్యాలలో ర్యాలీ**

**జగిత్యాల, నమస్తేతెలంగాణ:** పసుపు పంట క్వింటాల్‌కు రూ.15 వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం జగిత్యాల పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 30 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశామన్నారు. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నదని, పంటకు మద్దతు ధర లేకపోవడంతో ఓపెన్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ.7వేల ధర మాత్రమే పలుకుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలి

### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్



**జగిత్యాల రూరల్:** రైతులను మోసగించిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తాను గెలుపొందిన ఐదు రోజుల్లోపే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బాండ్ రాసిచ్చి రైతులను నమ్మించి మోసం చేశాడన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరిగి 200 రోజులు గడిచినా పసుపు బోర్డు గానీ, మద్దతు ధర ఊసే లేదన్నారు. మద్దతు ధర కల్పించడంతోపాటు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని పచ్చి అబద్ధాలు చెప్పి ఎన్నికల్లో గెలుపొందాడన్నారు. మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితను ఓడించడమే ధ్యేయంగా పనిచేశానని ఎంపీ అర్వింద్ మాట్లాడటం సరికాదన్నారు. ఆయనపై రైతులే చీటింగ్ కేసులు పెడతారని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.



పురాతన ఆలయాలను కాపాడుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. సోమవారం ఆమె వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ఎల్లకొండ శివాలయాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సందర్శించారు. స్వామివారికి అభిషేకం, అర్చన, అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ, కుంకుమార్చనతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. - నవాబుపేట

## సెలవులు ఇవ్వట్లేదని టీచర్ ఆత్మహత్యాయత్నం



రాంబాయి

**దేవరకొండ, నమస్తే తెలంగాణ:** సెలవులు ఇవ్వకుండా ప్రధానోపాధ్యాయుడు తనను మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడంటూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండ ఎంఈవో ఆఫీసులో చోటుచేసుకున్నది. బాధితురాలు మాడెం రాంబాయి తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాయి దేవరకొండ బుడిగ జంగాల కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆమెతో పాటు ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక విద్యావలంటీర్ పని చేస్తున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో ఆమె సెలవులు పెడితే ప్రధానోపాధ్యాయుడు ముత్యాలు హాజరు పట్టికలో రెడ్ మార్క్ పెడుతున్నారు. సెలవు చీటి ఇవ్వలేదని ఇబ్బందులకు గురిచేయడంతోపాటు ఇతర ఉపాధ్యాయుల ముందు అవమానకరంగా మాట్లాడుతున్నారు. అనారోగ్యంతో ఈ నెల 10నుంచి 14 వరకు సెలవులు పెడితే రిజిస్టర్‌లో రెడ్‌మార్క్ పెట్టారు. ఆయన తర్వాత తాను సీనియర్ టీచర్ అయినప్పటికీ జూనియర్లకు ఛార్జి ఇస్తున్నారని రాంబాయి ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గత్యంతరంలేక ఆత్మహత్యకు ప్రయత్నించానని తెలిపింది. కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునే క్రమంలో అక్కడే ఉన్న అటెండర్ లక్ష్మణ్ అడ్డుకొని దేవరకొండ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

## ఎస్సారెస్పీకి ఇకపై రోజుకు ఒక టీఎంసీ



కోక్యనాయక్ తండా వద్ద మంచిప్ప రిజర్వాయర్ పనుల వివరాలను మ్యాప్ ద్వారా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు వివరిస్తున్న ఇంజినీరింగ్ అధికారి

- ఉమ్మడి నిజామాబాద్‌లో నాలుగు లక్షల ఎకరాలకు నీరు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్‌తో కలిసి పనుల పరిశీలన

**నిజామాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి:** ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పూర్తయినందున 200 కి.మీ. దూరం నుంచి కాళేశ్వరం నీటిని వరద కాల్వ ద్వారా శ్రీరాంసాగర్‌లో నింపుకోవడానికి అవకాశం కలిగిందని గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నీరు వరద కాల్వ ద్వారా వచ్చి ఎస్సారెస్పీ గేట్లను ముద్దాడాయని, ఇకపై రోజుకు టీఎంసీ చొప్పున ఎస్సారెస్పీలో 60 టీఎంసీల నుంచి 65 టీఎంసీల వరకు నింపే వీలున్నదన్నారు. సోమవారం ఆయన సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్‌తో కలిసి నిజామాబాద్ జిల్లాలోని సారంగపూర్, మంచిప్ప, మెంట్రాజ్‌పల్లి, సుద్దపల్లి ప్రాంతాల్లో పర్యటించి పైప్‌లైన్, పంప్‌హౌస్, గ్రావిటీ కెనాల్ తదితర పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు 20, 21, 22వ ప్యాకేజీల ద్వారా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరందించడానికి పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. వీరి వెంట రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఉన్నారు.



సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో సీడబ్ల్యూసీ, ఎస్సారెస్పీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

## గోదావరి జలాలతో సస్యశ్యామలం

- గత పాలకుల పాపాలే ఎస్సారెస్పీ కాల్వల్లో లోపాలు
- సీడబ్ల్యూసీ ఇంజినీర్ల సమీక్షలో మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ సంకల్ప బలంతో గోదావరి జలాలు సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేస్తున్నాయని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గత పాలకుల పాపాల వల్లే ఎస్సారెస్పీ కాల్వల్లో లోపాలున్నాయని, వాటిని సరిదిద్దాల్సిన బాధ్యతను ఇంజినీర్లు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఎస్సారెస్పీ రెండో దశ కాల్వ నిర్మాణ పనులను పరిశీలించేందుకు కేంద్ర జలసంఘం, శ్రీరాంసాగర్ ఇంజినీర్ల బృందం జిల్లాకు వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి ఎస్సారెస్పీ కాల్వలపై సమీక్షించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులకు కమీషన్ల బేరం తప్ప కాల్వలపై పర్యవేక్షణ లేకపోవడంతో అనేక లోపాలు ఏర్పడ్డాయని, నీటిని విడుదల చేస్తున్నా కొన్ని ప్రాంతాల్లోని రైతులకు అందడం లేదని మంత్రి అన్నారు. అలాంటి లోపాలను వెంటనే సరిచేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. చివరి ఎకరాకూ గోదావరి నీటిని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. సమీక్షలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాయాదవ్, సీడబ్ల్యూసీ డైరెక్టర్ రఘురాం, డిప్యూటీ డైరెక్టర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

# తరలుతున్న గోదారి



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్‌లో పంపుల నుంచి ఉప్పొంగుతున్న కాళేశ్వర జలాలు

- లక్ష్మి, నంది, గాయత్రిలో పంపుల ద్వారా ఎత్తిపోతలు
- ఎస్సారార్‌లో 23.133 టీఎంసీల నిల్వ

**రామడుగు:** కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ శివారులోని గాయత్రి పంపుహౌస్‌లో మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆదివారం వరకు 1, 3వ పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేయగా, సోమవారం 3వ నంబర్ పంపునకు విరామం ఇచ్చి, 6, 7వ పంపులను ప్రారంభించారు. ధర్మారం మండలం నందిమేడారం నంది పంప్‌హౌస్‌లో 4, 5, 6వ మోటర్లు నీటిని ఎత్తిపోస్తుండగా, అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా నీటిని వదలగా నేరుగా గాయత్రి పంపుహౌస్ సర్జిపూల్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ మూడు మోటర్లు ఎత్తిపోస్తుండటంతో శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు కాళేశ్వర జలాలు పరుగులు తీస్తున్నాయి. ఒక్కో పంపు 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తంగా 9,450 క్యూసెక్కుల నీరు జలాశయం వైపు ప్రవహిస్తున్నది. కాగా, 5వ తేదీ నుంచి సోమవారం సాయంత్రం వరకు గాయత్రి పంపుహౌస్ ద్వారా 6.32 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎస్సారార్‌లో 23.133 టీఎంసీల నిల్వ ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

**లక్ష్మి పంప్‌హౌస్‌లోనూ మూడు మోటర్లు..**

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో సోమవారం 5, 7, 11వ మోటర్ల ద్వారా సరస్వతి బరాజ్‌కు 7,780 క్యూసెక్కుల నీటిని తరలించారు. గోదావరి జలాలు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలుతున్నాయి. సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## ప్రేమించాలని విద్యార్థినిపై కత్తితో దాడి

**కొత్తగూడెం క్రైం:** ప్రేమించాలంటూ రౌడీషీటర్ బాలికపై కత్తితో దాడి చేసిన ఘటన కొత్తగూడెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక(16) స్థానికంగా ఉన్న ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నది. నెహ్రూబస్తీకి చెందిన ఇంగోటి లక్ష్మణ్ అనే రౌడీషీటర్ తనను ప్రేమించాలని కొంత కాలంగా ఆమెను వేధిస్తున్నాడు. ఈనెల 13న సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వస్తున్న బాలికను అడ్డగించి, కత్తితో బెదిరించాడు. ఆమె కేకలు వేయడంతో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పగా, ఆదివారం వారు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

## వ్యక్తి దారుణ హత్య

### పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



ఖలీమ్ (ఫైల్)



కత్తితో భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు రాడే బలరామ్

**భీమ్‌గల్:** రియల్ ఎస్టేట్ లావాదేవీల కారణంగా ఓ వ్యక్తిని దారుణంగా హత మార్చిన ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బాబాపూర్ శివారులో సోమవారం ఉదయం జరిగింది. అనంతరం నిందితుడు భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఆర్మూర్ ఏసీపీ రఘు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్ పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు ఎంఏ ఖలీమ్(45)తో బాబాపూర్‌కు చెందిన రాడే బలరామ్(60)కు భీమ్‌గల్ పట్టణంలో ఉన్న మడిగెల విషయంలో 20 ఏండ్లుగా గొడవలు ఉన్నాయి. సోమవారం మడిగెల సమస్యను పరిష్కరించుకుందామని తన కోళ్లఫారానికి రావాల్సిందిగా ఖలీమ్‌కు బలరామ్ ఫోన్ చేసి పిలిపించుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో బలరామ్ కొబ్బరిబొండాలు నరికే కత్తితో ఖలీమ్‌పై కడుపులో, చేతి, మెడపై నరికి చంపాడు. హత్యకు ముందు ఖలీమ్ కంట్లో కారం చల్లినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. హత్య చేసిన బలరామ్ నేరుగా భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్టు ఏసీపీ తెలిపారు. కాగా, ఖలీమ్ హత్య విషయం తెలిసి ప్రజలు ఘటనాస్థలికి చేరుకొని, నిందితుడిని చంపేయాలని ఆందోళనకు దిగారు. బలరామ్‌కు చెందిన కారును ధ్వంసం చేసిన ఆందోళనకారులు అతని ఇంట్లో ఫర్నిచర్‌ను తగులబెట్టారు. ఖలీమ్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## తాళ్లపేట రేంజ్‌లో పులి సంచారం..?



ఆవును చంపి తింటున్న పులి (ఫైల్)

**దండేపల్లి :** కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్ పరిధిలో గల అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు సమాచారం. జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్‌ల్లో తిరిగిన పులి అటు వైపు నుంచి తాళ్లపేట రేంజ్ పరిధిలో వచ్చినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రెండు, మూడు రోజులు తాళ్లపేట రేంజ్ అడవుల్లో తిరిగిన పులి ఊట్ల మీదుగా దేవాపూర్ వైపుకు వెళ్లిందనీ, పులి పాదముద్రల కోసం అటవీ శాఖాధికారులు అటవీ ప్రాంతంలో పర్యటించినట్లు తెలిసింది. పులికి ఏమాత్రం ప్రమాదం జరుగకుండా అటవీ శాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పులి సంచరిస్తుందనే సమాచారాన్ని బయటకు తెలియకుండా అధికారులు జాగ్రత్తపడుతున్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖాధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 9న మొదటగా జన్నారం డివిజన్‌లోని ఓ బీట్‌లో పులి అరుపులు స్థానికులు విన్నట్లు సమాచారం. అక్కడి నుంచి తాళ్లపేట రేంజ్ మీదుగా ఊట్ల అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జన్నారం డివిజన్‌లోని అటవీ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఆడ పులి తోడు కోసం మగ పులి కవ్వాల్ అభయారణ్యంలో అడవిని జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది.

## ఆదిలాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారి దారుణ హత్య



అముల్ (ఫైల్)

**ఆదిలాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురైన ఘటన ఆదిలాబాద్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. బేల మండలానికి చెందిన అముల్ కొమ్ముూవార్ 15 ఏండ్లుగా ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో నివాసముంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో ఉన్న అముల్‌పై ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు దిలీప్ సింగ్, గోపాల్‌సింగ్ కత్తులతో దాడి చేశారు. రక్తం మడుగులో ఉన్న అబుల్‌ను స్థానికులు ఆటోలో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబీసీ గ్రౌండ్‌లో సోమవారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి కేక్ కట్‌చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 19వ తేదీన క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. - మహబూబ్‌నగర్ సాంస్కృతిక విభాగం

# కుర్రాళ్లు కొల్లగొడతారా



## రాష్ట్ర హ్యాండ్‌బాల్ విజేత వరంగల్

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ టోర్నీలో వరంగల్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన బాలికల విభాగం ఫైనల్లో వరంగల్ 9-8 తేడాతో హైదరాబాద్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. బాలుర తుదిపోరులో వరంగల్ 29-20తో హైదరాబాద్‌పై గెలిచి టైటిల్‌ను దక్కించుకుంది. బాలికల కేటగిరీలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి 13-11తో పాలమూరుపై గెలిచింది. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ 14-12తో రంగారెడ్డిపై గెలిచి మూడో స్థానం దక్కించుకుంది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని అందరూ స్ఫూర్తిచాటాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ, జయరామ గ్రూప్స్ అధినేత బెక్కరి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్ , రాజేందర్ రెడ్డి, శాంత హ్యాండ్‌బాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోహ్లీ.. క్రికెట్ రొనాల్డో



సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలుసుకుని బ్యాటును బహుకరిస్తున్న వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా

**విశాఖపట్నం:** టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ క్రికెట్‌లో.. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అని వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా కితాబిచ్చాడు. ప్రతిభకు పదును పెడుతూ.. కఠోర సాధన, అంకితభావంతో సూపర్ స్టార్‌గా ఎదిగాడని ప్రశంసించాడు. విరాట్ బ్యాటింగ్ నమ్మశక్యం కాని స్థాయికి చేరిందని లారా పేర్కొన్నాడు. 'రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్ కన్నా విరాట్ కోహ్లీ మరింత ప్రతిభావంతుడేమీ కాదు. కానీ సన్నద్ధత విషయంలో పక్కాగా ఉండే కోహ్లీ.. అంకితభావం, కఠోర శ్రమ కారణంగానే ఉన్నత స్థాయికి చేరాడు. నా వరకైతే అతడు క్రికెట్ క్రిస్టియానో రొనాల్డో. అతడి శారీరక దృఢత్వం, మానసిక బలం నమ్మశక్యం కానివి' అని లారా అభిప్రాయపడ్డాడు. 1970ల నాటి క్లైవ్ లాయిడ్, 1948 నాటి సర్ డాన్ బ్రాడ్‌మన్ జట్టు.. ఇలా ఏ తరానికి చెందిన గొప్ప జట్టులోనైనా కోహ్లీకి స్థానం ఉంటుందని లారా అన్నాడు.



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్).. తన పన్నెండేండ్ల ప్రస్థానంలో ఎంతో మంది యువ క్రికెటర్ల తలరాతలు మార్చేసింది. అప్పటి వరకు కడుపు నింపుకోవడానికి మ్యాగీ తప్ప మరో దారి లేదనుకున్న ఆటగాడిని కోటీశ్వరుడిని చేస్తే.. ఎన్నో ఏండ్లు శ్రమించినా టీమ్‌ఇండియాలో చోటు దక్కని ఆటగాడిని ఒక్క సీజన్ మెరుపులతో జట్టులో ప్లేస్ కల్పించింది. దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు చేసినా.. బౌండ్రీల వరద పారించినా.. వికెట్ల జాతర చేసుకున్నా రాని గుర్తింపు ఐపీఎల్లో మంచి ఇన్నింగ్స్‌తో లభిస్తుందనేది ప్రతి ఒక్కరికీ అర్థమైపోయింది. ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో తళుక్కుమంటే చాలు ఓవర్‌నైట్ స్టార్ అయిపోవడంతో పాటు టీమ్‌ఇండియా సెలెక్టర్ల దృష్టిలో పడ్డట్లే.

ప్రస్తుతం భారత జట్టులో ప్రధాన ప్లేయర్లందరికో ఐపీఎల్ అమ్మలాంటిది. ఈ లీగ్‌లో రాణించి వెలుగులోకి వచ్చినవారిలో జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, కృనాల్ పాండ్యా, శార్దుల్ ఠాకూర్, దీపక్ చాహర్, రాహుల్ చాహర్, వాషింగ్టన్ సుందర్, మయాంక్ మార్కండే, నవ్‌దీప్ సైనీ ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది ఉన్నారు. ఇప్పటికే 12 వసంతాలు పూర్తి చేసుకున్న లీగ్.. పదమూడో సీజన్ కోసం మరో రెండు రోజుల్లో వేలం నిర్వహించనుంది. స్టార్ ఆటగాళ్లు ఎంత ధరకు అమ్ముడుపోతారనే విషయాలు పక్కన పెట్టి అన్‌క్యాప్డ్ ప్లేయర్ల కోటాలో ప్రధానంగా కనిపిస్తున్న యువ ఆటగాళ్లపై ఓ లుక్కేస్తే..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రతి ఏటా బెంగళూరు వేదికగా జరిగే ఐపీఎల్ వేలం ఈ సారి కోల్‌కతాలో నిర్వహించనున్నారు. గురువారం జరుగనున్న వేలం కోసం 713 మంది భారత ఆటగాళ్లు, 258 మంది విదేశీ ఆటగాళ్లు తమ పేర్లు నమోదు చేసుకోగా.. ఫ్రాంచైజీలు ఇప్పటికే 332 మందిని షార్ట్‌లిస్ట్ చేశాయి. 8 జట్లలో ప్రస్తుతానికి 73 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. అందులో 29 మంది విదేశీ ఆటగాళ్లకు చాన్స్ ఉంది. దేశవాళీల్లో సత్తాచాటుతున్న యువ ఆటగాళ్లను గుర్తించేందుకు ఈ ఏడాది ఐపీఎల్ వేలానికి ముందే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ నిర్వహించారు. ఈ సీజన్‌లో రాణించిన వారితో పాటు ఇటీవల నిలకడ కనబరుస్తున్న యువ ఆటగాళ్ల వైపు ఫ్రాంచైజీలు మొగ్గుచూపే అవకాశాలున్నాయి. కొత్త కుర్రాళ్ల కోసం జట్ల యాజమాన్యాలు కోట్లు కుమ్మరించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మరి అలాంటి ఆణిముత్యాల ఇటీవలి ప్రదర్శన ఓ సారి పరిశీలిస్తే..

### ● ప్రియం గార్గ్



ప్రాథమిక ధర: రూ. 20 లక్షలు

అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్న ప్రియం గార్గ్ కోసం ఫ్రాంచైజీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. కనీస ప్రాథమిక ధరతో ఇలాంటి ఆటగాడిని సొంతం చేసుకుంటే భవిష్యత్తు అవసరాలు తీరుతాయనే ఆలోచన ఎక్కువగా కనిపిస్తున్నది. నిలకడగా పరుగులు చేయడంతో పాటు విపత్కర పరిస్థితుల్లోనూ ఎదురు నిలువగల గార్గ్.. ఈ ఏడాది విజయ్ హజారే ట్రోఫీ 10 మ్యాచ్‌ల్లో 814 పరుగులు చేశాడు. 12 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 867 రన్స్‌తో సత్తాచాటాడు. దీంతో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఈ కుర్రాడిపై భారీ ధర పెట్టేందుకు జట్ల యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి.

### ● సాయి కిషోర్

ప్రాథమిక ధర: రూ. 20 లక్షలు



తమిళనాడుకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆర్.సాయి కిషోర్‌కు.. గతేడాదే ఐపీఎల్లోనే చోటు దక్కుతుందని భావించినా అతడి కల నెరవేరలేదు. అయితే ఈ ఏడాది మరింత నిలకడగా బౌలింగ్ చేసిన అతడు ముస్తాక్ అలీ టోర్నీలో 4.63 ఎకానమీతో 20 వికెట్లు పడగొట్టి శభాష్ అనిపించుకున్నాడు. ఈ ట్రోఫీలో తమిళనాడు జట్టు ఫైనల్‌కు చేరడంలో కిషోర్ కీలక పాత్ర పోషించాడు. అవసరమైతే బ్యాటింగ్‌లోనూ ఓ చేయి వేయగల కిషోర్.. పవర్ ప్లేలో బౌలింగ్‌తో బాగా పాపులర్ అయ్యాడు. ఈ సీజన్‌లో పవర్ ప్లేల్లో 44.5 ఓవర్లు బౌలింగ్ చేసిన సాయి.. 5 కంటే తక్కువ ఎకానమీతో పరుగులు ఇచ్చుకోవడం విశేషం. ప్రారంభ ధర రూ. 20 లక్షలు ఉన్న కిషోర్ కోసం.. చెన్నైతో పాటు పవర్ ప్లేల్లో బౌలింగ్ చేసే స్పిన్నర్ కోసం ఎదురుచూస్తున్న ఇతర ఫ్రాంచైజీలు ముందుకు రావొచ్చు.

### ● విరాట్ సింగ్

ప్రాథమిక ధర: రూ. 20 లక్షలు

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని ఆదర్శంగా తీసుకొని క్రికెట్ వైపు అడుగులు వేసిన జార్ఖండ్ యంగ్ స్టార్ విరాట్ సింగ్.. ఇటీవల దేశవాళీల్లో మోత మోగిస్తున్నాడు. ఈ ఏడాది ముస్తాక్ అలీ టోర్నీలో 57.17 సగటుతో 343 పరుగులు చేసిన విరాట్.. విజయ్ హజారే ట్రోఫీలో 100కు పైగా స్ట్రయిక్ రేట్‌తో 335 రన్స్ చేశాడు. జార్ఖండ్ తరపున అత్యధిక పరుగులు చేసిన విరాట్.. దేవధర్ ట్రోఫీలో మెరుపులు మెరిపించడం ద్వారా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు.

### ● రోహన్ కదం

ప్రాథమిక ధర: రూ. 20 లక్షలు

కర్ణాటక జట్టు వరుసగా రెండోసారి ముస్తాక్ అలీ ట్రోఫీ చేజిక్కించుకుందంటే అందుకు ప్రధాన కారణం రోహన్ కదం. పాతికేండ్ల ఈ ఎడమ చేతివాటం బ్యాట్స్‌మన్ ఈ సీజన్‌లో 536 పరుగులు చేసి టాప్‌లో నిలిచాడు. 129.78 సగటుతో పరుగులు రాబట్టిన రోహన్.. యాంకర్ రోల్ పోషించడంలో సిద్ధహస్తుడు. రాహుల్, మయాంక్, కరుణ్ నాయర్, మనీశ్, పడిక్కల్ వంటి ఆటగాళ్లు ఉన్న కర్ణాటక జట్టులో టాపార్డర్‌లో బ్యాటింగ్ చాన్స్ దక్కించుకున్న రోహన్ నిలకడకు మారుపేరని చెప్పొచ్చు.

### ● యశస్వీ జైస్వాల్

ప్రాథమిక ధర: రూ. 20 లక్షలు

ఏడాది కాలంగా దేశవాళీల్లో విపరీతంగా చర్చకు వచ్చిన పేరేదైనా ఉందంటే అది కచ్చితంగా యశస్వీ జైస్వాల్‌దే. తొలినాళ్లలో తినడానికి తిండిలేక.. ఉండటానికి నీడలేక నానా కష్టాలు పడ్డ ఈ 17 ఏండ్ల యువ కెరటం విజయ్ హజారే ట్రోఫీలో పరుగుల వరద పారించాడు. టోర్నీ ఏదైనా పరుగుల కోసం ఆకలిగొన్న సింహంలా విరుచుకుపడుతుండటంతో.. అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టులో అతడికి చోటు దక్కింది. అతి పిన్న వయసులో లిస్ట్ 'ఏ' క్రికెట్‌లో డబుల్ సెంచరీ బాదిన యశస్వి.. ఈ సీజన్‌లో 112.80 సగటుతో 564 పరుగులు చేశాడు. అందులో మూడు శతకాలున్నాయి. జీవితంలో అనేక ఆటంకాలు అధిగమిస్తూ ఇక్కడి వరకు వచ్చిన జైస్వాల్ కోసం ఫ్రాంచైజీలు పోటీ పడటం ఖాయమే. ప్రస్తుతానికి అతడి ప్రాథమిక ధర రూ. 20 లక్షలుగా ఉన్నా.. ఇంతకు ఎన్నో రెట్లు ఎక్కువ దక్కే అవకాశాలు ఉన్నాయి. యంగ్‌టాలెంట్‌ను ప్రోత్సహించడంలో ముందుండే ముంబై ఇండియన్స్ యాజమాన్యం జైస్వాల్ కోసం పోటీ పడే చాన్స్ ఉంది.

### తిలకం దిద్దుతారా..!



తిలక్

వీళ్లతో పాటు హైదరాబాదీ యువ ఆటగాడు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మపై కూడా ఫ్రాంచైజీలు కన్నేసే చాన్స్ ఉంది. రూ. 20 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి రానున్న తిలక్ వర్మపై సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు మరికొన్ని ఫ్రాంచైజీలు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. నగరానికి చెందిన 17 ఏండ్ల తిలక్ వర్మ దేశవాళీల్లో నిలకడైన ప్రదర్శనతో అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. టాపార్డర్‌లో స్థానిక ఆటగాళ్లు లేక ఇబ్బందులు పడుతున్న సన్‌రైజర్స్.. తిలక్‌ను ఎంపిక చేసుకుంటే భవిష్యత్తులో పనికొస్తాడని భావిస్తున్నది. వీరితో పాటు తెలుగు ఆటగాళ్లు భావనక సందీప్, సీవీ మిలింద్, రికీ భుయ్, పృథ్వీరాజ్ ఎర్రా కూడా రూ. 20 లక్షల ప్రాథమిక ధరతో వేలానికి అందుబాటులో ఉండనున్నారు.

## సచిన్‌ను కలువడం కోసం ఆతృతగా..

**చెన్నై:** ఆరాధ్య క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను కలుసుకునేందుకు తాను ఆతృతగా ఎదురుచూస్తున్నానని గురుప్రసాద్ అన్నాడు. సరిగ్గా 19 ఏండ్ల క్రితం చెన్నైలో మ్యాచ్ ఆడేందుకు వచ్చిన సచిన్..అక్కడి హోటల్ భద్రతా విధులు నిర్వర్తిస్తున్న గురుప్రసాద్‌ను కలుసుకున్నాడు. ఎల్బో గార్డ్‌ను మార్చితే ఇంకా బాగా షాట్లు కొట్టగలుగుతారంటూ గురుప్రసాద్ ఇచ్చిన సలహాను పాటించిన సచిన్ ఆటలో అనూహ్య మార్పును చూశాడు. ఇంతటి మార్పునకు కారణమైన అభిమాని కోసం ఇన్నాళ్లు నిరీక్షించిన మాస్టర్‌కు ప్రతిఫలం దక్కింది. అయితే తన ఆట తీరును మార్చేసిన అభిమానిని త్వరలోనే కలుసుకుంటానని సచిన్ ప్రకటించిన నేపథ్యంలో గురుప్రసాద్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'ఎంతో అభిమానులు అతన్ని కలిసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. కానీ అలాంటి మాస్టర్ నన్ను కలువబోతుండటం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను' అని అన్నాడు.

## కోహ్లీలా కావాలని ఉంది



బాబర్

**కరాచీ:** టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీలా ఆటలో ఉన్నత శిఖరాలకు చేరాలని ఉందని పాకిస్థాన్ యువ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ తన మనసులో మాట బయటపెట్టాడు. తనని తాను విరాట్ అభిమానినని చెప్పుకునే 24 ఏండ్ల ఆజమ్ మాట్లాడుతూ.. 'క్రికెట్‌లో కోహ్లీ ఇప్పటికే ఎంతో సాధించాడు. భారత్‌లో అతడో దిగ్గజం. నిజయితీగా చెప్పాలంటే ప్రస్తుత స్థితిలో అతడితో నాకు పోలికలేకున్నా.. ఏదో ఒక రోజు కోహ్లీలా అగ్రస్థానానికి చేరాలనుకుంటున్నా. టెస్టు, వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలువాలి. మీడియా, ప్రజలు నన్ను కోహ్లీతో పోల్చుతున్నారు. కానీ, సంప్రదాయ క్రికెట్‌లో టాప్ ప్లేయర్‌తో పోల్చుకుంటే నేను చాలా వెనుకబడి ఉన్నా' అని అన్నాడు.

## షెడ్యూల్ ప్రకారమే ఐపీఎల్ వేలం

**న్యూఢిల్లీ:** ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే కోల్‌కతా వేదికగా ఐపీఎల్ వేలంపాట జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో ఈశాన్య రాష్ట్రాలతో సహా పశ్చిమబెంగాల్, ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. సీఏఏను రద్దు చేయాలని కోరుతూ వందలాది మంది విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కతాలో నెలకొన్న పరిస్థితులపై బీసీసీఐ అధికారి మీడియాతో మాట్లాడాడు. 'షెడ్యూల్ అనుసరించి గురువారం వేలంపాట జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా.. కోల్‌కతాలో అంతగా ప్రభావం కనిపించడం లేదు. ఢిల్లీ యాజమాన్యం మంగళవారమే ఇక్కడకు చేరుకోనుంది. మిగతా ఫ్రాంచైజీలు బుధవారం ఉదయం వరకు చేరుకోవచ్చు' అని అన్నాడు.

## విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి పోటీలు షురూ

**మయూరిసెంటర్:** విద్యుత్ శాఖ రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీలో సోమవారం పోటీల తొలి రోజు జరిగిన బాల్ బ్యాడ్మింటన్‌లో నిజామాబాద్ 35-22, 35-28తో ఖమ్మం ఆపరేషన్ మెయింటెన్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఓఎంసీ)పై విజయం సాధించింది. ఆ తర్వాత జరిగిన మ్యా చ్‌లో కరీంనగర్ 35-25, 25-28తో ఖమ్మం ఓఎంసీపై గెలువగా, నల్లగొండ 35-25, 35-21తో నిజామాబాద్‌ను చిత్తు చేసింది. మరో పోరులో వరంగల్ 35-28, 35-30తో మహబూబ్‌నగర్‌పై గెలిచి ముందంజ వేసింది. కబడ్డీ విభాగంలో ఖమ్మం ఓఎంసీ మహబూబ్‌నగర్, కరీంనగర్‌పై విజయాలు సాధించింది. వేర్వేరు మ్యాచ్‌ల్లో వరంగల్‌పై నల్లగొండ, నిజామాబాద్‌పై వరంగల్ గెలిచాయి. పోటీలను జిల్లా యువజన, క్రీడాధికారి పరంధామరెడ్డి, టూటౌన్ సీఐ తుమ్మ గోపి ప్రారంభించారు.

## విండీస్ ప్లేయర్లకు జరిమానా

### మ్యాచ్ ఫీజులో 80 శాతం కోత

**చెన్నై:** టీమ్‌ఇండియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వన్డే నెగ్గిన వెస్టిండీస్ జట్టుకు ఐసీసీ షాక్ ఇచ్చింది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనందుకు గానూ విండీస్ జట్టులోని ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో 80 శాతం కోత విధించింది. ఆదివారం చెపాక్ స్టేడియంలో జరిగిన పోరులో టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్న పొలార్డ్ సేన నిర్దేశిత సమయంలో 46 ఓవర్లే వేసింది. నిబంధనల ప్రకారం ఓవర్‌కు 20 శాతం చొప్పున 4 ఓవర్లకు 80 శాతం మ్యాచ్ ఫీజును రిఫరీ డేవిడ్ బూన్ కోత విధించారు. 'ఐసీసీ ప్రవర్తనా నియామవళి ఆర్టికల్ 2.22 ప్రకారం కోత విధించాం. ఓవర్‌కు 20 శాతం చొప్పున 4 ఓవర్లకు విండీస్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 80 శాతం కోత వేశాం' అని ఐసీసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

**టీమ్ గేమ్ ఆడాల్సిందే: పంత్**

అంతర్జాతీయ స్థాయిలో సహజసిద్ధమైన ఆటతీరు కాకుండా జట్టు అవసరాల రిత్యా ఆడాల్సి ఉంటుందని భారత యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ పేర్కొన్నాడు. ధోనీ వారసుడిగా జట్టులోకి వచ్చి స్థాయికి తగ్గట్లు రాణించలేక విమర్శల పాలవుతున్న పంత్ వెస్టిండీస్‌తో తొలి వన్డేలో అర్ధశతకం బాదిన విషయం తెలిసిందే. 'అంతర్జాతీయ క్రికెట్‌లో జట్టు అవసరాలను బట్టి బ్యాటింగ్ చేయాలనే విషయాన్ని గుర్తించా. ఆటగాడిగా మెరుగయ్యేందుకు కృషిచేస్తున్నా. జట్టు విజయం కోసం ఏం చేయాలనే దానిపై దృష్టి సారించా' అని పంత్ అన్నాడు

## విశాఖకు భారత్, విండీస్



రెండో వన్డే కోసం సోమవారం విశాఖపట్నం చేరుకున్న టీమ్‌ఇండియా, వెస్టిండీస్ క్రికెటర్లు కోహ్లీ, రాహుల్, హెట్‌మైర్, మనీశ్ పాండే

**విశాఖపట్నం:** మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం రెండో వన్డే ఆడేందుకు టీమ్‌ఇండియా, వెస్టిండీస్ జట్లు విశాఖ నగరానికి చేరుకున్నాయి. సోమవారం విమానాశ్రయం నుంచి నేరుగా హోటల్‌కు పయనమైన ఇరు జట్లు ప్రాక్టీస్‌కు రాలేదు. మంగళవారం స్థానిక ఏసీఏ వీడీసీఏ మైదానంలో భారత్, విండీస్ సాధన చేయనున్నాయి. టాపార్డర్ వైఫల్యంతో పాటు బౌలర్లు రాణించలేకపోవడంతో చెన్నై వన్డేలో ఓటమి పాలైన విరాట్ సేన.. సాగర తీరంలో జరిగే మ్యాచ్‌లో సత్తాచాటి సిరీస్ సమం చేయాలని చూస్తుంటే.. తొలి మ్యాచ్ విజయం ఇచ్చిన ఊపులోనే సిరీస్ చేజిక్కించుకోవాలని కరీబియన్లు భావిస్తున్నారు. ఈ మైదానంలో చివరగా జరిగిన వన్డే కూడా భారత్, వెస్టిండీస్‌ల మధ్యనే కావడం గమనార్హం. ఈ వికెట్‌పై భారత కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు విండీస్ యువ బ్యాట్స్‌మన్ హోప్, హెట్‌మైర్‌లకు మంచి రికార్డు ఉంది. గతేడాది అక్టోబర్‌లో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన రెండో మ్యాచ్ 'టై' అయింది. కోహ్లీ (157 నాటౌట్) అజేయ శతకంతో విజృంభించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 6 వికెట్లకు 321 పరుగులు చేస్తే.. లక్ష్య ఛేదనలో విండీస్ 7 వికెట్లు కోల్పోయి సరిగ్గా 321 పరుగులే చేసింది. హోప్ (126 నాటౌట్), హెట్‌మైర్ (94) రాణించారు. మరి అచ్చొచ్చిన మైదానంలో ఈ సారి ఎవరు మెరుపులు మెరిపిస్తారో చూడాలి.

## టాప్‌లోనే కోహ్లీ

**దుబాయ్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ (928 పాయింట్లు) ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (911) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన స్మిత్.. కోహ్లీ కంటే 17 పాయింట్లు వెనుకబడి ఉన్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో కోహ్లీతో పాటు భారత్ నుంచి చతేశ్వర్ పుజారా, అజింక్యా రహానే వరుసగా నాలుగో, ఆరో ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు. ఆసీస్ హ్యాట్రిక్ సెంచరీల హీరో లబుషేన్ ఐదో ర్యాంక్‌కు చేరగా.. పాకిస్థాన్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ (9వ ర్యాంక్) టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. బౌలింగ్ విభాగంలో భారత ఏస్ పేసర్ జస్ప్రీ త్ బుమ్రా (794 పాయింట్లు) ఆరో ర్యాంక్‌కు పడిపోయాడు. కంగారూ పేసర్ ప్యాట్ కమిన్స్ (898 పాయింట్లు) అగ్రస్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో జాసన్ హోల్డర్, రవీంద్ర జడేజా, బెన్ స్టోక్స్ తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారు. ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ (360 పాయింట్లు) టాప్‌లో ఉంటే.. ఆస్ట్రేలియా (216 పాయింట్లు), శ్రీలంక (80 పాయింట్లు) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి.

## స్టోక్స్‌కు బీబీసీ స్పోర్ట్స్ అవార్డు



**లండన్:** వన్డే ప్రపంచకప్ హీరో, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు అరుదైన గౌరవం దక్కింది. 'బీబీసీ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు స్టోక్స్ ఎంపికయ్యాడు. ప్రపంచకప్ ఫైనల్లో అద్వితీయ పోరాటంతో జట్టుకు తొలి సారి విశ్వకిరీటాన్ని కట్టబెట్టిన స్టోక్స్.. ఆ తర్వాత ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లోనూ విజృంభించాడు. మూడో టెస్టులో ఓటమి అంచున నిలిచిన ఇంగ్లిష్ జట్టును ఒంటిచేత్తో విజయతీరాలకు చేర్చాడు. దీంతో ప్రజాతీర్పు ప్రకారం అతడిని ఈ అవార్డు వరించింది. ఆరుసార్లు ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ అవార్డు అందుకున్న ఐదో క్రికెటర్‌గా 28 ఏండ్ల స్టోక్స్ నిలిచాడు. గతంలో జిమ్ లేకర్ (1956), డేవిడ్ స్టీలే (1975), ఇయాన్ బోథమ్ (1981), ఫ్లింటాఫ్ (2005)కు ఈ అవార్డు దక్కింది. 'రెండేండ్ల క్రితం గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా. ఆ సమయంలో నాకు అండగా నిలిచిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు' అని స్టోక్స్ పేర్కొన్నాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,939 | 12,054 |
| ↘71 | ↘33 |

ముడి చమురు (బ్రెంట్) ↗65.55 డాలర్లు

## సబ్‌కా విశ్వాస్ స్కీం పొడిగింపునకు నో

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** సబ్‌కా విశ్వాస్ స్కీం చివరి తేదిని పొడిగించేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది. సేవా పన్ను, సెంట్రల్ ఎక్సైజ్‌కు సంబంధించి వివాదాలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ ప్రత్యేక స్కీం ఈ నెల 31తో ముగియనున్నది. ఈ ఏడాది మొదట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సబ్‌కా విశ్వాస్ స్కీంను ప్రారంభించారు. పన్ను బకాయిలకు సంబంధించి ఒకేసారి పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిపేందుకు వీలుగా కేంద్రం ఈ అవకాశాన్ని కల్పించింది. ఈ స్కీం కింద ఈ నెల చివరిలోగా పన్ను చెల్లింపుదారులు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ స్కీం కింద ఇప్పటి వరకు 55,693 దరఖాస్తులు రాగా, వీటి ద్వారా రూ.29,557.30 కోట్ల పన్ను వసూలైంది. రూ.3.6 లక్షల కోట్ల పన్ను వసూళ్లకు సంబంధించి పలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 1.83 లక్షల కేసులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఈ స్కీంను ప్రవేశపెట్టింది. ఈ స్కీం కింద 40 శాతం నుంచి 70 శాతం వరకు పన్ను బకాయిల్లో రాయితీలు ఇస్తుండటం విశేషం. రూ.50 లక్షల లోపు పన్ను చెల్లించేవారికి 70 శాతం, ఆపై 50 శాతం డిస్కౌంటని కేంద్ర వర్గాలు వెల్లడించాయి.



## 2020లో టర్బో విమాన సేవలు

### కంపెనీలో 945 కోట్లు పెట్టుబడి పెట్టిన బ్రిటన్ సంస్థ

**హైదరాబాద్, డిసెంబర్ 16:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టర్బో ఏవియేషన్ విమానాలు వచ్చే ఏడాది అందుబాటులోకి రాబోతున్నాయి. ఇప్పటి వరకు నిధులు లేక సర్వీసులు ఆరంభించలేకపోయిన సంస్థలో బ్రిటన్‌కు చెందిన బిజినెస్ గ్రూపు 100 మిలియన్ పౌండ్ల మేర పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది. దేశీయ కరెన్సీలో ఇది రూ.945 కోట్లకు పైమాటే. వచ్చే ఏడాది ట్రూస్టార్ పేరుతో విమాన సేవలు అందించడానికి సిద్ధమవుతున్న సంస్థకు ఈ పెట్టుబడులు చాలా కీలకం. గతంలో ట్రూజెట్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన వీ ఉమేశ్..ఉడాన్ స్కీం కింద నూతన రూట్లకు విమాన సేవలు అందించడానికి ఈ టర్బోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమేశ్ మాట్లాడుతూ..యూకే గ్రూపుతో కుదుర్చుకున్న ఈ ఒప్పందంతో ట్రూస్టార్ సేవలు అందించడానికి మరింత సులభతరమవనున్నదన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) తయారు చేసిన విమానాలను మాత్రమే సంస్థ వినియోగించనున్నదని ఆయన ప్రకటించారు. తొలి విడుత 10 ఏటీఆర్‌ఎస్, 10 ఎయిర్‌బస్ 320, 4 డార్నియార్‌లతో విమాన సేవలు అందించనున్నది. విమాన సేవలు అందుబాటులోలేని రూట్లకు సర్వీసులు అందించాలనే ఉద్దేశంతో కేంద్రం గతంలో ఈ ఉడాన్ స్కీంను తెరపైకి తీసుకొచ్చింది. ఈ ఉడాన్ స్కీం కింద విమాన టిక్కెట్టు ధరను రూ.2,250గా నిర్ణయించింది. ఇప్పటికే సంస్థ ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్‌లతోపాటు ఇతర రూట్లకు తొలి విడుత విమాన సేవలు అందించనున్నది.







# రూ.35,298 కోట్లు

### రాష్ట్రాలకు జీఎస్టీ నష్టపరిహారం చెల్లించిన కేంద్రం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** జీఎస్టీ నష్టపరిహారం ఆలస్యంపై రాష్ట్రాల ఆందోళన ఫలించింది. సోమవారం కేంద్ర ప్రభుత్వం రూ.35,298 కోట్లను విడుదల చేసింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి జీఎస్టీ నష్టపరిహారం అందడం లేదని, ఆ చెల్లింపులు వెంటనే జరుపాలంటూ దేశవ్యాప్తంగా బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఇతర ప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ పలుమార్లు వీరంతా చర్చించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే మోదీ సర్కారు రాష్ట్రాలకు ఈ బకాయిలను విడుదల చేసింది. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ నినాదంతో జూలై 1, 2017న కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను అమల్లోకి తెచ్చినది తెలిసిందే. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో ఉన్న డజనుకుపైగా పన్నులను ఏకం చేసి పరిచయం చేసిన జీఎస్టీ పరిధిలో 500లకుపైగా సేవలు, 1,300లకుపైగా వస్తువులున్నాయి. 0, 5, 12, 18, 28 శాతాల్లో ఆయా వస్తు, సేవలపై పన్నులను విధించారు. బంగారంపై ప్రత్యేకంగా 3 శాతం పన్ను వేయగా, విలువైన ముడి రత్నాలు, రాళ్లపై కనిష్ఠంగా 0.25 శాతం పన్ను నిర్ణయించారు. ఇక పెట్రో ఉత్పత్తులను జీఎస్టీలో చేర్చని కేంద్రం.. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితరాలకు ఈ పన్ను నుంచి మినహాయింపునిచ్చింది. అయితే జీఎస్టీ అమల్లోకి తెస్తున్నప్పుడు రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లినా పరిహారం ఇస్తామన్న కేంద్రం.. తొలి ఐదేండ్లు ఈ సాయం చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రాల్లోని వివిధ పన్నులను జీఎస్టీలో కలిపేయడమే ఇందుకు కారణం. రెండు నెలలకోసారి ఈ నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ క్రమంలో రెండున్నరేండ్లకే మొండి చెయ్యి చూపిస్తున్నది. ఆర్థిక మందగమనం, జీఎస్టీ వసూళ్లలో క్షీణత మధ్య ఆగస్టు-సెప్టెంబర్ బకాయిలకుతోడు అక్టోబర్-నవంబర్ బకాయిలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో ఇప్పుడు రూ.35,298 కోట్లను విడుదల చేసింది.

#### జీఎస్టీ ఆదాయం పెంపునకు..

జీఎస్టీ సుస్థిరతకు, పన్ను ఆదాయం పెంపునకు అవసరమైన మార్గాల అన్వేషణ కోసం 15వ ఆర్థిక సంఘం ఆర్థిక సలహాదారు మండలి సోమవారం ఇక్కడ చర్చలు జరిపింది. అనంతరం ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్‌కే సింగ్ విలేకరులతో మాట్లాడుతూ 18న జరిగే జీఎస్టీ మండలి సమావేశం పరిశీలనకు సిఫారసులను పంపబోతున్నట్లు చెప్పారు. కాగా, 2020-21కిగాను ఒక నివేదికను, 2021-22 నుంచి 2025-26 వరకు మరో నివేదికను సంఘం తయారు చేస్తున్నది. ద్రవ్యోల్బణం, జీడీపీ అంశాలనూ సంఘం పరిశీలిస్తున్నది. ద్రవ్యోల్బణం కట్టడి, వృద్ధిరేటు పురోగతికి ఆచరించాల్సిన చర్యలను కేంద్ర ప్రభుత్వానికి సూచించనున్నది.

### మాట తప్పం: నిర్మలా సీతారామన్

జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్రాలకు ఇచ్చిన హామీలకు కేంద్రం కట్టుబడి ఉంటుందని నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వం మాట తప్పబోదన్నారు. జీఎస్టీ ఆదాయం ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడం ఆలస్యమైందని చెప్పారు. సోమవారం ముంబైలో జరిగిన టైమ్స్ నెట్‌వర్క్స్ ఇండియా ఎకనామిక్ సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీఎస్టీ నష్టపరిహారం రాష్ట్రాల హక్కు అన్నారు. దాన్ని తాము ఏవిధంగానూ అడ్డుకోబోమని చెప్పారు. ఉద్దేశపూర్వకంగా చెల్లింపులు ఆగలేదన్న ఆమె.. ఇందులో ప్రభుత్వ వైఫల్యంగానీ, నా తప్పుగానీ లేదన్నారు. ఇదిలావుంటే బుధవారం జీఎస్టీ మండలి సమావేశం జరుగనున్నది. తగ్గిన జీఎస్టీ వసూళ్లు, రాష్ట్రాలకు నష్టపరిహారంపైనే ప్రధానంగా చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరోక్ష పన్ను ఆదాయం క్షీణించిన నేపథ్యంలో జీఎస్టీ పరిధిలోకి రాని వస్తు, సేవలతోపాటు మినహాయింపున్న వాటిపైనా పన్ను వేయాలని కేంద్రం భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, డేటా విశ్వసనీయతను పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా తెలిపారు.

## టోకు ద్రవ్యోల్బణానికి ఉల్లి సెగ

### నవంబర్‌లో 0.58 శాతానికి ధరల సూచీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** ఉల్లి సెగతో సామాన్యుడు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత నెలలో ఏకంగా ఉల్లిగడ్డ ధర 172 శాతం ఎగబాకడంతో ఇప్పటికే రిటైల్ ద్రవ్యోల్బణం మూడున్నరేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకోగా.. తాజాగా టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం కూడా మరింత పుంజుకున్నది. నవంబర్ నెలలో 0.58 శాతంగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. అక్టోబర్‌లో నమోదైన 0.16 శాతంతో పోలిస్తే భారీగా పెరుగగా, క్రితం ఏడాది ఇదే నెలలో 4.47 శాతంతో పోలిస్తే మాత్రం భారీగా తగ్గింది. అయినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ధరల సూచీ 2 శాతం లోపలనే ఉండటం విశేషం. ఆహార పదార్థాలకు సంబంధించి ధరల సూచీ 11.08 శాతానికి పెరుగగా, అక్టోబర్ నెలలో ఇది 9.80 శాతంగా ఉన్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కిలో ఉల్లిగడ్డ ధర రూ.150 నుంచి రూ.200 స్థాయిలో ఉన్నది. వీటితోపాటు కూరగాయలు, పప్పు దినుసుల కూడా 45.32 శాతం వరకు ప్రియమవగా, ఆహారేతర ఉత్పత్తుల ధరల సూచీ 1.98 శాతానికి పరిమితమైంది. అలాగే తయారీ రంగ ఉత్పత్తులు ప్రతికూలంలోనే కొనసాగుతుండగా, అలాగే చమురు, ఇంధనంలు కూడా -7.32 శాతంగా నమోదయ్యాయి.




## పీఎంసీ కేసులో ఈడీ చార్జిషీటు

**ముంబై, డిసెంబర్ 16:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణం కేసులో హౌజింగ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (హెచ్‌డీఐఎల్) ప్రమోటర్లు రాకేశ్ వాధవాన్, సారంగ్ వాధవాన్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం చార్జిషీటును దాఖలు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 7 వేల పేజీలతో కూడిన చార్జిషీట్‌ను సమర్పించింది. పీఎంఎల్‌ఏలోని వివిధ సెక్షన్ల కింద వాధవాన్లపై ఈడీ అభియోగాలను నమోదు చేసింది. వాధవాన్లను ముంబై పోలీస్ శాఖలోని ఆర్థిక నేరాల విభాగం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా అక్టోబర్‌లో వీరిని ఈడీ తమ కస్టడీలోకి తీసుకున్న సంగతీ విదితమే. పీఎంసీ బ్యాంక్ ఖాతాదారులు దాదాపు 16 లక్షలు. కుంభకోణం కారణంగా సెప్టెంబర్ 23న ఈ బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆంక్షలు విధించింది. ఆరు నెలలపాటు ఇవి అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. దీంతో తమ ఖాతాల్లో నుంచి నగదును ఉపసంహరించుకోవడానికి ఖాతాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొదట్లో వెయ్యి రూపాయలకు మించి విత్‌డ్రా చేసుకోవడానికి వీల్లేదని ఆర్బీఐ ప్రకటించినా.. ఖాతాదారుల అవసరాల దృష్ట్యా రూ.50 వేలకు పెంచింది. మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో బ్యాంక్ బోర్డును రద్దు చేసిన ఆర్బీఐ.. తమ చేతుల్లోకి తీసుకున్నది. హెచ్‌డీఐఎల్‌కే రూ.6,700 కోట్లకుపైగా రుణాలు ఇచ్చినట్లు ఆర్బీఐ గుర్తించగా, మొత్తం బ్యాంక్ రుణాల్లో ఇది 73 శాతానికి సమానం కావడం గమనార్హం. ఉన్నతాధికారులూ ఈ కేసులో అక్రమాల ఆరోపణల్ని ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ మొత్తం రుణాల విలువ సుమారు రూ.9 వేల కోట్లుగా ఉంటే, డిపాజిట్లు రూ.11,610 కోట్లుగా ఉన్నాయి.

# రిలయన్సే రారాజు

### ఆదాయంలో తొలి స్థానం దక్కించుకున్న సంస్థ • 2018-19లో రూ.5.81 లక్షల కోట్లుగా నమోదు

### వరుస పదేండ్ల ఐవోసీ ఆధిపత్యానికి గండి • ఫార్చ్యూన్ ఇండియా 500 జాబితాలో వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:**

రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో ప్రభంజనం సృష్టించింది. దేశంలో అత్యధిక ఆదాయం ఆర్జించిన సంస్థగా ఆర్‌ఐఎల్ రికార్డు పుటల్లోకి ఎక్కింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ రూ.5.81 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత పదేండ్లుగా అత్యధిక ఆదాయాన్ని ఆర్జించి తొలిస్థానంలో నిలిచిన ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ)ని వెనక్కినెట్టి ఈ స్థానాన్ని దక్కించుకున్నది ఆర్‌ఐఎల్. ఐవోసీ గతేడాది రూ.5.36 లక్షల కోట్ల ఆదాయంతో రెండో స్థానానికి పడిపోయింది. ప్రస్తుత సంవత్సరానికిగాను ఫార్చ్యూన్ ఇండియా 500 విడుదలచేసిన జాబితాలో ఈ విషయం వెల్లడైంది. స్టాక్ మార్కెట్లో లిస్టైన 2010 నుంచి అంతక్రితం ఏడాది వరకు ఐవోసీ తొలిస్థానంలోనే కొనసాగింది. రిలయన్స్ తొలి స్థానం రావడానికి రిటైల్, టెలికం, కన్జ్యూమర్ వ్యాపారాలు దన్నుగా నిలిచినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ముకేశ్ అంబానీ నేతృత్వంలో నడుస్తున్న ఆర్‌ఐఎల్..2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.39,588 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇదే సమయంలో ఐవోసీ రూ.17,337 కోట్లు మాత్రమే. దేశీయ కార్పొరేట్ ప్రపంచంలో ఇంతటి స్థాయి ఆదాయాన్ని ఆర్జించిన సంస్థగాను ఆర్‌ఐఎల్ రికార్డు సృష్టించింది. ఆర్‌ఐఎల్ ఆదాయంలో 41.5 శాతం వృద్ధిని కనబరుచగా, అదే ఐవోసీ ఆదాయంలో 33.1 శాతం పెరుగుదల కనిపించింది. అంటే ఐవోసీ కంటే ఆర్‌ఐఎల్ ఆదాయం 8.4 శాతం అధిక వృద్ధిని నమోదు చేసుకున్నది. ఇదివరకు ప్రభుత్వరంగ సంస్థయైన ఐవోసీ పేరిట ఈ రికార్డు ఉన్నది. గడిచిన పదేండ్లలో ఆర్‌ఐఎల్ నికర లాభం ఐవోసీ కంటే మూడు రెట్లు అధికంగా ఉన్నది. ఈ జాబితాలో 2018లో మూడోస్థానంలో నిలిచిన మరో ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) ఈసారి కూడా ఇదే స్థానంలో కొనసాగింది. ఆ తర్వాతి స్థానాల్లో బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఉండగా, టాటా మోటర్స్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) ఉన్నాయి. 2018తో పోలిస్తే 2019లో ఈ సంస్థల ర్యాంకుల్లో ఎలాంటి మార్పులు నమోదుకాకపోవడం విశేషం. ఓఎన్‌జీసీ ఇటీవల కొనుగోలు చేసిన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్), ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్‌లను కలుపుకోకుండానే ఈ జాబితాను రూపొందించింది ఫార్చ్యూన్. మరోవైపు, రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ ఒక్కస్థానం ఎగబాకి ఈసారి 7వ స్థానానికి చేరుకున్నది. ఆ తర్వాతి స్థానాల్లో టాటా స్టీల్, కోల్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, లార్సెన్ అండ్ టుబ్రోలు నిలిచాయి. ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ రెండు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నట్లు నివేదిక వెల్లడించింది. ఆ తర్వాత హిందాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు ఉన్నాయి.

#### మూడు స్థానాలు దిగజారిన వేదాంతా

మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత సంవత్సరానికిగాను ఫార్చ్యూన్ జాబితాలో వేదాంతా తన ర్యాంక్‌ను మూడు స్థానాలు కోల్పోయి 18కి జారుకున్నది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న సంస్థల ఆదాయం సరాసరిగా 9.53 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఇదే సమయంలో లాభంలో 11.8 శాతం పెరుగుదల నమోదైంది. ఈ జాబితా నుంచి 57 సంస్థలు వైదొలిగాయి. వీటిలో ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న సంస్థలు, ప్రైవేట్ రంగ కంపెనీలు కూడా ఉన్నాయి. ఈ ఫార్చ్యూన్ 500 సంస్థల్లో 65 కంపెనీలు నష్టాన్ని ప్రకటించాయి. మొత్తంగా నష్టపోయింది రూ.1.67 లక్షల కోట్లు. 2017-18లో 79 సంస్థలు రూ.2 లక్షల కోట్ల మేర నష్టపోయాయి. వీటిలో అత్యధికంగా పీఎస్‌బీలు నష్టపోయాయి. 22 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 14 బ్యాంకులకు రూ.74,253 కోట్ల నష్టం సంభవించింది. కానీ, రెండంటే రెండు ప్రైవేట్ బ్యాంకులు(ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రూ.1907.90 కోట్లు, లక్ష్మీ విలాస్ బ్యాంక్ రూ.894.10 కోట్లు) నష్టపోయాయి.




మొత్తం ప్రైవేట్ బ్యాంకుల్లో 24 సంస్థలు(విదేశీ, సహకార బ్యాంకులు కలుపుకొని) రూ.60,747 కోట్ల లాభాన్ని ఆర్జించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 6.16 శాతం అధికం. ఈ ఫార్చ్యూన్ 500 కంపెనీలకు వచ్చిన మొత్తం ఆదాయంలో 22.3 శాతం చమురు, గ్యాస్ రంగాలకు చెందినవి కాగా, 15.88 శాతం బ్యాంకింగ్ రంగానికి చెందినవి. ఈ జాబితాలో సంఖ్యాపరంగా చూస్తే బ్యాంకింగ్ రంగానికి చెందినవి 48 సంస్థలు ఉండగా, లాభాల్లో 23.44 శాతం వాటాతో చమురు, గ్యాస్ సంస్థలు ఉన్నాయి. రోడ్లు, విద్యుత్, స్టీల్ రంగానికి చెందిన సంస్థలు సకాలంలో రుణాలను తిరిగి చెల్లింపులు జరుపడంలో విఫలంకావడంతో ప్రభుత్వరంగ బ్యాంకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

#### భారత్‌లో అతిపెద్ద కార్పొరేట్ సంస్థలు

ఆదాయం(రూ.కోట్లలో)

| ఫార్చ్యూన్ ర్యాంక్ 2019 | సంస్థ | ఆదాయం(రూ.కోట్లలో) |
|---|---|---|
| 1 | రిలయన్స్ ఇండస్ట్రీస్ | 580,553.00 |
| 2 | ఇండియన్ ఆయిల్ | 535,793.18 |
| 3 | ఓఎన్‌జీసీ | 436,057.04 |
| 4 | ఎస్బీఐ | 330,687.36 |
| 5 | టాటా మోటర్స్ | 303,227.41 |
| 6 | భారత్ పెట్రోలియం | 302,806.71 |
| 7 | రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ | 175,830.66 |
| 8 | టాటా స్టీల్ | 159,835.46 |
| 9 | కోల్ ఇండియా | 152,271.30 |
| 10 | టీసీఎస్ | 150,774.00 |



## ఏపీలో డావ్ వాహన ప్లాంట్

**హైదరాబాద్, డిసెంబర్ 16:** చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ డావ్ ఈవీ టెక్నాలజీ.. ఆంధ్రప్రదేశ్‌లో వాహన తయారీ యూనిట్‌ను నెలకొల్పుతున్నట్లు ప్రకటించింది. ఏపీలోని కృష్ణపట్నం పోర్టు వద్ద ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ కోసం వచ్చే మూడేండ్లకాలంలో 100 మిలియన్ డాలర్లు(సుమారు రూ.700 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టబోతున్నది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక యూనిట్‌లో తయారైన ఎలక్ట్రిక్ స్కూటర్లను ఫిబ్రవరిలో దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్, చీఫ్ ఫైనాన్షియల్ అధికారి బాలాజీ మాట్లాడుతూ..ఈ పెట్టుబడుల్లో తొలి విడుత 30 మిలియన్ డాలర్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు, మిగతా 70 మిలియన్ డాలర్లను దశలవారీగా వ్యాపారాన్ని విస్తరించడానికి వినియోగించనున్నట్లు చెప్పారు. ఈ యూనిట్‌తో ప్రత్యక్షంగా 2 వేల మందికి, పరోక్షంగా 3 వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నయన్నారు. ఫిబ్రవరిలో విడుదల చేయనున్న స్కూటర్లలో తక్కువ వేగం కలిగినవి రూ.50 వేల నుంచి రూ.75 వేల లోపు ఉండనుండగా, అదే వేగం ఎక్కువ వేగం కలిగిన స్కూటర్లు రూ.75 వేల నుంచి లక్షల రూపాయల వరకు ఉండనున్నాయని ఆయన సంకేతాలిచ్చారు. ఈ స్కూటర్లు ఒక్కసారి బ్యాటరీ రీచార్జి చేస్తే 125 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది. అంతర్జాతీయ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల్లో 25 ఏండ్లకు పైగా అనుభవం ఉన్న డావ్.. దేశీయ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు కంపెనీ చైర్మన్, సీఈవో మిచెల్ లియూ తెలిపారు.

## మూడేండ్లలో రూ.60 వేల కోట్లు

### భారత్‌లో పెట్టుబడులు పెట్టనున్న వేదాంతా

**ముంబై, డిసెంబర్ 16:** వచ్చే మూడేండ్లకాలంలో భారత్‌లో రూ.60 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు వేదాంతా రిసోర్స్ చైర్మన్ అనిల్ అగర్వాల్ ప్రకటించారు. నాలుగు నుంచి ఐదేండ్ల కాలంలో టాప్‌లైన్ 30-40 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..ఇదే సమయంలో 10 మిలియన్ డాలర్ల నికర లాభాన్ని అంచనావేస్తున్నట్లు ఇండియా ఎకనమిక్ కన్‌క్లేవ్ 2019 సమ్మిట్‌లో ఆయన చెప్పారు. భారత మార్కెట్‌పై గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేసిన ఆయన..గడిచిన పదేండ్ల కాలంలో 35 బిలియన్ డాలర్ల వరకు ఇక్కడ పెట్టుబడులు పెట్టినట్లు, హిందుస్థాన్ జింక్, బాల్కో, సెసా గోవా, కెయిర్న్‌లను కలుపుకొని 13 సంస్థలను కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. వచ్చే మూడేండ్లలో రూ.60 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించిన ఆయన.. ఈ నిధులను వేటికోసం వినియోగించేదానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. కానీ, కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదని సంకేతాలు ఇచ్చారు. గ్లాస్, ఆప్టికల్ ఫైబర్, కేబుల్ ఇండస్ట్రీ రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. కొరియా, తైవాన్, జపాన్ దేశాలు గ్లాస్‌తో మొబైళ్లు, టీవీలు, కంప్యూటర్లను తయారు చేసినట్లే తమ సంస్థ కూడా వీటిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

# ముందే పసిగట్టాం

### జీడీపీ పతనాన్ని అడ్డుకునేందుకే వరుస వడ్డీరేట్ల కోతలు: దాస్

**ముంబై, డిసెంబర్ 16:**

దేశంలో ఆర్థిక మందగమనాన్ని ఫిబ్రవరిలోనే పసిగట్టామని, అందుకే వడ్డీరేట్లను తగ్గిస్తూ వచ్చామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. జీడీపీ పురోగతికి ఏం చేయాలో దాన్ని ఆర్బీఐ చేస్తుందన్నారు. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం అదుపుతోపాటు బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో మెరుగైన ఆర్థిక పరిస్థితుల కోసం రిజర్వ్ బ్యాంక్ కృషి చేస్తుందని చెప్పారు. సోమవారం ఇక్కడ టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన భారత ఆర్థిక సదస్సులో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థపై సమగ్ర చర్చ అవసరమని అభిప్రాయపడ్డారు. అమెరికా-చైనా ఒప్పందం.. ప్రపంచ వృద్ధిరేటుకు దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశ వృద్ధిరేటును బలపరిచేందుకు అవసరమైన నగదు నిల్వలు ఆర్బీఐ వద్ద ఉన్నాయన్నారు.

#### పెట్టుబడులు కీలకం

ఆందోళనకర స్థాయికి దిగజారిన జీడీపీని పరుగులు పెట్టించేందుకు మౌలిక రంగంలో కేంద్ర, రాష్ట్రాల పెట్టుబడులు పెద్ద ఎత్తున పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకిన విషయం తెలిసిందే. 4.5 శాతంగా నమోదైంది. తయారీ రంగంపై మరింత దృష్టి పెట్టాలని, దేశీయ సంస్థలు ఎగుమతులను పెంచుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ రంగాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన ఎస్సార్ స్టీల్ వ్యవహారంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల సమస్య పరిష్కారానికి ఇది దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



#### అర్థం కావట్లేదు

జీడీపీ పతనాన్ని అడ్డుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను తగ్గిస్తూ వచ్చామన్న దాస్.. తమ నిర్ణయాలను మార్కెట్, పరిశ్రమ స్వాగతించాయన్నారు. చాలాకాలం తర్వాత వడ్డీరేట్లు తగ్గడంతో ఒకింత ఆశ్చర్యం కనిపించిందని తెలిపారు. కానీ ఈ నెలలో జరిగిన చివరి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచితే.. మార్కెట్లకు మింగుడుపడలేదని చెప్పారు. ఇది తనకు అర్థం కావడం లేదని దాస్ అన్నారు. నాడు వడ్డీరేట్లను తగ్గిస్తే సరైన నిర్ణయమని కొనియాడినవారంతా.. నేడు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచితే సరైన నిర్ణయమేనని ఎందుకు అనలేకపోతున్నారంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం ఎలాంటి పరిస్థితులున్నాయో తెలియదా? అన్నారు. ఈ క్రమంలోనే ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నంత వరకే వృద్ధిరేటు పెంపు ఆర్బీఐ లక్ష్యమవుతుందని, ద్రవ్యోల్బణం మీతిమిరితే దాని కట్టడే ఆర్బీఐకి ప్రాధాన్యత అంశమని తేల్చిచెప్పారు. ఆర్బీఐ నిర్ణీత హద్దులో ద్రవ్యోల్బణం ఉన్నందునే వృద్ధిదాయక నిర్ణయాలు తీసుకున్నామన్న ఆయన ఇప్పుడు ద్రవ్యోల్బణం పెరిగిందని, అందుకే వడ్డీరేట్ల జోలికి వెళ్లలేకపోయామని వివరించారు. నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి విజృంభించినది విదితమే. ఫిబ్రవరి నుంచి వరుసగా ఐదు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తగ్గించిన ఆర్బీఐ.. రికార్డు స్థాయిలో రెపో రేటును 1.35 శాతం దించింది.

#### 24X7 నెఫ్ట్ సేవలు మొదలు

-తొలి 8 గంటల్లో 11.40 లక్షల లావాదేవీలు

నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) నిరంతర సేవలు మొదలెయ్యాయి. సోమవారం నుంచి 24 గంటల నెఫ్ట్ సేవలు అమల్లోకి వచ్చాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తొలి ఎనిమిది గంటల్లో దాదాపు 11.40 లక్షల లావాదేవీలు జరిగినట్లు ఆర్బీఐ వెల్లడించింది. 'ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 11.40 లక్షల లావాదేవీలు జరిగాయి' అని స్పష్టం చేసింది. ఇకపై ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సేవలు ఎప్పుడైనా అందుబాటులో ఉంటాయన్నది. మరోవైపు 24x7 నెఫ్ట్ సేవలతో నిరంతర నగదు బదిలీ అవకాశమున్న దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లైంది.



పారిశ్రామిక వర్గాలతో సమావేశమైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

## పన్నులను తగ్గించాలి

### పరిశ్రమ వర్గాల డిమాండ్ • ఆర్థిక మంత్రి నిర్మలతో సమావేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** పన్నుల భారం మోయలేకున్నామని, తగ్గించాలని పరిశ్రమ యావత్తూ కేంద్రానికి మొర పెట్టుకున్నది. ఆర్థిక మందగమనంతో వ్యాపారాలు కళావిహీనంగా తయారయ్యాయని, అధిక పన్ను రేట్లకు కోత పెట్టాల్సిందేనని డిమాండ్ చేసింది. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఐటీ, స్టార్టప్స్, మొబైల్ డివైజ్‌ల రంగాల ప్రతినిధులు సమావేశమెయ్యారు. ముందస్తు బడ్జెట్ సంప్రదింపుల్లో భాగంగా ఈ భేటీ జరిగింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను వచ్చే ఏడాది పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌ను నిర్మల ప్రవేశపెడుతున్నారు. దీంతో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని సేవారంగ సంస్థలకు కార్పొరేట్ పన్నును 15 శాతంగానే ఉంచాలని ఐటీ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఈ సందర్భంగా కోరింది. టెక్నాలజీ స్టార్టప్‌లు, క్లస్టర్ల ఏర్పాటుకు వీలుగా ఓ నిధిని ఏర్పాటు చేయాలని నాస్కామ్ సూచించింది. మరోవైపు ఐటీ హార్డ్‌వేర్, మొబైల్ తయారీదారులు పన్ను నిర్మాణాన్ని హేతుబద్ధం చేయాలని కోరారు. ఎగుమతి ప్రోత్సాహకాల్లో ఇటీవలి తగ్గింపులపై స్పష్టతను ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తగ్గే ఎగుమతి ప్రోత్సాహకాలు పెద్ద ఎత్తున ఉద్యోగాలను నష్టపరిచే వీలుందని భారతీయ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ సంఘం (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మహీంద్రు ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీఈఏతోపాటు ఎంఏఐటీ, టెలికం ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ప్రైవేట్ ఈక్విటీ అండ్ వెంచర్ క్యాపిటల్ అసోసియేషన్, యాపిల్, లావా ఇంటర్నేషనల్, జియో మొబైల్స్ తదితర సంస్థల ప్రతినిధులు నిర్మలను కలిసిన కార్పొరేట్లలో ఉన్నారు. ఇక ఆర్థిక రంగ సంస్థలు సైతం టర్మ్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ తగ్గింపును డిమాండ్ చేస్తున్నాయి. పీజే నాయక్ కమిటీ సిఫార్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పాలనాపరమైన మార్పుల కోసం చర్యలు తీసుకోవాలని ఆర్థిక రంగ ప్రతినిధులతోపాటు క్యాపిటల్ మార్కెట్స్ వర్గాలు సూచించాయి.

# ఇంటర్ అకౌంటెన్సీలో కొత్త కోర్సులు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- కొత్త కోర్సులపై ఫ్యాకల్టీకి మొదలైన శిక్షణ
- ఉద్యోగ, ఉపాధి అనుకూల కోర్సులకు ఇంటర్ బోర్డు చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంస్కరణలను కొనసాగిస్తున్నది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెండుగా ఉండే అకౌంటెన్సీలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ఇంటర్ అకౌంటెన్సీలో ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ వంటి కోర్సులు ఉండగా.. అకౌంటెన్సీ, కామర్స్, టాక్సేషన్, ఐటీ వంటి కొత్త కోర్సులను వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలుచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో అకౌంట్స్‌కు సంబంధించిన టీచింగ్ ఫ్యాకల్టీకి ఫలక్‌నుమాలో సోమవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించారు. మూడ్రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని ఇంటర్ విద్యా కమిషనర్ సయ్యద్ ఉమర్‌జలీల్ తెలిపారు. తర్వాత కొత్త కోర్సుల అమలుకు కావాల్సిన సిలబస్‌ను సబ్జెక్టు నిపుణులతో రూపొందిస్తారు. తర్వాత ప్రభుత్వ అనుమతితో తెలంగాణ అకాడమీ నుంచి పుస్తకాలను ముద్రిస్తారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంనాటికి కొత్త కోర్సుకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**విడుతలవారీగా మిగతా గ్రూపుల్లో..**

కొత్త కోర్సులను అన్ని కాలేజీలకు అనుమతిస్తామని, అందుకు ఫ్యాకల్టీతోపాటు సదుపాయాలు ఉండాలని ఇంటర్‌బోర్డు స్పష్టంచేస్తున్నది. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల ఆసక్తి, నమోదు ఆధారంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి కూడా కృషిచేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఈ విషయంలో ఇంటర్‌బోర్డుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా సహకారం అందిస్తున్నదని పేర్కొన్నారు. ఆ తర్వాత మిగిలిన గ్రూపుల్లో కూడా దశలవారీగా కొత్త కోర్సులను ప్రవేశపెడుతామని పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు నోటిఫికేషన్ జారీ

- జనవరి 15 వరకు అవకాశం
- ఫిబ్రవరి 7న జాబితా విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓటర్ల జాబితాలో పేర్లు, ఇతర వివరాల సవరణకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సోమవారం నోటిఫికేషన్ విడుదలచేశారు. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 16 నుంచి జనవరి 15 వరకు అవకాశం కల్పించారు. జనవరి 27 నాటికి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. ఫిబ్రవరి నాలుగున సవరించిన ఓటర్ల జాబితాకు చెందిన డాటాబేస్ పూర్తిచేసి ముద్రణకు ఇవ్వనున్నారు. ఫిబ్రవరి ఏడున తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు.

**రాష్ట్రంలో ఓటర్లు 2,98,64,689 మంది**

2020 జనవరి ఒకటి నాటికి తెలంగాణలో మొత్తం 2,98,64,689 ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 1,50,07,047, మహిళలు 1,48,56,076, ఇతరులు 1,566 మంది ఉన్నారు. కొత్తగా పెరిగిన ఓటర్ల మేరకు కొత్తగా 105 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సీఈవో తెలిపారు. వీటిని కలుపుకుని మొత్తం 34,707 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రకటించారు. 2020 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు వయసు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించామన్నారు. వివరాలు www.ceotelangana.nic.in. వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఓటర్ల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.



# ఎటుచూసినా కిలకిలలే!

- తెలంగాణలో పెరిగిన వలసపక్షుల సందడి
- కనువిందు చేస్తున్న అరుదైన విహంగాలు
- గతంలో కంటే ఈసారి భారీగా పెరిగిన పక్షుల సంఖ్య
- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలే కారణం

(ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

తెలంగాణలో గలగల పారుతున్న సెలయేళ్లు, నదీనదాలు, జలపాతాలు, కుంటలు, చెరువులు కొత్తశోభను సంతరించుకున్నాయి. దేశ, విదేశాల నుంచి వలసవస్తున్న రకరకాల పక్షుల కిలకిలలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు.. కాగజ్‌నగర్ నుంచి హుజూర్‌నగర్ వరకు.. ఇలా ఎటుచూసినా వలసపక్షుల సందడి కనిపిస్తున్నది. మంగోలియా నుంచి గండిపేటకు బార్‌హెడెడ్ గూస్, మడగాస్కర్ నుంచి ఆదిలాబాద్‌కు అముల్‌పాల్కన్, పసిఫిక్ మహాసముద్రం నుంచి అమ్రాబాద్‌కు స్లెండర్ బిల్డ్ డక్.. ఇలా ఖండంతరాలు దాటి వస్తున్న అత్యంత అరుదైన విహంగాలకు తెలంగాణ ఆతిథ్యమిస్తున్నది. రష్యా, సైబీరియా, సెంట్రల్ ఆసియాతోపాటు హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి వెచ్చదనాన్ని వెతుక్కుంటూ వస్తున్న అనేక రకాల విహంగాలను తెలంగాణ సాదరంగా అక్కున చేర్చుకొంటున్నది. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో ఈ పక్షులను వీక్షించేందుకు ప్రజలు వివిధ ప్రాంతాల్లోని చెరువులు, కుంటల వద్దకు తరలివస్తున్నారు. ఇలాంటివారి కోసం అటవీశాఖ ప్రత్యేకంగా 'బర్డ్ రన్' కార్యక్రమాలను చేపడుతున్నది. సాధారణంగా రాష్ట్రంలో వలసపక్షుల సందడి చలికాలం (అక్టోబర్ లేదా నవంబర్) నుంచి మొదలవుతుంది. ఫిబ్రవరి నుంచి అవి మళ్లీ తమ స్వస్థలాలకు తిరుగుపయనమవుతాయి.

**మిషన్ కాకతీయ, హరితహారం.. వలసపక్షులకు వరం**

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతోపాటు 'మిషన్ కాకతీయ' కింద తవ్విన చెరువులు జలకళను సంతరించుకోవడంతో వలసపక్షుల రాక పెరిగిందని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలసపక్షుల సందడి క్రమంగా పెరుగడానికి ప్రభుత్వం చేపట్టిన కొన్ని ప్రత్యేక చర్యలు కూడా కారణమని, గతంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కనిపించే వలసపక్షులు ఈ సారి చాలా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలకు విస్తరించాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో ధ్వంసమైన అమీన్‌పూర్, నేక్‌నాంపూర్ లాంటి చెరువులను పునరుద్ధరించడం, 'మిషన్ కాకతీయ'లో చారిత్రక చెరువులకు ఊపిరిపోయడం లాంటి చర్యలు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) ప్రాంగణంలోని చెరువును ఇందుకు ప్రత్యక్ష తార్కాణంగా చెబుతున్నారు. ఇక్కడి చిన్న చెరువు ప్రాంతానికి దాదాపు రెండువేల షెవల్లర్, లెస్సర్ విస్లింగ్ పక్షులు వలస వచ్చినట్టు గుర్తించారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం గత ఐదేండ్ల నుంచి 'హరితహారం' కార్యక్రమాన్ని కొనసాగిస్తుండటం వలసపక్షులకు వరంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు గతంలో దాదాపు 120 రకాల విదేశీ, స్వదేశీ పక్షులు వలసవచ్చేవి. కానీ గత రెండేండ్ల నుంచి 150 రకాలకుపైగా పక్షులు వలస వస్తున్నట్టు గుర్తించారు. సాధారణంగా రాష్ట్రానికి ఏటా దేశ, విదేశాల నుంచి సుమారు రెండు లక్షల వసలపక్షులు వలసవచ్చేవి. కానీ ఈసారి వాటి సంఖ్య రెండున్నర నుంచి మూడు లక్షలు దాటవచ్చని అటవీశాఖ అధికారులంటున్నారు. ఈ ఏడాది దాదాపు 15 శాతం పక్షులు అధికంగా వచ్చాయని, ఓపెన్ బిల్‌డక్, స్పాట్‌బిల్ డక్, బ్రాహ్మణీ డక్, పెయింటెడ్ స్టార్క్, నైట్ హెరాన్, ఫ్లెమింగో, బార్‌హెడెడ్ గూస్, షెవెల్లర్ లాంటి పక్షిజాతుల రాక భారీగా పెరిగిందని, బర్డ్ వాచర్స్ సొసైటీ కార్యదర్శి షఫతుల్లా పేర్కొన్నారు.







ఆసిఫాబాద్‌కు వలస వచ్చిన అరుదైన అమూర్‌ఫాల్కన్, అల్ట్రా మెరైన్ ఫ్లైక్యాచర్ పక్షులు

**మన ప్రకృతి రమణీయతకు మెచ్చి..**

కాలుష్యం నుంచి బయటపడి ప్రకృతి రమణీయతను సంతరించుకొన్న పటాన్‌చెరు, పాశమైలారం ప్రాంతాలు ఇప్పుడు వలసపక్షులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఇక్కడి అమీన్‌పూర్ చెరువు ఫ్లెమింగో లాంటి పక్షులకు నెలవుగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కోసిని, తిర్యాణి గుండాల, సిర్పూర్, పాకాల, ఏటూరునాగారం, నల్లమల ఫర్హాబాద్, నిజాంసాగర్, నాగార్జునసాగర్, గండిపేట, హిమాయత్‌సాగర్‌లో రకరకాల పక్షులు విడిదిచేస్తున్నాయి. మడగాస్కర్ దీవిలో ఉండే అమూల్ ఫాల్కన్లతోపాటు అరుదైన అల్ట్రా మెరైన్ ఫ్లైక్యాచర్ లాంటి పలురకాల అందమైన పక్షులు వీటిలో ఉన్నాయని ఆసిఫాబాద్ డిఎఫ్వో రంజిత్‌నాయక్ తెలిపారు.

# భారత్-అమెరికాది దృఢమైన బంధం

- సాంకేతికతలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం
- యూఎస్ యాక్టింగ్ కాన్సుల్ జనరల్ ఎరిక్ అలెగ్జాండర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారత్-అమెరికాది దృఢమైన బంధమని, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నత స్థితిలో కొనసాగుతున్నాయని యూఎస్ యాక్టింగ్ కాన్సుల్ జనరల్ ఎరిక్ అలెగ్జాండర్ చెప్పారు. రక్షణరంగంలో ఈ బంధం బలోపేతం కావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఉమ్మడి భాగస్వామ్య పరిశోధన, అత్యాధునిక రక్షణ పరికరాల ఉత్పత్తి, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సహకారం ఇప్పటికే అభివృద్ధి చెందిందన్నారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్, నెక్సస్ స్టార్టప్ హబ్ సంయుక్తంగా టీ-హబ్‌లో రెండ్రోజులపాటు నిర్వహించే డిఫెన్స్ సార్టప్స్ వర్క్‌షాప్‌ను సోమవారం ఎరిక్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్ టెక్నాలజీతో సహా అన్నిరంగాల్లో దూసుకుపోతున్నదన్నారు. రక్షణరంగంలో నూతన ఆవిష్కరణలకు అపార అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకొనేందుకు యువ ఔత్సాహికవేత్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. నెక్సస్ స్టార్టప్ హబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎరిక్ అజులే మాట్లాడుతూ.. దేశంలో స్టార్టప్ ఎకో సిస్టంను ప్రోత్సహించేందుకు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రపంచంలోనే తొలి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ అండ్ ఇంక్యుబేటర్‌ని ఢిల్లీలో ఏర్పాటు చేసిందన్నారు. కాగా, 20 ఇన్నోవేటివ్ స్టార్టప్ వ్యవస్థాకులు, సీఈవోలకు రక్షణరంగంలో ఉన్న అవకాశాల గురించి తొలి రోజు నిపుణులు వివరించారు.

# పాస్‌పుస్తకాలు మంజూరుచేయండి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో రైతుల ఆందోళన

ధర్మగంట



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

**అన్నపురెడ్డిపల్లి:** పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలంటూ రైతులు ఆందోళనకు దిగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. అన్నపురెడ్డిపల్లి మండలం తెలిజర్ల, ఊటుపల్లి, నర్సాపురం రెవెన్యూలోని పలు సర్వేనంబర్లలో భూములు ఉన్న రైతులు తమకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. తాము ఏండ్ల తరబడి భూములు సాగుచేసుకుంటాన్నమని.. పాత పట్టాపుస్తకాలు, ఖాస్రాపహాణీతోపాటు అన్ని ఆధారాలు ఉన్నా పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం లేదని వాపోయారు. పాస్‌పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను అందుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన తాసిల్దార్ శ్రీనివాసులు రైతులతో మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## గనులశాఖ ఏడీ శ్రీనివాస్ సస్పెన్షన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కిన గనులశాఖ నాగర్‌కర్నూల్ ఏడీ పల్లటి శ్రీనివాస్‌ను ఉద్యోగంనుంచి సస్పెండ్‌చేస్తూ పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ఉత్తర్వులు జారీచేశారు. క్వారీ లీజుకు ఈ నెల 3న రూ.15వేలు లంచం తీసుకుంటూ అతడు ఏసీబీకి చిక్కాడు.

# ర్యాగింగ్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

- ప్రిన్సిపాళ్లు, డీఐఈవోలకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ర్యాగింగ్ నియంత్రణను కఠిన చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఇంటర్ విద్యాధికారులకు, కాలేజీ ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సంతోష్.. సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ కారణంగా ఆదివారం ఇంటికి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై నివేదిక సమర్పించాలని ఆ జిల్లా ఇంటర్ విద్యాధికారులను ఆదేశించారు. ర్యాగింగ్ వల్ల జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులెవ్వరికీ హాని కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు హాస్టళ్లలో కూడా ర్యాగింగ్ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బుక్‌ఫెయిర్‌కు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో ఈ నెల 23 నుంచి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి పుస్తకప్రదర్శన ప్రారంభోత్సవానికి విచ్చేయవలసిందిగా గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్‌ను హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, సెక్రటరీ కోయ చంద్రమోహన్ ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం వారు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 38 ఏండ్లుగా హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రదర్శనలు విజయవంతంగా సాగుతున్నాయని గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో ఐదేండ్లుగా బుక్‌ఫెయిర్‌ను వైభవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాగా పుస్తక ప్రదర్శనకు వచ్చేందుకు గవర్నర్ సుముఖత వ్యక్తంచేశారని గౌరీశంకర్ తెలిపారు.



సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకు వినతిపత్రం అందజేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా రామారం మండలం 'హాజీపూర్' బాధిత కుటుంబసభ్యులు, బీసీ సంఘం నాయకులు

# సాహిత్యం-సమాజం పరస్పర పూరకాలు

- తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి
- ముగిసిన 'తెలంగాణ సాహితి' నాలుగవ లిటరరీ ఫెస్ట్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వేల ఏండ్ల సామాజిక పరిణామ క్రమంలో మన వెంట తోడుగా వచ్చిన లలితకళల్లో సాహిత్యం అత్యంత శక్తిమంతమైనదని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. సాహిత్యం చేత సమాజం ప్రభావితమవుతున్నదా? సమాజం చేత సాహిత్యం ప్రభావితమవుతున్నదా? అని ప్రశ్నించినప్పుడు 'సాహిత్యం-సమాజం పరస్పర పూరకాలు' అని చెప్పాలన్నారు. 'తెలంగాణ సాహితీ సంస్థ' ఆధ్వర్యంలో నాలుగో లిటరరీ ఫెస్ట్ ముగింపురోజైన సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సాహితీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత సాహిత్యం కూడా ఇతోధికంగా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. తాటాకుల మీద నడిచి 11 వందల ఏండ్లు దాటి వచ్చిందంటే.. సాహిత్య శక్తి ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చునన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నర్సింహారెడ్డి

**జీవోలు అమ్మభాషలో ఉండాలి**

పాలన వ్యవహారాలు, బోధనా ప్రక్రియలు ఆంగ్ల మాధ్యమంలో ఉండటం సమంజసం కాదని తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ గౌరీశంకర్ అన్నారు. చట్టాలు, జీవోలు, సర్క్యులర్లు అన్నీ అమ్మ భాషలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన్, ఉపాధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కే ఆనందాచారి, నగరశాఖ అధ్యక్షుడు జీ నరేశ్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్, రిటైర్డ్ ఆచార్యులు పులికొండ సుబ్బాచారి, ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు నాగభూషణం, ఓయూ పరిశోధక విద్యార్థి తిరునగరి శరత్‌చంద్ర, తంగిరాల చక్రవర్తి, అనంతోజు మోహన్ కృష్ణ, వహీద్‌ఖాన్, కటుకోజుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మత్స్య సహకారసంఘాల అభివృద్ధి, సభ్యత్వ నమోదుపై సమీక్షిస్తున్న మంత్రి తలసాని

# చేపల విక్రయాలకు మొబైల్ ఔట్‌లెట్స్

- ప్రయోగాత్మకంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 150 స్టాళ్లు
- మత్స్యా సొసైటీల్లో అర్హులకే సభ్యత్వం: మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చేపల విక్రయాల కోసం త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.18 కోట్లతో మొబైల్ ఫిష్ ఔట్‌లెట్స్‌ను ప్రారంభించనున్నట్టు పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి మత్స్య సహకారసంఘాల అభివృద్ధి, సభ్యత్వనమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని 150 డివిజన్లలోమొబైల్ ఫిష్ ఔట్‌లెట్స్ ప్రారంభించనున్నట్టు చెప్పారు. మత్స్యకార సొసైటీల్లో నిబంధనల ప్రకారం అర్హులకే సభ్యత్వం కల్పిస్తామన్నారు. సమీక్షలో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

**పందుల పెంపకందార్లకు ప్రోత్సాహం**

పందుల పెంపకంపై ఆధారపడిన కుటుంబాల అభివృద్ధికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం పందుల పెంపకందార్ల సంఘం ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతూ 6,750 మంది సభ్యులతో 139 ప్రాథమిక ఫీడ్‌బ్రీడర్స్ కోఆపరేటివ్ సొసైటీలు నమోదయ్యాయని తెలిపారు. బ్యాంకు రుణాలు ఇప్పించే విషయాని ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. ఒక్కో యూనిట్ లక్షల రూపాయల విలువచేసేలా పథకాన్ని రూపొందించి మార్గదర్శకాలతో ప్రభుత్వానికి నివేదికిచ్చినట్టు మంత్రి వివరించారు. ఉత్తమ పాలసీని రూపొందించేందుకు అనుభవజ్ఞులైన పెంపకందారులు, అధికారులతో ఒక కమిటీని ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో పందుల పెంపకందార్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాములు, మధుసూదన్ పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అదనపు డైరెక్టర్ రాంచందర్‌రావు, సైంటిస్ట్ జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఆనంద్‌కు ఉత్తమ డైరెక్టర్ అవార్డు

- ఢిల్లీలో పురస్కారం ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బాలికా విద్య, మహిళా సాధికారత లాంటి సామాజిక కథాంశాలతో ఆలోచింపజేసే లఘుచిత్రాలను రూపొందించిన తెలంగాణవాసి డాక్టర్ ఆనంద్‌కు 'ఉత్తమ డైరెక్టర్' అవార్డు లభించింది. మెంటర్ అండ్ మస్కట్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. డాక్టర్ ఆనంద్ రూపొందించిన 'ప్రజాహక్కు'కు ఉత్తమ దర్శకుడి అవార్డు, 'అంటరానితనం' లఘు చిత్రానికి ఉత్తమ కథ అవార్డు, 'చిరుతేజ్ సింగ్' లఘుచిత్రంలో నటించిన వర్ధమాన నటి సౌమ్య వేణుగోపాల్‌కు ఉత్తమ నటి అవార్డు లభించింది. అమీగ, రెయిన్‌బో మ్యూజిక్ వీడియోల ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## మతిస్థిమితంలేని యువతిపై లైంగికదాడి

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

**జియాగూడ:** మతిస్థిమితంలేని ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్‌లోని కుల్సుంపురా పోలీసులు అరెస్ట్‌చేశారు. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జియాగూడకు చెందిన ఆటో డ్రైవర్ ఖలీల్ (38), హెజాజ్ (32) నవంబర్ 26వ తేదీన పురానాపూల్ చౌరస్తాలో ఓ మతిస్థిమితం లేని యువతి (17) తిరుగుతుండటాన్ని గమనించారు. ఆమెను ఆటోలో ఎక్కించుకుని పురానాపూల్ వంతెన కింద బైపాస్ రోడ్డులోని మూసీనది పరివాహక ప్రాంతానికి తీసుకువెళ్లి.. లైంగికదాడి చేశారు. మళ్లీ యువతిని పురానాపూల్ వంతెన వద్ద వదిలి వెళ్లిపోయారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. ఈ ఘాతుకానికి పాల్పడిన ఇద్దరు నిందితులను గుర్తించి.. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# అడవుల పట్ల సీఎం కేసీఆర్‌కు భావోద్వేగ బంధం

ఐఎఫ్‌ఎస్ అధికారుల సదస్సులో అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శోభ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్‌కు అడవులతో భావోద్వేగ బంధం ఉన్నదని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభ పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు కూడా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో ఐఎఫ్‌ఎస్ అధికారుల కోసం 'ఎమోషనల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎఫెక్టివ్ వర్క్ ప్లేస్ ఎక్సలెన్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. అధికారులు అన్ని విషయాల్లో పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని కోరారు. సీఎం కేసీఆర్ అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకంపై తీసుకుంటున్న ప్రత్యేకచొరువతో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. సదస్సులో పీసీసీఎఫ్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్నఅటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభ

# ఆగిఉన్న లారీని ఢీకొట్టిన డీసీఎం

- డ్రైవర్, క్లీనర్ దుర్మరణం
- అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోని ఔటర్‌రింగ్‌రోడ్డుపై ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన డీసీఎం

**అబ్దుల్లాపూర్‌మెట్:** ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో ఔటర్‌రింగ్‌రోడ్డుపై సోమవారం చోటుచేసుకున్నది. లారీ బ్రేక్‌డౌన్ కావడంతో కొహెడ గుట్ట సమీపంలో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో అనంతపూర్ నుంచి ఖమ్మం వెళ్తున్న డీసీఎం లారీని ఢీకొట్టిం ది. దీంతో డీసీఎంలో ఉన్న డ్రైవర్ మల్లికార్జున్, క్లీనర్ మహేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారమందుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

# శభాష్.. రాచకొండ పోలీస్

- రాత్రివేళ మహిళకు భరోసాగా నిలిచిన పెట్రోలింగ్ పోలీసులు
- క్షేమంగా ఇంటికి చేర్చడంపై డీజీపీ, కమిషనర్‌కు కృతజ్ఞతలు





**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** అర్ధరాత్రి వేళ ఒంటరిగా ఇంటికి వెళ్లేందుకు పోలీసులు అండగా ఉండగా భయపడాల్సిన అవసరం లేదంటున్నారు రాష్ట్ర మహిళలు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లుసహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళల రక్షణకు సరైన వాతావరణం ఉండటంతో మహిళలు ఊపిరి పీల్చుకొంటున్నారు. ఏ వేళలోనైనా పిలుపు వచ్చిందే తడవుగా ఐదు నిమిషాల్లో చేరి ఆదుకొంటామని నిరూపించే సంఘటన ఆదివారం రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరిగింది. అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో జంతు పరిరక్షణ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న నాగం ప్రవల్లిక.. ఉప్పల్ నుంచి కొర్రెములకు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. రోడ్డు మీద జన సంచారం తక్కువగా ఉన్నది. ఓ క్యాబ్ రావడంతో మాట్లాడుకొని ఇంటికి బయల్దేరారు. వెళ్తూవెళ్తూ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వాట్సప్ నంబర్ 94906 17111కు ఫోన్‌చేసి తన పరిస్థితిని వివరిస్తూ సమాచారం పంపారు. అయితే క్యాబ్ డ్రైవర్ ఊర్లోకి రానంటూ నారపల్లి వద్ద ఆమెను దింపేసి వెళ్లిపోయాడు. వెంటనే తన వద్ద ఉన్న ఘట్‌కేసర్ పెట్రోలింగ్ పోలీసుల ఫోన్ నంబర్‌కు కాల్‌చేసి సాయం చేయాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ సిబ్బంది సాయినాథ్‌రెడ్డి, రాములు ఐదు నిమిషాల్లో మహిళ ఉన్న చోటుకు చేరుకుని తమ పెట్రోలింగ్ వాహనంలో ఆమెను క్షేమంగా ఇంటి వద్ద దింపారు. పోలీసుల స్పందనకు సంతోషం వ్యక్తంచేస్తూ సదరు మహిళ.. డీజీపీ మహేందర్‌రెడ్డి, సీపీ మహేశ్‌భగవత్‌కు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

**పోలీసు సేవలను ఉపయోగించుకోండి: ప్రవల్లిక**



మహిళలు, విద్యార్థినులు రాత్రివేళల్లో ప్రయాణించేందుకు భయపడాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ప్రవల్లిక సూచిస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి స్థానిక పెట్రోలింగ్ ఫోన్ నంబర్లతోపాటు డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులను అనుసంధానించే సాంకేతికతను వినియోగించుకోవాలని, హ్యాక్ఐ యాప్ ద్వారా సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చునని తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు అద్భుతంగా ఉన్నదని ఆమె కితాబునిచ్చారు.

## 'బసవతారకం' దవాఖానకు భారీగా విరాళాలు

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** ప్రజలకు అధునిక క్యాన్సర్ చికిత్సలను అందిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పలువురు దాతలు భారీగా విరాళాలు అందజేశారు. సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సోహమ్ ఫౌండేషన్‌బోర్డు సభ్యుడు దొరైస్వామి నాగరాజన్ లక్ష యూఎస్ డాలర్లు, బాహుబలి చిత్రనిర్మాత దేవినేని ప్రసాద్ రూ.50 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, నందమూరి బాలకృష్ణ దాతలను సత్కరించారు.



దొరైస్వామిని సత్కరిస్తున్న బాలకృష్ణ

# గోల్కొండకోటలో పైప్‌లైన్ తవ్వకాలపై స్టే

- పనులు ఆపేయాలని జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షంనీటిని బయటకు పంపేందుకు జీహెచ్‌ఎంసీ గోల్కొండ కోటలో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను నిలిపేయాలని హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీచేసింది. పైప్‌లైన్ నిర్మాణానికి చేపడుతున్న తవ్వకాలతో గోల్కొండ కోట గోడలు ధ్వంసం అవుతున్నట్టు పత్రికల్లో వచ్చిన కథనాలపై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన చీఫ్‌జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. పనులు నిలిపేయాలని స్టే ఇచ్చింది. కాగా, కూకట్‌పల్లి లేక్‌లో కాలు ష్యం, మణికొండ ప్రాంతంలో రోడ్ల ఆక్రమణలపై సుమోటోగా స్వీకరించిన కేసుల్లో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది.

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 17 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# వాచిన పెదాలతో ఇబ్బంది పడుతున్నారా?

**చాలామంది పెదాలు వాడిపోయినట్టుగా, నిర్జీవంగా పేలగా తయారవుతాయి. కొందరికి పెదాలు వాపునకు గురవుతాయి. మరి ఈ సమస్య పరిష్కారానికి ఈ చిన్న చిట్కాలు పాటించండి.**

- కొన్ని ఐస్‌ముక్కలను కాటన్ గుడ్డలో తీసుకోవాలి. వాటితో సున్నితంగా పెదాలపై మర్దన చేయాలి. రోజులో నాలుగైదు సార్లు ఇలా చేయడం ద్వారా ఫలితం ఉంటుంది. ఐస్‌ముక్కలను నేరుగా పెదాలకు తాకించవద్దు.
- తాజా కలబంద నుంచి టీస్పూన్ జెల్ తీసుకోవాలి. వీలయినన్ని సార్లు పెదాలకు పూస్తే వాపు తగ్గుతుంది.
- తేనెను ఉపయోగించి ఈ సమస్యకు చెక్‌పెట్టొచ్చు . ఒక టీస్పూన్ తేనెలో కాటన్ బాల్‌ను ఉంచండి. చల్లని నీటితో మొహం కడిగి ఆ బాల్‌ను పెదాలపై మర్దన చేయండి.
- ఒక స్పూన్ పసుపును, చల్లని నీటితో కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై పూసి పది నిమిషాల తర్వాత తీసేయాలి. రోజులో మూడుసార్లు చేస్తే వాచిన పెదాలు తగ్గిపోతాయి. దీంతో పాటు ఏదైన నొప్పి ఉన్నా నయం అవుతుంది.







**అత్యాచారం.. వ్యభిచారం.. గృహహింస.. లైంగిక వేధింపులు.. సమస్య ఏదైనా సమిధ అయ్యేది మహిళే. అభం శుభం తెలియని చిన్నారుల నుంచి.. వృద్ధుల వరకూ దేశంలో ఎక్కడో ఓ చోట ఏదో ఒక అఘాయిత్యం జరుగుతూనే ఉన్నది. వెలుగులోకి వచ్చిన ఘటనలు పదుల సంఖ్యలో ఉంటే.. లెక్కలోకి రాని దుర్ఘటనలు ఎన్నో. ఇలాంటి దురాగతాలకు చరమగీతం పాడాలంటే.. తక్కువ రోజుల్లోనే మృగాళ్లకు మరణదండన వేయాలని పోరాడుతున్నారు స్వాతి మలివాల్. బాధితుల తరపున 'నిరశన గళం' వినిపిస్తూ.. ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారు.**

# నిరశన స్వరం స్వాతి మలివాల్!

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'నిర్భయ' ఘటన జరిగి నిన్నటికి ఏడేండ్లు. ఆధారాలన్నీ పక్కగా ఉన్నా.. నేటికీ నేరస్థులకు ఉరి శిక్ష ఖరారు కాలేదు. వాయిదా పడుతున్నది. ఇలాంటి కేసుల్లో యేండ్ల తరబడి విచారణలు కొనసాగుతుండడంతో.. మృగాళ్లు రెచ్చిపోతున్నారు. ఘటన జరిగిన నెలల వ్యవధిలో శిక్షలు ఖరారు కాకపోవడంతో.. మహిళలపట్ల భయం లేకుండా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. నెలలు నిండని చిన్నారులపై కూడా అత్యాచారాలు జరుగుతుండడం.. దేశమంతా సిగ్గు పడాల్సిన విషయం.

అందుకే 'ఘటన జరిగిన నెలల వ్యవధిలోనే నేరస్థులకు శిక్షలు పడాలి' అంటూ ఢిల్లీ మహిళా హక్కుల కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ ప్రాణాలను లెక్క చేయకుండా నిరసన దీక్షలు చేస్తున్నారు.

తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని, నెలల వ్యవధిలోనే శిక్షలు ఖరారు చేయాలని కోరుతూ దేశ రాజధానిలో 15 రోజులుగా నిరశన దీక్ష చేస్తున్నారు స్వాతి. ఈ క్రమంతో ప్రధాని నరేంద్రమోదీకి లేఖ కూడా రాశారు. డిసెంబర్ 3న 'దిశ'కు న్యాయం చేయాలని, నిందితులను ఉరి తీయాలని నిరాహార దీక్ష చేపట్టిన స్వాతి.. మానవ మృగాల ఎన్‌కౌంటర్ తర్వాత 'దిశ చట్టాన్ని' దేశవ్యాప్తంగా అమలు చేయాలని పోరాడుతున్నారు. 14 రోజులుగా మంచినీళ్లు తప్ప ఏ ఆహారం తీసుకోకుండా ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి ఉద్యమిస్తున్నారు. ఈ ఒక్క సంఘటనే కాదు.. స్వాతి మలివాల్ గతమంతా పోరుబాటే.

**మరణ శిక్ష ఆర్డినెన్స్ కోసం:** 12 యేండ్ల లోపు బాలికలపై అత్యాచారం చేస్తే.. మరణ శిక్ష విధించాలని కోరుతూ 2018 ఏప్రిల్ 13న ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టారు స్వాతి మలివాల్. కేంద్ర ప్రభుత్వాలు అత్యాచారాలపై కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. ఢిల్లీలో ఐక్యరాజ్య సమితి ప్రమాణాల ప్రకారం మహిళల భద్రతకు 66వేలకు పైగా పోలీసులను నియమించాలని, అత్యాచార కేసులను విచారించడానికి భారతదేశం అంతటా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రధానికి, రాష్ట్రపతికి లేఖలు రాశారు. నాడు స్వాతి చేసిన దీక్షకు దేశం నలుమూలల నుంచి మద్దతు లభించింది. పార్టీలకు అతీతంగా ఎంతోమంది ఆమె పోరాటాన్ని స్వాగతించారు. స్వాతి పోరాటం కారణంగా '12 యేండ్ల లోపు పిల్లలపై అత్యాచారం చేసే వ్యక్తులకు మరణశిక్ష విధించాలని 2018లో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది'. ఆ విజయం దేశ ప్రజలకు అంకితమిచ్చారు స్వాతి మలివాల్. 2018 జనవరిలో సంచలనం సృష్టించిన 'కథువా బాలిక' అత్యాచార ఘటనకు చలించి.. ఈ పోరాటానికి పూనుకున్నారు స్వాతి.

**వ్యభిచార కూపాల నుంచి విముక్తి:** ఢిల్లీలో జరుగుతున్న వ్యభిచార దందాపై నేటికీ పోరాడుతున్నారు స్వాతి మలివాల్. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి యువతులను అక్రమంగా తీసుకొచ్చి వ్యభిచార కూపంలోకి దించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు స్వాతి. అక్రమంగా తీసుకొచ్చిన యువతులను స్పా, మసాజ్ సెంటర్లలో ఉంచి వ్యభిచారం చేయిస్తుండడంపై నిఘా పెట్టారు. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ హోదాలో.. ఢిల్లీలోని పలు హోటళ్లు, స్పా, మసాజ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యభిచార కూపంలో చిక్కుకున్న ఎంతోమంది యువతకు విముక్తి కలిగించి పోరుబావుట ఎగరవేశారు స్వాతి. ఢిల్లీలోని రెడ్‌లైట్ ఏరియాల్లో మహిళలకు ఉపాధి మార్గాలు కల్పించడంలోనూ సఫలీకృతులయ్యారు స్వాతి. 'ఢిల్లీలోని జీజీ రోడ్‌లో ఉన్న రెడ్‌లైట్ ఏరియాలో నెలకు ఆరు లక్షల కండోమ్‌లను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అంటే ప్రభుత్వం నెలకు ఆరు లక్షల అత్యాచారాలకు అధికారిక అనుమతి ఇస్తున్నట్టే కదా' అని ప్రశ్నించారు. 'సెక్స్ వర్కర్లపై వ్యభిచారం పేరుతో జరుగుతున్న తంతును అత్యాచారాలుగా ఎందుకు పరిగణించలేం' అంటూ కేంద్రాన్ని, ఢిల్లీ సర్కార్‌ను ప్రశ్నిస్తూనే ఉన్నారు స్వాతి.

**పోరాటాలతోనే:** సమస్య ఏదైనా పోరాటాలతోనే పరిష్కరించుకోవాలని బలంగా నమ్ముతారు స్వాతి మలివాల్. నాటి నిర్భయ, కథువా ఘటన నుంచి దిశ, ఉన్నావ్ ఘటనల వరకూ పోరాడుతూనే ఉన్నారు స్వాతి. పిల్లలు, మహిళల అక్రమ రవాణాపై కూడా ఉద్యమిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో పుట్టారు స్వాతి మలివాల్. అమేథి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ఐటీ డిగ్రీ అందుకున్నారు. ఆమె ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన పండిట్ నవీన్ జైహింద్‌ను వివాహం చేసుకున్నారు. జూలై 2015లో 'ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్'గా తన మొదటి పదవిని చేపట్టారు. తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి రావడంతో ఆమె పదవీ కాలం మరో మూడేళ్లు పొడిగించబడింది. మన దేశంలోని 'మహిళా కమిషన్'కు బాధ్యతలు చేపట్టిన వారిలో అతి పిన్న వయస్కురాలు స్వాతినే.

**స్వాతికి మద్దతుగా:** స్వాతి మలివాల్ చేపట్టిన దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తున్నది. అత్యాచార బాధిత కుటుంబాలు ఆమెతో పాటు నిరాహార దీక్షలో పాల్గొంటున్నారు. దేశవ్యాప్తంగా మానవహారాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీలు చేపడుతున్నారు. విద్యార్థినులు స్వచ్ఛందంగా కాలేజ్‌లను బహిష్కరించి ప్లకార్డులతో రోడ్లపై శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, నిర్భయ తల్లి దీక్ష విరమించమని కోరినా.. దిశ చట్టం అమలు చేసే వరకూ పోరాటం ఆపబోనని ధీమాగా చెబుతున్నారు స్వాతి మలివాల్.

### రేపిస్టులు జైల్లో తినేది మన సొమ్మే



మన బిడ్డలపై అత్యాచారం చేసి, హత్యలకు పాల్పడుతున్న రేపిస్టులను.. మన సొమ్ముతోనే జైళ్లలో మేపుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం. రేపిస్టులకు వెంటనే శిక్ష అమలు జరగాలి. పిల్లలపై లైంగిక దాడికి పాల్పడితే వెంటనే మరణశిక్ష విధించాలి. 'దిశ' ఘటనలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కొందరు భిన్నంగా వాదిస్తున్నారు. రేపిస్టులు పారిపోతుంటే పోలీసులు చూస్తూ ఉరుకోవాలా? బలమైన వ్యవస్థలు ఉన్నప్పుడే మహిళలపై ఇలాంటి దారుణాలు జరగకుండా ఉంటాయి. దిశ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిందే.

**- స్వాతి మలివాల్,** ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్

...✍ డప్పు రవి

# జస్ట్ మిస్ వరల్డ్



**అందం, అభియనం, చలాకీతనం.. అంతకు మించిన సమయస్ఫూర్తి అన్నీ కలగలిపితే మన సుమన్ రతన్ సింగ్ రావు. ఈ ఏడాది ప్రపంచ సుందరి పోటీల్లో మూడోస్థానంలో నిలిచి ప్రపంచం చూపును తనవైపు తిప్పకున్నది. 'మిస్ వరల్డ్' పోటీల్లో రెండో రన్నరప్, 'మిస్ వరల్డ్ ఏసియా' కిరీటాలను తన ఖాతాలో వేసుకొని ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది రాజస్థాన్‌కు చెందిన ఈ అందాల తార.**

20 ఏండ్ల వయసులోనే మంచి మోడల్‌గా గుర్తింపు తెచ్చుకున్నది సుమన్‌రావు. 2019లో మిస్ ఇండియాగా కూడా ఎంపికైంది. ఆ తర్వాత మిస్ వరల్డ్ 2019లో సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. ఇదే వేదిక మీద 'మిస్ వరల్డ్ ఆసియా 2019'గా ఎంపికై మరో ఘనత సాధించింది. మిస్ జమైకా టోని ఆన్ సింగ్ 2019 మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇంతకుముందు సుమన్‌రావు మిస్ నవీ ముంబై కాంటెస్ట్‌లో పాల్గొన్నది. ఆ పోటీల్లో రన్నరప్‌గా నిలువడంతో అందాల పోటీల్లో పాల్గొనాలనే ఆశ ఆమెలో రెట్టింపయింది. మరుసటి ఏడాది 'మిస్ ఇండియా' పోటీల్లో పాల్గొన్నది. రాజస్థాన్ తరపున పాల్గొని, తన అందం, అభియనం, తెలివితేటలు ప్రదర్శించి 'మిస్ ఇండియా' కిరీటాన్ని కైవసం చేసుకున్నది. అలా సుమన్‌రావు ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని రెండు కిరిటీలు సాధించింది.

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ సమీపంలోని 'ఆయిదానా' గ్రామంలో 1998 నవంబర్ 23న సుమన్‌రావు జన్మించింది. ఆమె పుట్టిన ఏడాదికి సుమన్‌రావు కుటుంబం ముంబైలో స్థిరపడింది. తండ్రి రతన్ సింగ్ రావు స్వర్ణకారుడు. తల్లి సుశీలా రావు గృహిణి. ఆమెకు జితేంద్ర, చిరాగ్ అనే ఇద్దరు సోదరులు. తండ్రి ఉద్యోగం రీత్యా పనిలో ఉంటే తల్లి పిల్లల ఆసరాలు తీరుస్తున్నది. నవీ ముంబైలోని 'మహాత్మా స్కూల్ ఆఫ్ అకాడెమిక్స్ అండ్ స్పోర్ట్స్' పాఠశాలలో విద్యనభ్యసించింది. తర్వాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నుంచి 'చార్టర్డ్ అకౌంటెన్సీ' కోర్సు చేసింది. మాతృభాషతో పాటు ఇంగ్లిష్, హిందీలో నిష్ణాతురాలు సుమన్‌రావు. వీటితోపాటు సుమన్ కథక్ నాట్యకారిణి కూడా. అందుకు శిక్షణ కూడా తీసుకున్నది. సుమన్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తన ఫొటోలు, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 82 వేలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. సుమన్ ఇంతకు ముందు ఒక షోలో ఫ్యాషన్ డిజైనర్ మనిష్ మాల్హోత్రాతో కలిసి పనిచేసింది.



### నటి కావాలనుంది

నేను చిన్నతనం నుంచి నటిని కావాలని ఎన్నో కలలు కన్నా. నాకు బాలీవుడ్ నటి దీపికా పదుకునే అంటే ఎంతో ఇష్టం. ఆమె సినిమాలన్నీ చూస్తాను. దీపికాను ఆదర్శంగా తీసుకొని మోడల్‌గా రాణించాను. ఆ తర్వాత మిస్ ఇండియాగా రాణించాలని ఉండేది. ఆ ఆసక్తే ఇప్పుడు పోటీలో పాల్గొనేలా చేసింది. మిస్ వరల్డ్ కిరీటాన్ని కైవసం చేసుకోలేకపోయినా.. మిస్ వరల్డ్ ఆసియా కిరీటం దక్కించుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మోడల్‌గా రాణిస్తున్న నేను ఇకపై నటిగా అందరినీ మెప్పించాలనుకుంటున్నా.

**- సుమన్‌రావు,** మిస్ వరల్డ్ రెండో రన్నరప్

**ఇవీ అవార్డులు..**

'మిస్ నవీ ముంబై' పోటీలో మొదటి రన్నరప్‌గా కిరీటం పొందింది సుమన్ రావు. తర్వాత 'ఫెమినా మిస్ రాజస్థాన్ 2019' టైటిల్ కోసం ఆడిషన్ చేసింది. ఆ పోటీల్లో రాజస్థాన్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. 15 జూన్ 2019న ముంబైలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇండోర్ స్టేడియంలో 'అవుట్ గోయింగ్ టైటిల్ హోల్డర్ అనుక్రీత్ వాస్' ఫెమినా మిస్ ఇండియా వరల్డ్‌గా కిరీటం పొందింది. ఆ పోటీల్లో 'సబ్ కంటిస్టెంట్.. మిస్ రాంప్‌వాక్' అవార్డు గెలుచుకున్నది సుమన్ రావు. 'మిస్ వరల్డ్' పోటీకి 69వ ఎడిషన్‌లో సుమన్ భారతదేశానికి ప్రతినిధ్యం వహించింది. అక్కడ ఆమె 'టాప్ మోడల్ రౌండ్'లో మూడవ స్థానంలో.. 'టాలెంట్' విభాగంలో టాప్ 27వ స్థానంలో నిలచింది. ఆమె గ్రూప్ 14లో 'హెడ్–టు–హెడ్ ఛాలెంజ్' మొదటి దశ గెలుచుకున్నది. తద్వారా తర్వాతి రౌండ్‌కు అర్హత సాధించింది. ఈ రౌండ్‌లో ఆమె బంగ్లాదేశ్ యువతితో పోటీపడి 'మిస్ వరల్డ్ టాప్ 40'లో చోటు సంపాదించుకున్నది. సుమన్ 'బ్యూటీ విత్ ఎ పర్పస్' ప్రాజెక్ట్‌లో కూడా టాప్ 10లో ఎంపికైనది. 'ప్రాజెక్ట్ ప్రగతి' పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రచారం చేపడుతున్నది సుమన్‌రావు.

**లింగ సమానత్వంపై పోరు**

అందాల భామ సుమన్‌రావు దేశంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్నది. వీటిల్లో ముఖ్యంగా 'లింగ సమానత్వం'పై తన నిరసన తెలియజేస్తున్నది. అన్ని రంగాల్లోనూ మహిళలకు పురుషులతో పాటు సమానంగా అవకాశాలు ఉండాలని పోరాటం చేస్తున్నది. లింగ భేదం కారణంగా తాను ఎన్నో అవకాశాలు కోల్పోయిందని సోషల్ మీడియా వేదికగా తెలియజేసింది సుమన్‌రావు. దేశంలో పురుషులకు ప్రాధాన్యం ఎక్కువగా ఇవ్వడాన్ని ఖండిస్తున్నది. స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వంలో పురుషులతో సమానంగా హక్కులు ఉండాలని బల్లగుద్ది మరీ చెప్తున్నది.

...✍ సరస్వతి వనజ

# చలికాలంలో వెచ్చదనానికి!



- గోరువెచ్చని నీటిలో పాదాలను ఉంచడం అలవాటు చేసుకోండి. ఒక బకెట్ లాంటి పాత్రలో గోరువెచ్చని నీటిని తీసుకోండి. అందులో కొంచెం ఉప్పు వేయండి. ఈ నీటిలో పాదాలను 10 నుంచి 15 నిమిషాలు ఉంచండి. నిద్రపోవడానికి ముందు ఇలా చేస్తే చలిని తట్టుకోవచ్చు.
- పోర్టబుల్ వాటర్ హీటర్‌ను వాడుతున్నట్టయితే దాన్ని గదిలో ఉపయోగించి కొన్ని నీళ్లను ఆవిరయ్యేలా చేయండి. ఇది గదిలోని ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది.
- బాదాం, జీడి పప్పు, వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.
- బయటకు వెళ్తున్నప్పుడు నాణ్యమైన సాక్సులు, స్లీవ్‌లు ధరించడం మంచిది.
- వేడి చేసి చల్లార్చిన నూనెను శరీరానికి, వెంట్రుకలకు మర్దన చేయవచ్చు. కొబ్బరి, ఆలివ్, బాదాం నూనెను ఉపయోగించాలి. ఇది వెంట్రుకల ఆరోగ్యాన్నే కాకుండా శరీరంలోని తేమను కూడా నియంత్రిస్తుంది.

## సిరిముగ్గు

19 చుక్కలు.. సరిచుక్క 1 వచ్చేవరకు





**రావుల శరణ్య లత**
పాల్వంచ

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

## జార్ఖండ్ నాలుగో విడుతలో 56% పోలింగ్

20న తుది విడుత.. 23న ఫలితాలు

**రాంచీ:** జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన నాలుగో విడుత ఎన్నికల్లో 56.58 శాతం పోలింగ్ నమోదైంది. నాలుగు జిల్లాల పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం ఓటర్లు ఓటేశారని, పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉన్నదని ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు చెప్పారు. ఈ దఫా పోలింగ్‌లో రాష్ట్ర మంత్రులు రాజ్ పలివార్, అమర్‌కుమార్ బౌరితో పాటు 221 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. 15 స్థానాల్లోనూ అధికార బీజేపీ పోటీ చేస్తున్నది. దాని మాజీ మిత్రపక్షం అఖిల జార్ఖండ్ విద్యార్థి సంఘం (ఏజేఎస్‌యూ).. 2000లో జార్ఖండ్ ఏర్పాటైన తర్వాత తొలిసారి ఒంటరిగా బరిలో నిలిచింది. విపక్ష కూటమిలో జార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం), కాంగ్రెస్, ఆర్జేడీ సీట్ల సర్దుబాటుతో అభ్యర్థులను నిలిపాయి. ఇప్పటివరకు జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో 65 స్థానాలకు పోలింగ్ పూర్తయింది. ఈ నెల 20న మిగతా 16 స్థానాలకు చివరి విడుత పోలింగ్ జరుగనున్నది. ఈ నెల 23న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడుతాయి.

## రాహుల్ వ్యాఖ్యలపై నివేదిక కోరిన ఈసీ



**న్యూఢిల్లీ:** 'రేప్ ఇన్ ఇండియా' అంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీపై ఎన్నికల కమిషన్ (ఈసీ) దృష్టిపెట్టింది. జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గత వారం గొడ్డలో నిర్వహించిన బహిరంగసభలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగంలోని ఆ వ్యాఖ్యలకు సంబంధించి పూర్తి నివేదిక అందించాలని జార్ఖండ్ ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు ఈసీకి ఫిర్యాదుచేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. నివేదిక అందిన తర్వాత రాహుల్‌గాంధీపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈసీ నిర్ణయిస్తుందని జార్ఖండ్‌లోని ఎన్నికల అధికారులు చెప్పారు.

## సమాచార కమిషనర్లను నియమించండి!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం
- మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సూచన

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్(ఎస్ఐసీ)లలో సమాచార కమిషనర్లను మూడు నెలల్లోగా నియమించాలని కేంద్రం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే, సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు తగిన మార్గదర్శకాల్ని రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సీఐసీలో సమాచార కమిషనర్లను నియమించేందుకు ఏర్పాటు చేసే కమిటీలోని సభ్యుల వివరాల్ని రెండు వారాల్లోగా ఆర్టీఐ వెబ్‌సైట్లో పొందుపర్చాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. సీఐసీ, ఎస్ఐసీలలో సమాచార కమిషనర్లను నియమించాలని ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా నియమించలేదని పేర్కొంటూ ఉద్యమకారిణి అంజలి భరద్వాజ్ తరుపున ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి ఎస్ ఏ బొబ్డే, జస్టిస్‌లు బీ ఆర్ గవాయి, సూర్యకాంత్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై స్పందిస్తూ ఈ ఆదేశాల్ని జారీ చేసింది.





కర్ణాటకలోని ఓ పాఠశాలలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన నాటకం

# బాబ్రీ మసీదు.. మళ్లీ 'కూల్చివేత'!

- కర్ణాటకలోని ఓ పాఠశాలలో విద్యార్థుల నాటక ప్రదర్శన
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న సదానందగౌడ, కిరణ్‌బేడీ
- వివాదంగా మారిన ఘటన

**బెంగళూరు, డిసెంబర్ 16:** కర్ణాటకలోని కల్లడ్క గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనను ప్రతిబింబించేలా ఆదివారం సాయంత్రం ఓ నాటకాన్ని ప్రదర్శించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) నేత కల్లడ్క ప్రభాకర్‌భట్ నడుపుతున్న శ్రీరామ విద్యాకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తెలుపు, కాషాయ రంగు వస్త్రధారణలో ఉన్న అనేకమంది విద్యార్థులు 'శ్రీ రామచంద్ర్ కీ జై.. భారత్ మాతాకీ జై' అనే నినాదాల నడుమ బాబ్రీ మసీదు పోస్టర్‌వైపు దూసుకెళ్లడం, 1992లో అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనను గుర్తుచేస్తూ బ్యాగ్రౌండ్ నుంచి వస్తున్న వాయిస్ నడుమ 'జై హనుమాన్.. బోలో బజరంగ్‌బలీకీ జై' అనే నినాదాలకు స్పందిస్తూ ఆ పోస్టర్‌ను చింపి కిందపడేయడం ఈ వీడియోలో కనిపిస్తున్నది. ఆ పాఠశాలలో 'క్రీడోత్సవం' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి డీవీ సదానందగౌడ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పాఠశాలను నడుపుతున్న ట్రస్టుకు అధిపతిగా ఉన్న కల్లడ్క ప్రభాకర్‌భట్ ఆరెస్సెస్ దక్షిణమధ్య ప్రాంతీయ విభాగంలో కార్యవర్గ సభ్యునిగా కొనసాగుతున్నారు. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఆయన ఎంతో పలుకుబడి కలిగిన ఆరెస్సెస్ నేత. శ్రీరామ విద్యాకేంద్రం నిర్వాహకులు తమ విద్యార్థులతో బాబ్రీ మసీదు కూల్చివేత నాటకాన్ని ప్రదర్శించడంపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. 'బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనను ప్రతిబింబించేలా కర్ణాటకలో ఆరెస్సెస్ నేత నడుపుతున్న ఓ పాఠశాల తమ విద్యార్థులతో నాటకాన్ని ప్రదర్శించింది. మన సమాజాన్ని ఆరెస్సెస్-బీజేపీ పూర్తిగా కబ్జాచేసి దేశ విద్యా వ్యవస్థ భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. దీన్ని మనం ప్రతిఘటించాల్సిన అవసరమున్నది' అని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రచార విభాగం ఇన్‌చార్జి వైబీ శ్రీవాత్సవ పేర్కొన్నారు.

# ఆకాశాన్ని తాకేలా రామమందిరం

- నాలుగు నెలల్లో నిర్మిస్తాం
- జార్ఖండ్ ఎన్నికల ప్రచార సభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వెల్లడి
- కాంగ్రెస్, జేఎంఎం జట్టు కట్టడంపై తీవ్ర విమర్శలు



జార్ఖండ్‌లోని పాకుర్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న అమిత్ షా



రామమందిరం ఊహాచిత్రం

**పాకుర్ (జార్ఖండ్), డిసెంబర్ 16:**

ఆకాశాన్ని తాకేలా అతి పెద్ద రామ మందిరాన్ని అయోధ్యలో నిర్మిస్తామని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. మరో నాలుగు నెలల్లో ఈ నిర్మాణం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. జార్ఖండ్‌లో ఐదో దశ ఎన్నికల సందర్భంగా సోమవారం పాకుర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. 'అయోధ్యపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. నాలుగు మాసాల్లో అయోధ్యలో ఆకాశాన్ని తాకేలా అతి పెద్ద రామమందిరం నిర్మిస్తాం' అని అమిత్ షా తెలిపారు. రామ జన్మభూమిలో రామ మందిర నిర్మాణం జరగాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు గత వందేండ్లుగా డిమాండ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ హయాంలో దేశాభివృద్ధి జరగలేదని, సరిహద్దుల్లో భద్రత కరువైందని తూర్పారబట్టారు. ప్రజల మనోభావాలను కూడా ఆ పార్టీ గౌరవించలేదని ఆక్షేపించారు.

### సిబల్‌కు ఎందుకంత కడుపునొప్పి

రామ జన్మభూమి కేసు విషయమై కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్‌పై షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామజన్మభూమి కేసుపై విచారణకు తొందరేమీ లేదని, తర్వాతైనా దానిపై విచారణ జరుపవచ్చని సుప్రీంకోర్టు ముందు సిబల్ వాదించారని తెలిపారు. 'ఈ కేసు విషయంలో ఆయనకు అంత కడుపు నొప్పి ఎందుకు?' అంటూ ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాలుగా చిక్కుముడిగా ఉన్న అయోధ్య భూవివాదంపై గత నెల 9న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. వివాదాస్పదంగా ఉన్న 2.77 ఎకరాల భూమిలో రామమందిరాన్ని నిర్మించాలని కోర్టు స్పష్టంచేసింది. అలాగే, అయోధ్యలోనే ఒక మసీదు నిర్మాణం కోసం ఐదెకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, మూడు నెలల్లోగా ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి రామమందిరం నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. తీర్పు వెలువడిన రెండు రోజుల్లోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రామ మందిరం నిర్మాణం పనులు సమీక్షించేందుకు ఓ ట్రస్ట్‌ను కూడా ఏర్పాటు చేసింది.

### దేశద్రోహులను ఎన్నుకోవద్దు

బ్రిటిషర్లకు వ్యతిరేకంగా 'సంతుల్ హుల్' పేరిట గిరిజనుల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులకు అమిత్ షా జోహార్లు అర్పించారు. బ్రిటిషర్లు దేశంలోకి ప్రవేశించి, అధికారాన్ని చెలాయించడానికి మీర్ జాఫర్ వంటి దేశ ద్రోహులు సాయపడ్డారని, ఇప్పుడు అలాంటి వాళ్లే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని విమర్శించారు. 'మీర్ జాఫర్ వంటి దేశద్రోహులను మీ ప్రతినిధులుగా ఎన్నుకోవద్దు. బీజేపీకి ఓటేసి గెలిపించండి. 56 అంగుళాల ఛాతీ కలిగిన ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని కాపాడుతూ.. అభివృద్ధి చేస్తారు' అని వ్యాఖ్యానించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నాయకుడు హేమంత్ సొరేన్ తిరిగి సీఎం కుర్చీలో కూర్చోవాలని తహతహలాడుతూ కాంగ్రెస్ ఒడిలోకి చేరారని విమర్శించారు. జార్ఖండ్ రాష్ట్ర ఉద్యమాన్ని ప్రారంభించిన యువతపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తూటాల్ని పేల్చిందని. భాష్పవాయు గోళాల్ని ప్రయోగించిందని విరుచుకుపడ్డారు. సీఎం కుర్చీ కోసం ఇప్పుడు అదే పార్టీతో హేమంత్ జట్టుకట్టారని, దీనికి సిగ్గుపడాలని అన్నారు. జేఎంఎం ప్రభుత్వ హయాంలో నక్సలిజం పెరిగిపోయిందని, అయితే, మోదీ సర్కారు నక్సలిజాన్ని భూమిలో 20 అడుగుల లోతులో పూడ్చిపెట్టిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను కుదించకుండానే ఓబీసీ రిజర్వేషన్ శాతాన్ని పెంచుతామని షా రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## ఏపీలో టీడీపీ ఆఫీస్‌కు న్యాయపరమైన చిక్కులు

- ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఎమ్మెల్యే ఆర్కే పిల్
- ప్రభుత్వానికి, టీడీపీకి, కలెక్టర్‌కు నోటీసులు జారీ

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతమైన మంగళగిరి మండలం ఆత్మకూరులో టీడీపీ కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వం భూమిని ఆక్రమించారంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిల్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ అనంతరం ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు, టీడీపీకి హైకోర్టు నోటీసులు జారీచేసింది. అయితే ఈ నోటీసులపై టీడీపీ ఇప్పటివరకు స్పందించలేదు. వాగు, బోరంబోకు భూములకు ఈ స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిదని ఎమ్మెల్యే ఆర్కే పేర్కొన్నారు. వాగు, చెరువు, పోరంబోకు భూములను ఆఫీసులకు, పార్టీ కార్యాలయాలకు కేటాయించకూడదని చట్టం చెబుతున్నదని, అయినా చంద్రబాబు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని అన్నారు.

## ఏసీబీకి చిక్కిన కర్నూలు సీఐ

రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**కర్నూలు:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు సీఐ రామయ్యానాయుడు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. కర్నూలు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో రెండు నెలల కింద సభ్యులను మోసగించిన అభియోగంపై నవకాంత్ చిట్‌ఫండ్ సంస్థపై చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను అధికారులు సీఐ రామయ్యానాయుడుకు అప్పగించారు. ఈ క్రమంలో సంస్థ నిర్వాహకుల్లో ఒకరైన ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేయకుండా ఉండేందుకు సీఐ రూ.40 వేలు డిమాండ్‌చేశాడు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని ఆదినారాయణరెడ్డి బంధువు శివరామిరెడ్డి ఈ నెల 13న ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు సోమవారం సీఐ రామయ్యానాయుడు ఇంటి సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో మధ్యవర్తి అయిన న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డికి బాధితుడు డబ్బులు ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డితోపాటు సీఐని కూడా అరెస్టు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ నాగభూషణం వివరించారు. మరోవైపు సీఐ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఆస్తులు పట్టుబడితే మరో కేసు కూడా నమోదుచేసే అవకాశం ఉన్నది.

# ఆ బస్టాప్‌లో అదే భయం!

- ఢిల్లీలోని 'నిర్భయ' ఘటనకు సాక్షిగా నిలిచిన ప్రదేశం
- ఏడేండ్లు గడిచినా అదే తీరు.. రాత్రి తొమ్మిది దాటితే పోకిరీలకు అడ్డా

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, మహిళల భద్రత పట్ల ఆందోళన పెంచిన 'నిర్భయ' ఘటన జరిగి సోమవారంతో ఏడేండ్లు నిండాయి. ఈ దారుణ ఘటనకు మూలకారణమైన దక్షిణ ఢిల్లీలోని మునిర్కా బస్టాప్ నేటికీ చీకట్లోనే మగ్గుతున్నది. రాత్రి తొమ్మిది దాటితే అరాచకశక్తులకు అడ్డాగా మారుతున్నది. అక్కడ భద్రత విషయంలో ఎలాంటి పురోగతి లేదు. బస్టాప్ వద్ద నేటికీ సరైన నిఘా లేకపోవడంతో తరచూ లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నామని ఢిల్లీ మహిళలు వాపోతున్నారు. ప్రతిరోజూ పోకిరీల కామెంట్లు, వెకిలి చేష్టలతో ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. మహిళల భద్రత పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేనంతవరకు నిర్భయ ఘటనలు కొనసాగుతూనే ఉంటాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



నిర్భయ నిందితులకు ఉరిశిక్ష అమలుపై ఆలస్యాన్ని నిరసిస్తూ సోమవారం తీహార్ జైలు వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

### చరిత్రలో మాయని మచ్చ..

2012, డిసెంబర్ 16న రాత్రి తొమ్మిది గంటల సమయంలో 23 ఏండ్ల విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి మునిర్కా బస్టాప్‌లో బస్సు ఎక్కింది. బస్సులోని ఆరుగురు దండగులు ఆమెపై క్రూరంగా లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను, ఆమె స్నేహితుడిని రోడ్డు మీద విసిరేశారు. కొన్నిరోజులు మృత్యువుతో పోరాడిన ఆ యువతి దవాఖానలో కన్నుమూసింది. తనపై అఘాయిత్యం జరుపుతున్న దండగులను చివరి క్షణం వరకు ఎదిరించిన ఆ యువతికి ప్రజలు 'నిర్భయ' అని పేరుపెట్టారు. పోలీసులు నిందితులైన ఆరుగురిని అరెస్టుచేశారు. విచారణ అనంతరం రాంసింగ్ తీహార్‌జైల్లో ఆత్మహత్య చేసుకోగా.. మరో నిందితుడు మైనర్ కావడంతో మూడేండ్ల శిక్ష అనంతరం విడుదలయ్యాడు. మిగతా నలుగురు దోషులకు సుప్రీంకోర్టు ఉరిశిక్ష విధించింది. వారికి త్వరలోనే శిక్ష అమలవుతుందని వార్తలు వస్తున్నాయి.

### నీచంగా ప్రవర్తిస్తారు..

'నేను మునిర్కాలో బస్సు దిగే సరికి అక్కడ చాలా ఆటోలు ఉంటాయి. కానీ, ఎన్ని డబ్బులు ఇస్తామన్నా ఆటో డ్రైవర్లు.. డ్రాప్ చేయడానికి రారు. ఆటో కోసం అడుగుతూ ఉంటే వెకిలిగాచూస్తూ.. అసభ్యంగా సైగలు చేస్తూ నీచంగా ప్రవర్తిస్తారు. ఎవరూ రావడం లేదు కదా.. అని కాలినడకన వెళ్తుంటే వెనకాలే ఆటోలో అనుసరిస్తూ అసభ్యంగా తిడుతూ వేధింపులకు గురిచేస్తారు' అని రాణికుమారి అనే బ్యూటీషియన్ చెప్పారు.

### ఆటో దిగమని హెచ్చరించాడు..

'ఆటో డ్రైవర్లు మమ్మల్ని ఇంటి వద్ద దిగబెట్టడానికి తిరస్కరిస్తే ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం చెప్తున్నది. అదే ధైర్యంతో ఓ రోజు రాత్రి నేను ఆటో ఎక్కి కూర్చున్నాను. డ్రైవర్ మాత్రం మర్యాదగా దిగమని హెచ్చరించాడు. నేను ఫిర్యాదు చేస్తానని బెదిరించాను. వెంటనే స్వరం మార్చిన డ్రైవర్.. సరిపడా పెట్రోల్ లేదు కాబట్టి నేను ఎక్కడికీ రాలేను అని చెప్పాడు. అతడు అబద్ధం ఆడుతున్నాడని తెలుసు. కానీ ఏం చేయగలం. ఆ రోజు చీకట్లోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది' అని మీనా అనే మహిళ ఆవేదన వ్యక్తంచేశారు.

### పోకిరీలకు అడ్డా.. మునిర్కా బస్టాప్

ఈ నేపథ్యంలో నిర్భయ ఘటనకు కారణమైన మునిర్కా బస్టాప్ వద్ద భద్రత విషయంలో ఎలాంటి మార్పు రాలేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. 'నేను ఢిల్లీ మొత్తం ప్రయాణించినా నా తల్లిదండ్రులు భయపడరు. కానీ, పనిమీద బయటకు వెళ్లి మేము నివాసం ఉండే మునిర్కాకు వస్తున్నానంటే భయపడిపోతారు. నేను ఇక్కడ దిగేసరికి ఎవరో ఒకరు వచ్చి తీసుకెళ్తారు. నిర్భయ ఘటన ఇంకా వారిని వెంటాడుతూనే ఉన్నది. అందుకు తగ్గట్టే ప్రస్తుత పరిస్థితులున్నాయి. రాత్రి తొమ్మిది దాటితే చాలు పోకిరీలకు బస్టాప్ అడ్డాగా మారుతున్నది' అని 24 ఏండ్ల ఉద్యోగిని అన్నారు.



### ఆజాంఖాన్ కుమారుడి ఎన్నిక రద్దు

వయసు ఎక్కువగా చూపి ఎన్నికల్లో పోటీచేయడంపై హైకోర్టు తీర్పు



అబ్దుల్లా

**బెంగళూరు:** సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత, రాంపూర్ ఎంపీ ఆజాంఖాన్ కుమారుడు అబ్దుల్లా ఆజాంఖాన్‌కు హైకోర్టు షాకిచ్చింది. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు సోమవారం కీలక తీర్పునిచ్చింది. 2017 మార్చినెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సోర్ నియోజకవర్గం నుంచి అబ్దుల్లా ఆజాంఖాన్ గెలుపొందారు. అయితే, ఆయన నామినేషన్ దాఖలు సమయంలో వయసు ధ్రువీకరణకు సంబంధించి నకిలీ పత్రాలు సమర్పించాడని అక్కడి నుంచి పోటీ చేసిన బీఎస్పీ అభ్యర్థి కాజింఖాన్ (ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు) పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు విచారించింది. 2017లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే నాటికి అబ్దుల్లా ఆజాంఖాన్‌కు ఎన్నికల నిబంధనల మేరకు ఉండాల్సిన 25 ఏండ్ల వయసు రాలేదని, అయినా కూడాతన వయసు 25 ఏండ్ల కంటే ఎక్కువే అని తెలిపే నకిలీ పత్రాలతో ఆయన ఎన్నికల్లో పోటీచేశారని కోర్టు పేర్కొన్నది. కాజింఖాన్ పిటిషన్‌పై విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు గత సెప్టెంబర్ 27న తీర్పును రిజర్వ్‌లో పెట్టింది.



జూనియర్ అటవీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మోజంఅలీఖాన్‌ను అభినందిస్తున్న జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్లు

## అటవీశాఖ అధికారుల సంఘం ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ మోజం అలీఖాన్

అడవుల అభివృద్ధికి కృషిచేస్తాం: కొత్త సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ జూనియర్ అటవీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ మోజం అలీఖాన్ సోమవారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డీ కిషన్, ప్రధాన కార్యదర్శిగా భాగ్యనాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా కిరణ్, కోశాధికారిగా బీ ప్రశాంత్ తదితరులు ఎన్నికయ్యారు. మూడేండ్లపాటు ఈ కొత్త కార్యవర్గం కొనసాగనున్నది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ ఫారెస్ట్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కారమయ్యేలా చేస్తానని మోజంఅలీఖాన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అడవుల అభివృద్ధికి, హరితహారం విజయవంతానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు.

# వేరుశనగ ఉత్పత్తిలో చరిత్ర సృష్టిస్తాం

- 1,200 ఎకరాల్లో కే-6 రకం సాగు
- బీచుపల్లి మిల్లు ద్వారా తొలుత వేరుశనగ నూనె, ఆ తర్వాత పామాయిల్ ఉత్పత్తి
- అవగాహన సదస్సులో మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తిలో సోమవారం 'వేరుశనగ సాగు-మార్కెటింగ్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేరుశనగ ఉత్పత్తి, మార్కెటింగ్‌లో రాష్ట్రం రానున్న రెండుమూడేండ్లలో చరిత్ర సృష్టించబోతున్నదని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. 'వేరుశనగ సాగు-మార్కెటింగ్' అనే అంశంపై వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా వ్యవసాయశాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. రైతులు ప్రతి నాలుగైదేండ్లకోసారి విత్తనమార్పిడి చేయాలని, శాస్త్రీయ పద్ధతుల్లో పంటలను సాగుచేయాలని పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనలను రైతులు తప్పకుండా పాటించాలన్నారు. ఆయిల్‌పామ్‌కు మంచి భవిష్యత్తు ఉన్నదని, ఇలాంటి పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని, 50,000 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ పండిస్తే తొలిపంటకు సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. త్వరలో వనపర్తి జిల్లాలో వేరుశనగ శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించనున్నామని చెప్పారు. బీచుపల్లి ఆయిల్ మిల్లు ద్వారా రానున్న నాలుగేండ్లలో వేరుశనగ నూనెను, ఆ తర్వాత పామాయిల్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. రాష్ట్రంలోని రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనాన్ని అందించి దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది 1,200 ఎకరాల్లో కే-6 రకం పంటను పండిస్తున్నామని, వచ్చే ఏడాది ఆయిల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా 12,000 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని చెప్పారు. మున్ముందు రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా వేరుశనగను నేరుగా విదేశాలకు ఎగుమతిచేయాలని యోచిస్తున్నామన్నారు. నాణ్యమైన వేరుశనగ సాగుకు, విత్తనోత్పత్తికి రైతులు ఒకే రకమైన విత్తనాన్ని వాడాలని, మెట్టప్రాంతాల్లో వేరుశనగను అధికంగా పండించాలని సూచించారు. వేరుశనగ యాజమాన్య పద్ధతులపై రైతులకు మండలస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. పౌల్ట్రీరంగంలో మొక్కజొన్న ప్రధానపాత్ర పోషిస్తున్నందున రాబోయే రోజుల్లో మొక్కజొన్నకూ ప్రాధాన్యమిస్తామని, మార్చి తర్వాత రాష్ట్రంలో బిందు, తుంపర్ల సేద్యాన్ని పెంచుతామని మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు.

## ఎన్టీఆర్‌పై కుట్రలో ప్రధాన భాగస్వామి ఆయనే!

టీడీపీ నేత యనమలపై వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఫైర్

**అమరావతి:** టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఏపీ సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వంలో కీలక పోస్టులన్నీ సొంత సామాజికవర్గానికే కేటాయించారని సోమవారం యనమల ఆరోపించారు. ఈ నేపథ్యంలో యనమలతోపాటు టీడీపీ అధినేత చంద్రబాబుపై కూడా విజయసాయిరెడ్డి విమర్శలుచేశారు. 'కిరసనాయిలుకు సెటిల్మెంట్ల ఆదాయం పోయింది. మరోవైపు కుల దైవం చంద్రబాబు రాజకీయంగా ఉనికి కోల్పోతుండటాన్ని చూడలేక దృష్టి మళ్లించే కథనాలు వదులుతున్నాడు. ఎన్నికల ముందు ఇలాంటి అసత్యాలు లెక్కలేనన్ని అచ్చేసినా ప్రజలు ఛీ కొట్టారు. అయినా యజమాని కోసం పిచ్చి రాతలు రాస్తూనే ఉన్నాడు. యనమలగారు కూడా నీతి బోధనలు చేస్తున్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కుట్రలో ఈయన ప్రధాన భాగస్వామి. అప్పటి పల్లకీ సేవకు తన బంధువులకు అనేక పదవులు, వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకున్నాడు. కులజ్యోతి రాసిన కడుపు మంట వార్తను పట్టుకొని పత్తిగింజ కబుర్లు చెబుతున్నాడు' అని విజయసాయిరెడ్డి ఎద్దేవాచేశారు.

## ఆర్టీసీ విలీనం బిల్లుకు ఏపీ అసెంబ్లీ ఆమోదం

**అమరావతి:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేస్తామంటూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేస్తూ రూపొందించిన బిల్లుకు సోమవారం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ప్రభుత్వ అనుబంధ సంస్థగా ఉన్న ఆర్టీసీ ఇక నుంచి పూర్తిస్థాయి ప్రభుత్వరంగ సంస్థగా మారనున్నది. ఆర్టీసీ విలీనంపై అసెంబ్లీలో జగన్ మాట్లాడుతూ.. ఆర్టీసీలో పనిచేస్తున్న 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నామని ప్రకటించారు. జనవరి 1వ తేదీ వీరంతా ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతారని చెప్పారు. దీనికి ముందు ఆర్టీసీ విలీనానికి సంబంధించిన బిల్లు ను మంత్రి పేర్ని నాని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఆర్టీ సీ కార్మికులను ప్రభుత్వంలో విలీనంచేసేందు కు చట్టం తెస్తున్నామని తెలిపారు. పాదయాత్ర లో ఆర్టీసీ కార్మికుల కష్టాలను సీఎం జగన్ ప్ర త్యక్షంగా చూశారని, ఇకపై ప్రజారవాణాశాఖలో ఆర్టీసీ కార్మికులను విలీనంచేస్తామన్నారు. ఉద్యోగ భద్రత కోసమే ప్రభుత్వంలో విలీనంచేస్తున్నట్టు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని మంత్రి తెలిపారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 17 డిసెంబర్ 2019



'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో రష్మిక మందన్న



'దర్బార్' చిత్రంలో నయనతార, రజనీకాంత్

# ఐయామ్ ఏ బ్యాడ్ కాప్

రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'దర్బార్'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదలచేసింది. రౌడీలపై రజనీకాంత్ కత్తిదూస్తూ కనిపించిన సన్నివేశాలతో ఆసక్తిగా ట్రైలర్ ప్రారంభమైంది. 'సార్ వాళ్లకు చెప్పండి పోలీసుల దగ్గరికి లెఫ్ట్‌లో రావచ్చు, రైట్‌లో రావచ్చు కానీ స్ట్రెయిట్‌గా రావద్దని' అంటూ రజనీ తనదైన శైలి మేనరిజమ్స్‌తో చెప్పిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ఆదిత్య అరుణాచలం అనే ముంబయి సిటీ పోలీస్ కమీషనర్‌గా రజనీకాంత్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. 'ఒరిజినల్‌గానే విలన్‌నమ్మా.. ఐయామ్ ఏ బ్యాడ్ కాప్' అనే చివరి డైలాగ్ అభిమానుల్ని ఆకట్టుకుంటున్నది. జనవరి 9న ఈ సినిమాను విడుదలచేయనున్నట్లు సమాచారం. సామాజిక ఇతివృత్తానికి సస్పెన్స్ థ్రిల్లింగ్ అంశాలను జోడిస్తూ దర్శకుడు మురుగదాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నయనతార కథానాయికగా నటిస్తున్నది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్.వి.ప్రసాద్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు.



రాశీఖన్నా, సాయితేజ్, రావు రమేష్



స్టెప్పులేస్తున్న సత్యరాజ్, అల్లు అరవింద్

# పండగ వేడుక!

సాధారణంగా చిత్ర ప్రీరిలీజ్ వేడుకల్లో నాయకానాయికలతో పాటు చిత్రబృందం సినిమాతాలూకు అనుభూతుల్ని, ఆనందాల్ని మాటల రూపంలో అభిమానులతో పంచుకుంటుంటారు. ఆదివారం జరిగిన 'ప్రతిరోజూ పండగే' ప్రీరిలీజ్ వేడుకలో చిత్రబృందం నృత్యాలతో సందడిచేశారు. హీరోహీరోయిన్లు సాయితేజ్, రాశీఖన్నా, దర్శకుడు మారుతి, సమర్పకుడు అల్లు అరవింద్‌తో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణులంతా వేదికపై స్టెప్పులతో అభిమానుల్ని అలరించారు. 'కెరీర్‌లో ఓ రెండేళ్ల పాటు ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ఆ సమయంలో మెగా అభిమానులు తనకు అండగా నిలిచారు. అభిమానులు గర్వపడే సినిమా ఇది' అని ఈ సందర్భంగా సాయితేజ్ పేర్కొన్నారు. ఈ నెల 20న ఈ సినిమా విడుదలకానుంది.



రాశీఖన్నా





సత్యరాజ్, నిఖిలావిమల్, కార్తి, జీతూజోసెఫ్

# అక్కాతమ్ముడి అనుబంధం

'అందమైన కుటుంబ కథా చిత్రమిది. అక్కాతమ్ముళ్ల అనుబంధంతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారు' అని అన్నారు కార్తి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దొంగ'. జీతుజోసెఫ్ దర్శకుడు. జ్యోతిక, సత్యరాజ్, నిఖిలావిమల్ కీలక పాత్రధారులు. హర్షిత మూవీస్ పతాకంపై రావూరి.వి.శ్రీనివాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 20న విడుదలకానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇది. వినోదం, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాం' అని తెలిపారు. పాజిటివ్, నెగెటివ్ షేడ్స్‌తో తన పాత్ర ఉత్కంఠను పంచుతుందని నటుడు సత్యరాజ్ పేర్కొన్నారు. చిరంజీవి కెరీర్‌లో 'దొంగ' ఎంత పెద్ద విజయాన్ని సాధించిందో అంతకుమించిన పేరు కార్తికి ఈ సినిమాతో రావాలని నిర్మాత సన్నిహితులు చక్రవర్తి, వెంకట్ అన్నారు. కార్తి మాట్లాడుతూ 'కథానుగుణంగా ఈ సినిమాకు 'దొంగ' టైటిల్ పెట్టాం. మూడు పాత్రలు ప్రధానంగా ఆద్యంతం థ్రిల్లింగ్‌ను పంచుతుంది. 'నా పేరుశివ', 'ఊపిరి' సినిమాల్ని కలిపి చేస్తే ఎలా ఉంటుందో అలాంటి వైవిధ్యమైన చిత్రమిది. కథలో ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. కుటుంబంతో కలిసి చూసే చక్కటి పండగలాంటి సినిమా ఇది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివనాగేశ్వరరావు, హనుమాన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నికృష్ణ 'కింగ్‌ఫిషర్'



విజయేంద్రప్రసాద్, చిన్నికృష్ణ

ప్రముఖ రచయిత చిన్నికృష్ణ నిర్మాణరంగంలోకి అడుగుపెడుతూ చిన్నికృష్ణ స్టూడియోస్ బ్యానర్‌ను స్థాపించారు. తొలి ప్రయత్నంగా 'కింగ్‌ఫిషర్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాకు ఆయన తనయులు చిరంజీవిసాయి, బద్రీనాథ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. చిత్ర బ్యానర్, టైటిల్ లోగోను సోమవారం హైదరాబాద్‌లో వి.వి.విజయేంద్రప్రసాద్, పరుచూరి గోపాలకృష్ణ, బి.గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ 'మా సంస్థ ద్వారా ప్రతిభావంతులైన ఔత్సాహికుల్ని ప్రోత్సహిస్తాం. 'కింగ్‌ఫిషర్' సినిమాకు ఓ యువ దర్శకుడు నిర్దేశక బాధ్యతల్ని నిర్వర్తిస్తాడు. కింగ్‌ఫిషర్ అంటే విభిన్న రంగులు కలిగిన ఓ పక్షి పేరు. ఈ పేరు వినగానే మత్తు కలిసిన బీర్ గుర్తుకొస్తుంది. కానీ మా సినిమా మత్తు వదిలిస్తుంది. మోసగించే వాళ్ల మత్తుని వదిలించి సమాజంలో వారిని మంచి మనుషులుగా మారుస్తుంది. ఇదే సినిమా కథాంశం. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో తెలియజేస్తా' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు, బి.గోపాల్, కె.యస్.రవీంద్ర, మాధవ్ పట్నాయక్, దాసరి కిరణ్, కత్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 2022లో పెళ్లాడతా!



రాజ్‌తరుణ్

'స్వచ్ఛమైన ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిది. ప్రేమేలోకంగా బతికే ఓ జంట ప్రణయప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా ఉంటుంది' అని అన్నారు రాజ్‌తరుణ్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీఆర్‌కృష్ణ దర్శకుడు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ ' టర్కీ చిత్రం 'లవ్ లైక్స్ కో ఇన్సిడెన్సెస్' స్ఫూర్తితో తెరకెక్కించాం. గత సినిమాల్లో హుషారుతనం ఉన్న యువకుడిగా లౌడ్‌నెస్‌తో కూడిన పాత్రల్లో ఎక్కువగా నటించాను. ఆ పంథాకు భిన్నంగా ఇందులో నా పాత్ర తక్కువ సంభాషణలతో చాలా సెటిల్డ్‌గా ఉంటుంది.'లవర్' తర్వాత అనివార్య కారణాల వల్ల నా కెరీర్‌కు విరామం వచ్చింది. గత సినిమాల ఫలితాల్ని దృష్టిలో పెట్టుకొని కథల ఎంపికలో జాగ్రత్తలు వహిస్తూ మంచి సినిమాతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకున్నాను. ఈ విరామంలో చాలా ట్రావెలింగ్ చేశాను. నార్త్, ఈస్ట్ ప్రాంతాలన్నీ తిరిగాను. సినీ ప్రపంచానికి పూర్తి దూరంగా ఉన్న ఈ సమయంలో వ్యక్తిగతంగా నన్ను నేను విశ్లేషించుకునే అవకాశంతో పాటు మానసిక ప్రశాంతత దొరికింది. జయాపజయాల గురించి ఆలోచించకుండా నా పరిధిలో సినిమాలకు న్యాయం చేయాలని అర్థంచేసుకున్నాను. ప్రస్తుతం 'ఒరేయ్‌బుజ్జిగా'తో పాటు అన్నపూర్ణ స్టూడియోస్‌లో శ్రీనివాస్ గవిరెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. రానా నిర్మాణ సంస్థలో మరో సినిమా ఉంటుంది. చాలా కాలంగా ప్రేమలో ఉన్నాను. 2022లో పెళ్లిచేసుకోబోతున్నా' అని చెప్పారు.



వేదిక

# యథార్థ ప్రేమకథ



నరసింహనంది, దివ్యారావు, వరుణ్, ప్రసన్నకుమార్

'యథార్థ ఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. ఇద్దరూ డిగ్రీ కాలేజీ స్టూడెంట్స్ మధ్య మొదలైన ప్రేమకు ఎలాంటి అవాంతరాలు ఎదురయ్యాయన్నది ఆసక్తిని పంచుతుంది' అని అన్నారు నరసింహ నంది. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'డిగ్రీ కాలేజ్'. వరుణ్, దివ్యారావు జంటగా నటించారు. శ్రీ లక్ష్మి నరసింహా సినిమా సంస్థ నిర్మించింది. జనవరి 1న ఈ చిత్రం విడుదలకానుంది. ఇటీవల ట్రైలర్స్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఓ అమ్మాయి, ఓ అబ్బాయి క్లాస్ రూమ్‌లో, బయట ఎలా ప్రవర్తిస్తారనే అంశాల్ని వాస్తవికంగా ఆవిష్కరించాం. నా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా కమర్షియల్ హంగులతో సినిమాను రూపొందించాను' అని తెలిపారు. పంపిణీదారుడు బాపిరాజు మాట్లాడుతూ 'రొమాన్స్‌తో పాటు అంతకుమించిన భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ప్రేమ కథ ఉంటుంది' అని చెప్పారు. కథానుగుణంగానే సినిమాలో రొమాన్స్ పెట్టడం జరిగిందని హీరో వరుణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాస్ సినిమాలు ఇష్టమే

'సంప్రదాయం, గ్లామర్ సమ్మిళితంగా సినిమాలో నా పాత్ర భిన్న పార్శ్వాలతో సాగుతుంది. నటనకు ఆస్కారం ఉంటుంది' అని తెలిపింది వేదిక. సుదీర్ఘ విరామం తర్వాత తెలుగులో ఆమె నటించిన చిత్రం 'రూలర్'. బాలకృష్ణ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని సి.కల్యాణ్ నిర్మించారు. ఈ నెల 20న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో వేదిక పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''కాంచన-3' తెలుగులో అనువాదమై పెద్ద విజయాన్ని సాధించింది. ఆ సినిమా చూసి 'రూలర్' చిత్రబృందం నన్ను సంప్రదించారు. ఆధిపత్యధోరణి మనస్తత్వమున్న యువతిగా సినిమాలో విభిన్నంగా కనిపిస్తాను. నా పాత్రలో మాస్ ఎలిమెంట్స్ ఉంటాయి. తెలుగు చిత్రసీమలోని లెజెండరీ నటుల్లో ఒకరైన బాలకృష్ణతో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. ప్రతి సినిమాను తొలిచిత్రంగానే భావిస్తూ నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తారాయన. యూనిట్‌లోని అందరిని ఒకేలా గౌరవిస్తూ పాజిటివ్‌గా ఆలోచిస్తారు. కెరీర్‌లో ఒకే తరహా పాత్రలు చేస్తుంటే బోర్ కొడుతుంది. మాస్ మసాలా సినిమాల్లో నటించడం నాకు ఇష్టమే. ఆ ఆలోచనతోనే ఈ సినిమా అంగీకరించాను. 'బాణం' తర్వాత తెలుగులో కొన్ని అవకాశాలు వచ్చాయి. తమిళం, కన్నడ, హిందీ భాషల్లో బిజీగా ఉండటంతో టాలీవుడ్‌పై దృష్టిపెట్టలేకపోయాను. మంచి కథలు వస్తే భవిష్యత్తులో తెలుగులో నటిస్తాను. ఇటీవలే హిందీలో నటించిన 'ది బాడీ' సినిమా ద్వారా రిషికపూర్, ఇమ్రాన్‌హష్మీ వంటి గొప్ప నటులతో కలిసి పనిచేసే అవకాశం దొరికింది' అని తెలిపింది.

